PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 72 | విజయవాడ, శనివారం 12 అక్టోబర్ 2024 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 12 October 2024 | Rs

సిటీ



సెమీస్‌కు చేరాలంటే గెలవాల్సిందే..

- రేపు ఆస్ట్రేలియా మహిళలతో కీలక పోరు

2

విజయదశమి సందర్భంగా పాఠకులకు, శ్రేయోభిలాషులకు, ప్రకటనకర్తలకు , ఏజెంట్లకు ప్రజాశక్తి శుభాకాంక్షలు.

శనివారం మా కార్యాలయానికి సెలవు.

ఆదివారం సంచిక వెలువడదు.

పునర్దర్శనం సోమవారం.

- చీఫ్ జనరల్ మేనేజర్

ధరల అదుపు ఉత్తదే

93.3శాతం మందిలో అసంతృప్తి

రిజర్వుబ్యాంకు 'కాన్ఫిడెన్స్' సర్వే

ఉపాధి కల్పనపైనా పెదవి విరుస్తున్న జనం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

మోడీ ప్రభుత్వ పాలనలో అనేక కీలక రంగాలపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధరల అదుపు, ఉపాధి కల్పన వంటి అంశాలపై ప్రజల్లో అసంతృప్తి గణనీయంగా పెరుగుతోంది. సాక్షాత్తు రిజర్వు బ్యాంకే ఈ విషయం వెల్లడించింది. ప్రతి రెండు నెలలకోసారి దేశ వ్యాప్తంగా నిర్వహించిన కన్స్యూమర్ కాన్ఫిడెన్స్ సర్వేను రిజర్వుబ్యాంకు ఇటీవల విడుదల చేసింది. సెప్టెంబర్ ఒకటవ తేది నుండి 10వ తేది వరకు దేశ వ్యాప్తంగా 19 ప్రధాన నగరాల్లో ఈ సర్వే నిర్వహించినట్లు ఆర్‌బిఐ తెలిపింది. సాధారణ ఆర్థిక పరిస్థితి, ఉద్యోగ, ఉపాధి కల్పన, ధరల స్థితి, సొంత ఆదాయం, ఖర్చులకు సంబంధించి వివిధ తరగతులకు చెందిన ప్రజలను కలిసి అభిప్రాయాలను సేకరించారు. ఆర్‌బిఐ సిబ్బంది కలిసిన వారిలో 49.2శాతం మంది మహిళలు ఉన్నారు. వీరిలో అత్యధికులు ధరల అదుపు ఉత్తదేనని, సొంత ఆదాయం పెరగకపోగా, ఖర్చులు భారీగా పెరుగుతున్నాయని చెప్పారు. రానున్న రోజుల్లో కూడా దాదాపుగా ఇటువంటి పరిస్థితులే కొనసాగుతాయని పలువురు అభిప్రాయపడటం గమనార్హం.

హద్దుల్లేని ధరలు

తాజాగా విడుదల చేసిన నివేదికలో ధరల పెరుగుదలపై సెప్టెంబర్ నెలాఖరకు 93.3 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్న అభిప్రాయాన్ని వీరు వ్యక్తం చేశాఉరు.

ధరల పెరుగుదలపై మార్చి నెలాఖరు వరకు చేసిన సర్వేలో అసంతృప్తి వ్యక్తం చేసిన వారు 89 శాతంగా ఉండటం గమనార్హం. ధరలు ఇప్పుడప్పుడే తగ్గవని, మరింతగా పెరుగుతాయని 82శాతం మది అభిప్రాయ పడ్డారు.

ఉపాధి అవకాశాలపై

ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని 35.5శాతం మంది అభిప్రాయపడ్డారు. గత ఏడాది నవంబర్‌లో ఇదే అంశంపై జరిపిన అభిప్రాయ సేకరణలో 32 శాతం మంది ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇప్పుడు వారి సంఖ్య మరింతగా పెరిగింది.

ఆదాయంపై అసంతృప్తి

ఖర్చులు పెరుగుతున్నా ఆ స్థాయిలో ఆదాయం పెరగడం లేదన్న అభిప్రాయం పెద్ద సంఖ్యలో వ్యక్తమవుతోంది. 51.6శాతం మది తమ ఆదాయంలో ఎ మాత్రం ఎదుగు,బొదుగు లేదని పేర్కొన్నారు. 24.3శాతం మంది ఆదాయం తగ్గినట్లు చెప్పారు. అదే సమయంలో ఖర్చు మాత్రం గతంతో పోలిస్తే భారీగా పెరిగిందని 80.4శాతం మంది అభిప్రాయపడ్డారు. రానున్న సంవత్సరంలో ఇదే పరిస్థితి కొనసాగుతుందన్న అభిప్రాయాన్ని అత్యధికులు వ్యక్తం చేశారు.

ద్రవ్యోల్బణంపై..

ద్రవ్యోల్బణంను అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమవుతోందని 80.7శాతం మంది పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం భారీగా పెరుగుతోందన్న అభిప్రాయాన్ని వీరు వ్యక్తం చేశారు.



నారీ శక్తిని ప్రోత్సహించాలి

- నారా భువనేశ్వరి
- 9 మందికి పసుపు-కుంకుమ అందజేత

8





పెరుగుతున్న నిత్యావసర సరుకుల
ధరల భారాన్ని అరికట్టాలి

- ప్రజా పంపిణీ ద్వారా 16 రకాల వస్తువులు పంపిణీ
- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరల భారాన్ని అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలూ చేపట్టాలని, ప్రజా పంపిణీ ద్వారా 16 రకాల సరుకులు అందించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం రెండు రోజులపాటు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంఎ గఫూర్ అధ్యక్షతన విజయవాడలో జరిగింది. ఈ సమావేశానికి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎంఎ బేబి, రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిత్యావసర వస్తువుల ధరలపై తీర్మానం చేసింది. దీన్ని శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. ఈ కాలంలో అతివృష్టి, అనావృష్టి, ప్రభుత్వం సకాలంలో సరైన చర్యలు చేపట్టకపోవడం వల్ల నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగి సామాన్య ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపారు. ఒకపక్క నిరుద్యోగ సమస్య, వ్యవసాయ సంక్షోభం, గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక ఉపాధి అవకాశాలు తగ్గడం వీటన్నిటి కారణంగా ప్రజల కొనుగోలు శక్తి భారీగా పడిపోయిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ధరల ప్రభావం ప్రజలను కోలుకోలేని దెబ్బతీసిందని వివరించారు. రాష్ట్రంలో ఆహార ధాన్యాలు సమృద్ధిగా ఉన్నప్పటికీ బియ్యం ధరలు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతగా కిలో రూ.80 దాటాయని, గతేడాదితో పోలిస్తే సుమారు 40 శాతం పెరిగినట్లు పేర్కొన్నారు. కందిపప్పు 100 శాతం పెరిగిందని, రూ.95 నుండి రూ.180కు చేరిందని తెలిపారు. సాధారణ పేదలు ఉపయోగించే పామాయిల్ ధరలు, వంటనూనెలు 30 శాతం నుండి 40 శాతం వరకూ పెరిగాయని వివరించారు. టమోటా కేజీ రూ.80 దాటిందని, ఉల్లిపాయలు రూ.60 దాటిందని పేర్కొన్నారు. చివరకు ఆకుకూరల ధరలు కూడా రూ.10 నుండి రూ.20కి పెరిగాయని తెలిపారు. పేదల ఆదాయం మొత్తం ఆహార ధాన్యాలకే ఖర్చు మిగతా 8లో

బీరుట్‌పై ఇజ్రాయిల్ దాడుల పట్ల
భారత్ తీవ్ర ఆందోళన

- శాంతిపరిరక్షణ దళాల్లో 900 మంది భారతీయులు

న్యూఢిల్లీ : లెబనాన్ రాజధాని బీరుట్‌లోని ఐరాస శాంతి పరిరక్షణ దళాలు ఉన్న చోట ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేస్తుండటంతో అక్కడ నెలకొన్న తాజా పరిస్థితులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షకులు ఉపయోగించే వాట్ టవర్‌పైసైతం ఇజ్రాయిల్ బలగాలు కాల్పులు జరపడంతో ఇద్దరు గాయపడిన సంగతి తెలిసిందే. శాంతి పరిరక్షణ దళాల్లో భారత సైనికులు కూడా ఉన్న నేపథ్యంలో మనదేశం స్పందించింది. ఈ వివాదం ప్రాంతీయ యుద్ధంగా మారకుండా చూడటం ఎంతో ముఖ్యమని అభిప్రాయ పడింది. తాజా ఉద్రిక్తతల వేళ ఇజ్రాయెల్, ఇరాన్‌తోపాటు ఇతర పశ్చిమాసియా దేశాల్లో ఉన్న భారతీయులను తరలించే ప్రక్రియను ప్రస్తుతం చేపట్టడం లేదని భారత విదేశాంగ శాఖ తెలిపింది. దక్షిణ లెబనాన్‌లోని ఐరాస శాంతి పరిరక్షణ కార్యాలయంపై దాడులు జరగడం ఆందోళనకరమని మిగతా 8లో

స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటాం

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ఐక్య పోరాటాలతో పరిరక్షించుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1328వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ... స్టీల్‌ప్లాంట్ రక్షణకు కార్మికుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం నిలవాలని, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రయివేటీకరణను విరమించుకునేలా చేయాలని కోరారు. ఉద్యోగాలు పోతాయన్న ఆందోళన కాంట్రాక్టు కార్మికుల్లో నేటికీ ఉందని తెలిపారు. ఏ ఒక్క కార్మికునికి అన్యాయం జరిగినా ఊరుకునేది లేదని యాజమాన్యాన్ని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్‌కు ముడి సరుకు సమకూర్చి పూర్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు.

జాతీయ జెండాకు అవమానంపై వివరణ ఇవ్వండి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

పార్వతీపురం మన్యం జిల్లా జిఎల్‌పురం గ్రామంలోని కురుపాం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో ఆగస్టు 15న జాతీయ జెండాకు అవమానం జరిగిందనే పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. ఎమ్మెల్యే జగదీశ్వరి కావాలనే జాతీయ జెండాను అవమానించారనే పిటిషన్‌లో మన్యం జిల్లా అధికారులకు నోటీసులు జారీ చేసింది. సాలూరుకు చెందిన డిప్పాల పొత్తయ్య ఇతరులు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణ జరిపిన జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ప్రభుత్వ అధికారులకు నోటీసులిచ్చారు. విచారణను వాయిదా వేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

ఇసుకను నిత్యావసరంగా భావించాలి

- ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇసుకను నిత్యావసర వస్తువుగా భావించి సరఫరాకు ఉన్న అన్ని సమస్యలనూ పరిష్కరించాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గనులశాఖ అధికారులతో సచివాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇసుక బుకింగ్ సౌలభ్యతను మెరుగుపరిచేందుకు ఆన్‌లైన్ పోర్టల్‌తోపాటు రీచ్‌ల వద్ద నేరుగా బుక్ చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. దీంతో ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోలేని వారు కూడా ఇసుక పొందడం సులభమవుతుందని చెప్పారు. ఈ ప్రక్రియలో ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా చూడాల్సిన అవసరం ఉందని, నిరంతర నిఘాతోపాటు నిత్యం పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఇసుక లభ్యత, రవాణా, ఆపరేషన్ ఖర్చులు మొదలైన వాటి గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు వాస్తవ సమాచారాన్ని అందించాలన్నారు. చెకింగ్, జిపిఎస్, ట్రాకింగ్, ఆడిట్ విధానాలతో బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా చూడాలన్నారు. రాష్ట్రంలో ఈ నెల 16వ తేదీ నుంచి 70 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన 108 రీచ్‌లు అందుబాటులోకి రానున్నాయని సిఎం దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. రాబోయే రోజుల్లో ఇసుక రీచ్‌ల సంఖ్య పెంచేందుకు ప్రైవేటు వ్యక్తులు కూడా మైనింగ్‌శాఖ అనుమతితో తవ్వకాలు ప్రారంభిస్తారన్నారు. అయితే ప్రైవేటు ఇసుక రీచ్‌లలో కూడా డిఎల్‌ఎస్‌సి నిర్ణయించిన ధరకే ఇసుక విక్రయాలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం రోజుకు 30 వేల మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా అవుతుందన్నారు. ఇసుక రీచ్‌లను జిల్లా స్థాయి శాండ్ కమిటీ ఎంపిక చేసిన ప్రైవేటు ఏజెన్సీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఏజెన్సీలను జిల్లా కమిటీ టెండర్ల విధానంలో ఎంపిక చేస్తోందన్నారు. ఇసుక రీచ్‌లోని స్టాక్ పాయింట్‌ను 24 గంటలు ఆపరేట్ చేయడానికి వారికి అనుమతి ఇస్తామన్నారు. దీంతో నిరంతర సరఫరాకు అవకాశం ఉంటుందని చెప్పారు. రీచ్ పాయింట్ వద్ద ఇసుక సరఫరా రేటు డిఎల్‌ఎస్‌సి నిర్ణయించినట్లుగా ఉండాలని అధికారులను సిఎం ఆదేశించారు. పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలను త్వరితగతిన అనుమతించడం ద్వారా మార్కెట్‌లో ఇసుక లభ్యతను పెంచాలన్నారు. ఇసుక డెలివరీని వేగవంతం చేసేందుకు మరిన్ని వాహనాలను అందుబాటులోకి తేవాలన్నారు. ఈ సమావేశంలో గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ముఖ్యకార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా పాల్గొన్నారు.



మైనింగ్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

'కృష్ణా'కు కొనసాగుతున్న వరద

- రీచ్‌ల వద్ద లభ్యం కాని ఇసుక
- యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు, విక్రయాలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలకు ఇసుక కష్టాలు మరో 15 రోజులపాటు తప్పేలా లేవు. గత 40 రోజులుగా ఇసుక అందుబాటులోలేక భవన నిర్మాణ కార్మికులు, నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ మార్కెట్లో ఇసుక ధర లారీ రూ.30 వేలకుపైగా పలుకుతోంది. గత ప్రభుత్వంలో ఉన్న ధర కన్నా ఎక్కువ ధర పలకడంతో టిడిపి ప్రభుత్వం విమర్శలకు గురవుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అన్ని రీచ్‌లనూ ప్రారంభించకపోవడం వల్ల ఇసుక అందుబాటులో లేకుండా పోయింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 16 నుంచి 108 రీచ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజల అవసరం మేరకు ఇసుక అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ప్రస్తుతం కృష్ణా తీరానికి వరద కొనసాగుతోంది. సగటున రోజుకు 35 నుంచి 40 వేల క్యూసెక్కులు పులిచింతల, ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో, పులిచింతల, ప్రకాశం బ్యారేజి దిగువన ఉన్న రీచ్‌ల నుంచి ఇసుక తీయడం కష్టంగా మారింది. గత నెలలో లింగాయపాలెం, తాళ్లాయపాలెం, గుండిమెడ తదితర రీచ్‌ల వద్ద ఇసుక విక్రయాలకు స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేశారు. వరదకు ఇసుక నదిలోకి కొట్టుకుపోయిందని అధికారులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో వరద కొనసాగుతుండడం వల్ల ఇసుక తవ్వకాలు ఎలా చేపట్టాలనే అంశంపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. దీంతో, ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూలు ప్రకారం ఈ నెల 16 కల్లా ఇసుక అందుబాటులోకి రాదని అభిప్రాయపడు తున్నారు. పర్యావరణ అనుమతులు లేకపోవడం, నేషనల్ గ్రీన్ ట్రిబ్యు నల్ ఆంక్షల వల్ల ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 30 రీచ్‌ల వద్ద ఇసుక తీసే అవకాశం లేకుండాపోయింది. అనధికారికంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. గత 15 రోజులుగా జిల్లాలోని వేర్వేరు రీచ్‌ల వద్ద ఇసుక అక్రమ వ్యాపారం సాగుతోంది. ఉచిత ఇసుక సరఫరాకు కొరత ఉందని చెబుతున్న అధికారులు అనధికారిక విక్రయాలను నియంత్రించలేకపోతున్నారు. ఓపెన్ రీచ్‌ల వద్ద ఉన్న ఇసుకను అక్రమార్కులు తవ్వుకుని అధిక ధరలకు విక్రయించు కుంటున్నారు. వీరికి కొందరు స్థానిక అధికారులు, కొందరు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. మైనింగ్ శాఖ పట్టనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇసుక దొరక్క ఉమ్మడి జిల్లాలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి ఇసుక ఇస్తామన్న ప్రభుత్వ హామీ ఫార్సుగా మారింది. ఆన్‌లైన్ బుకింగ్ అందని ద్రాక్షగా మిగిలింది. ఇసుక లేకపోవడంతో నిర్మాణ రంగంలో ఉపాధికి గండిపడింది. పనులులేక వేలాది మంది కార్మికులు అల్లాడు తున్నారు. ఇటీవల గుంటూరులో రెండు లారీలు, మూడు ట్రాక్టర్లలో అక్రమ ఇసుక రవాణా అవుతుండగా కలెక్టర్‌కు సమాచారం రావడం తో ఆమె రెవెన్యూ అధికారులతో సీజ్ చేయించి భారీ జరిమానా విధించారు. రెండు రోజుల క్రితం పల్నాడు జిల్లా అచ్చంపేటలో అక్ర మంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను అధికారులు సీజ్ చేశారు.

కొరత వాస్తవమే

జిల్లాలో ఇసుక కొరత ఉన్న మాట వాస్తవమే. గత నెల మొదటి వారంలో భారీగా వరద రావడంతో పలు రీచ్‌ల్లోని ఇసుక నదిలోకి వెళ్లిపోయింది. ఇసుక తవ్వకాలకు మళ్లీ నోటిఫికేషన్లు జారీ చేశాం. ప్రస్తుతం 35 వేలకుపైగా క్యూసెక్కుల వరద కొనసాగుతోంది. వరద నీరు ప్రకాశం బ్యారేజీ దిగువకు విడుదల చేయడంతో కొత్త రీచ్‌ల్లో తవ్వకాలకు ఆలస్యం అవుతుందని భావిస్తున్నాం. వరద తగ్గితే రీచ్‌లకు పర్యావరణ అనుమతులు తీసుకోవాల్సి ఉంది. పట్టా భూముల్లో ఐదెకరాల కన్నా ఎక్కువ ఉంటే ఇసుక తొలగింపునకు టెండర్లు పిలిచి వెంటనే పనులు ప్రారంభిస్తాం.

-ఎస్.నాగలక్ష్మి, జిల్లా కలెక్టర్

పోలీసుల విచాణతో మనస్తాపం

- వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసులు విచారణతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటన ఏలూరు జిల్లా పెదవేగి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వంగూరు గ్రామానికి చెందిన బోయిన ఫణి, బోయిన హరి, బోయిన ఏడుకొండలు అనే ముగ్గురు వ్యక్తులు పంచాయతీ బోరు వాల్‌ను తొలగించి నీటిని అక్రమంగా ట్యాంకుల ద్వారా తరలిస్తున్నారు. ఈ విషయంపై వంగూరు పంచాయతీ వాచర్‌గా పని చేస్తున్న సరిపల్లి బ్రదర్ వారిని నిలదీయడంతో దాడి చేసేందుకు యత్నించారు. దీనిపై సరిపల్లి బ్రదర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడికి యత్నించిన ముగ్గురినీ పోలీసులు ప్రాథమిక విచారణ నిమిత్తం స్టేషన్‌కు తీసుకొచ్చారు. మరుసటి రోజు ఉదయం మరోసారి రావాలని చెప్పి పంపించారు. అయితే, చేయని నేరానికి పోలీసులు తనను విచారిస్తున్నారని మనస్తాపంతో ఫణి అనే వ్యక్తి పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు గమనించి ఆయనను ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

విద్యుత్ వినియోగదారులపై రూ.8,114 కోట్ల ట్రూఅప్ భారం వద్దు

- ఇఆర్‌సికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ వినియోగదారులపై రూ.8,114 కోట్ల భారం వేయొద్దని విద్యుత్ నియంత్రణ మండలికి సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున కార్యదర్శి వి శ్రీనివాసరావు లేఖ రాశారు. లేఖను శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు 2022-23 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి నాలుగు త్రైమాసికాల రూ.8,114 కోట్ల ఎఫ్‌పిపిసిఎ ప్రతిపాదనలను అనేక నెలల క్రితమే విద్యుత్ నియంత్రణ మండలికి పంపినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల ముందు వీటిపై ప్రజాభిప్రాయం తీసుకోకుండా జాప్యం చేయడం సరికాదని పేర్కొంటూ సిపిఎం ఎపి రాష్ట్ర కమిటీ విద్యుత్ నియంత్రణ మండలికి లేఖ రాసిందని తెలిపారు. వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించాల్సిన మండలి ట్రూఅప్ ఛార్జీలపై నిర్ణయం తీసుకోకుండా ఇప్పటి వరకూ కాలయాపన చేయడం సమంజసం కాదని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా హిందూజా సంస్థకు రూ.1,234.68 కోట్లు విద్యుత్ సంస్థలు చెల్లించడం అక్రమమని పేర్కొన్నారు. ఈ భారాన్ని కూడా ట్రూఅప్ ప్రతిపాదనలతో కలపడం శోచనీయమని అన్నారు. ఈ అక్రమ చెల్లింపుపై మండలి ముందు సిపిఎం గతంలో పలుసార్లు లేవనెత్తినప్పటికీ దీనిపై చర్చించడానికి మండలి నిరాకరించి నేడు ట్రూఅప్ ప్రతిపాదనలో ప్రజల కళ్లుగప్పే రీతిలో పొందుపరచడం ఆక్షేపణీయమని వివరించారు. పంపిణీ సంస్థలు ట్రూఅప్ ప్రతిపాదనలపై సమాచారం ఇచ్చిన తర్వాత ఎనిమిది నెలలపాటు మండలి స్పందించకుండా కాలయాపన చేయడం గర్హనీయమన్నారు. తీవ్ర జాప్యం అనంతరం 30.09.2024న నాలుగు త్రైమాసికాల ప్రతిపాదనల నోటిఫికేషన్ విడుదల చేసి 12 పిటిషన్లపై ఒకేసారి హడావుడిగా విచారణ చేపట్టం తగదని తెలిపారు. 14 రోజుల్లో (ఈ నెల 14వ తేదీ)లోపు అభ్యంతరాలు తెలపాలని, మూడు రోజుల అనంతరం (ఈ నెల 18న) బహిరంగ విచారణ చేస్తామని మండలి ప్రకటించడం అభ్యంతరకరమని పేర్కొన్నారు. అభ్యంతరాలు తెలిపిన అనంతరం పంపిణీ సంస్థలు సమాధానాలు, వివరణలు మూడు రోజుల్లో పంపడం, వాటిని అధ్యయనం చేసి అభ్యంతరాలు తెలిపిన సంస్థలు, పార్టీలు, వ్యక్తులు విచారణలో తమ అభిప్రాయాలు తెలపడం సంక్లిష్టమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. ఈ నెలాఖరు నాటికి మండలి ఛైర్మన్, టెక్నికల్ సభ్యులు పదవీకాలం పూర్తవుతున్న సమయంలో హడావుడిగా ఇటువంటి విచారణ చేపట్టడం హేతుబద్ధం కాదని తెలిపారు. నియంత్రణ మండలి నిబంధనల స్ఫూర్తికి భిన్నంగా ఏకపక్షంగా రూ.8,114 కోట్లు ట్రూఅప్ భారాలపై విచారణ ప్రక్రియ సాగించడం దానిని మొక్కుబడి తంతుగా మార్చడం తగదని అన్నారు. ఈ ప్రతిపాదనలపై సిపిఎం పేర్కొన్న అభ్యంతరాలను దృష్టిలో ఉంచుకుని బహిరంగ విచారణ ప్రక్రియలో తగు మార్పులు చేయాలన్నారు. తగు సమయం ఇవ్వాలని, నిబంధన లు పాటించాలని, సమయం ఇవ్వకుంటే ట్రూఅప్ ప్రతిపాదనలపై సిపిఎం అభ్యంత రాలను, అభిప్రాయాలను మరో లేఖలో వివరంగా తెలుపుతామని పేర్కొన్నారు.

మహిషాసురమర్ధని దేవిగా దుర్గమ్మ

- తొమ్మిదో రోజుకు చేరిన శరన్నవరాత్రులు
- నేటితో ముగియనున్న దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ నెల 3 నుండి ప్రారంభమైన ఉత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తొమ్మిదో రోజు శ్రీ మహిషాసురమర్ధనిదేవిగా దుర్గమ్మను అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు యాత్రికులు పెద్ద ఎత్తున ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. మహిషాసురమర్ధనిగా ఉన్న దుర్గమ్మను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, డిజిపి ద్వారకా తిరుమలరావు, సినీ నటుడు, నిర్మాత కె.అశోక్ కుమార్, సినీ నటి నాగళ్ళ అనన్య, పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు.

ఐటిశాఖ విధించిన భారీ జరిమానా రద్దు

ప్రజాశక్తి-అమరావతి

అమరేంద్ర అనే వ్యాపారి రూ.6.65 కోట్లను నగదు రూపంలో రుణం తీసుకున్నందుకు అంతే మొత్తాన్ని ఆదాయపన్ను శాఖ జరిమానాగా విధించడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఐటి యాక్ట్ సెక్షన్ 269కి వ్యతిరేకంగా నగదు రూపంలో రుణాలు, డిపాజిట్లు తీసుకుంటే అదే చట్టంలోని 271-డి సెక్షన్ కింద నగదు రూపంలో తీసుకున్న మొత్తానికి సమానంగా జరిమానా విధించే ముందు అందుకు కారణాలను అసెసింగ్ అధికారి ఉత్తర్వుల్లో పేర్కొనకపోవడాన్ని ఆక్షేపించింది. కారణాలు పేర్కొనకుండా జరిమానా విధించడానికి వీల్లేదని జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ కిరణ్మయితో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది. పిటిషనరు వాదనను ఆమోదించిన హైకోర్టు ఐటి శాఖ విధించిన జరిమానాను రద్దు చేస్తూ తీర్పు చెప్పింది.

కాంగ్రెస్ ఓటమికి కారణాలు అనేకం

- బిజెపితో ఐఎన్ఎల్‌డి కూటమి లోపాయికారీ అవగాహన
- కొంపముంచిన అసమ్మతి
- హర్యానాపై పోస్ట్‌మార్టం



చండీగఢ్ : హర్యానా శాసనసభ ఎన్నికలలో వచ్చిన అనూహ్య ఫలితాలు రాజకీయ పరిశీలకులను సైతం ఆశ్చర్యానికి గురిచేశాయి. కాంగ్రెస్ విజయం తథ్యమంటూ ఎగ్జిట్ పోల్స్ వేసిన అంచనాలు తప్పాయి. ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అనేక అనుమానాలు వ్యక్తం చేస్తోంది. వీటిపై ఎన్నికల కమిషన్‌కు ఈ నెల 9న ఫిర్యాదు చేసింది. ఓట్ల లెక్కింపు సమయంలో ఇవిఎంలను 'పూర్తిగా ఛార్జింగ్' చేశారనేది కాంగ్రెస్ ప్రధాన అభియోగం. ఇవిఎంలను పూర్తిగా ఛార్జింగ్ చేయకూడదని, అలా చేస్తే వాటిని తారుమారు చేశారనో లేదా మార్చేశారనో అనుమానించాల్సి వస్తుందని ఆ పార్టీ వాదిస్తోంది.

కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు పది శాసనసభ స్థానాలకు సంబంధించి అభ్యంతరాలు వ్యక్తం చేసింది. మరికొన్ని స్థానాలపై కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపింది. న్యాయస్థానంలో సవాలు చేస్తామని కూడా కాంగ్రెస్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఫలితాల ప్రకటనలో ఏవైనా అవకతవకలు జరిగాయా లేక ఓటమికి కాంగ్రెస్ పార్టీ సాకులు వెతుకుతోందా అనేది పరిశీలించాల్సిన అవసరం ఉంది.

బిజెపితో ఐఎన్ఎల్‌డి కూటమి 'అవగాహన'

శాసనసభ ఎన్నికలలో ఐఎన్ఎల్‌డి, బిఎస్‌పి, హెచ్ఎల్‌పి పార్టీలు కూటమిగా ఏర్పడి పోటీ చేశాయి. ఆ పార్టీలు ముందుగానే బిజెపితో లోపాయికారి అవగాహన కుదుర్చుకున్నాయని వార్తలు వచ్చాయి. సిర్సా శాసనసభ స్థానంలో జరిగింది అదే. అక్కడ బిజెపి తన అభ్యర్థిని ఉపసంహరించుకొని హర్యానా లోక్‌హిత్ పార్టీ (హెచ్ఎల్‌పి)కి మద్దతు తెలిపింది. ఇది కేవలం ఆ ఒక్క సీటుకే పరిమితం కాలేదు. సిర్సా లోక్‌సభ స్థానం పరిధిలోని దబ్వాలీ, రనియా, ఎలెనాబాద్ శాసనసభ స్థానాలలో బిజెపి అభ్యర్థులకు చాలా తక్కువ ఓట్లు పడ్డాయి. ఈ మూడు అసెంబ్లీ సెగ్మెంట్లు సిర్సా లోక్‌సభ స్థానం పరిధిలోనివి. ఐదు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఈ మూడు స్థానాలలో బిజెపికి వచ్చిన ఓట్లతో పోలిస్తే ఇప్పుడు ఏకంగా లక్ష ఓట్లు తగ్గాయి. దబ్వాలీలో బిజెపికి ఓటేసిన వారిలో 82 శాతం, ఎలెనాబాద్‌లో 72 శాతం, రనియాలో 65 శాతం మంది ఈసారి ఆ పార్టీకి ఓటేయలేదు. సంస్థాగతంగా ఎంతో బలముందని చెప్పుకునే బిజెపి కొన్ని స్థానాలలో 70 శాతం ఓట్లను కోల్పోవడం సాధారణంగా జరిగే పని కాదని, దీని వెనుక ఏదో వ్యూహం ఉండవచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే ఈ ఓట్లు కాంగ్రెస్‌కు పడలేదు. వాస్తవానికి దబ్వాలీలో కాంగ్రెస్ పార్టీ కూడా 18 వేల ఓట్లను కోల్పోయింది. అంటే దీనర్థం బిజెపి ఓట్లన్నీ ఐఎన్ఎల్‌డి నేతృత్వంలోని కూటమికే పడ్డాయని స్పష్టమవుతోంది. లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఈ మూడు స్థానాలలో బిజెపి ఓటింగ్ గణనీయంగా పడిపోయినప్పటికీ మిగిలిన మూడు స్థానాలలో మాత్రం పెరగడం గమనార్హం.

లోక్‌సభ ఎన్నికలలో సిర్సాలోని తొమ్మిది అసెంబ్లీ స్థానాలలోనూ కాంగ్రెస్ ఆధిక్యత కనబరచింది. ఇప్పుడు వీటిలో రెండు స్థానాలను ఐఎన్ఎల్‌డికి, ఒక దానిని బిజెపికి కోల్పోయింది. కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా నిలిచిన జాట్లు, దళితుల ఓట్ల కోసమే ఐఎన్ఎల్‌డి కూటమి కూడా వెంపర్లాడింది. రెండు స్థానాలలో బిజెపికి వచ్చిన మెజారిటీ కంటే ఈ కూటమికి ఎక్కువ ఓట్లు లభించాయి.

దెబ్బతీసిన 'తిరుగుబాట్లు'

తిరుగుబాటు అభ్యర్థుల కారణంగా కాంగ్రెస్ పార్టీ అనేక స్థానాలను కోల్పోయిన మాట వాస్తవం. ఉచనా కలాన్, కల్కా, బద్రా, గోహానా స్థానాలలో తిరుగుబాటు అభ్యర్థులు గణనీయంగా ఓట్లు సాధించి కాంగ్రెస్ విజయావకాశాలను దెబ్బతీశారు. కొన్ని స్థానాలలో కాంగ్రెస్ అధికార అభ్యర్థుల కంటే తిరుగుబాటు అభ్యర్థులకే ఎక్కువ ఓట్లు వచ్చాయి. పుండ్రి, అంబాలా కంటోన్మెంట్, వల్లబ్‌గఢ్, బహదూర్‌గఢ్ వంటి స్థానాలు ఇందుకు ఉదాహరణ. టిక్కెట్ల కేటాయింపులో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందని దీనిని బట్టి అర్థమవుతోంది.

ఆ ఓట్లన్నీ ఏమయ్యాయి?

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 46 శాసనసభ స్థానాలలో అధిక్యత లభించింది. మిత్రపక్షమైన ఆప్‌తో కలిసి 47 శాతం ఓట్లు సాధించింది. శాసనసభ ఎన్నికలు వచ్చే సరికి దాని ఓట్లు ఏకంగా ఎనిమిది శాతం తగ్గాయి. అనేక స్థానాలలో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ చెల్లాచెదురు కావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే 36 స్థానాలలో కాంగ్రెస్ ఓట్లు పది వేలు తగ్గాయి. 18 స్థానాలలో ఆ పార్టీ 20 వేల ఓట్లను కోల్పోయింది. 28 స్థానాలలో ఆ పార్టీ 20 శాతం ఓట్లను చేజార్చుకున్నదని గణాంకాలు చెబుతున్నాయి. అంటే ఈ 28 స్థానాలలో లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్‌కు ఓటేసిన ప్రతి ఐదుగురిలో ఒకరు అసెంబ్లీ ఎన్నికలలో వేరే పార్టీకి ఓటేశారు. 16 స్థానాలలో అయితే మూడో వంతు కాంగ్రెస్ ఓటర్లు తమ ఓట్లను ఇతర పార్టీలకు బదిలీ చేశారు. కేవలం ఐదు నెలల వ్యవధిలోనే ఇంత మార్పు ఎందుకు వచ్చింది?

భూపీందర్ ఇలాకాలోనూ...

దీపేందర్ సింగ్ హుడా కుటుంబానికి కంచుకోటగా చెప్పుకునే రోహ్‌తక్‌లో సైతం కాంగ్రెస్ ఓట్లకు భారీగా గండి పడింది. లోక్‌సభ ఎన్నికలలో హుడాకు 7.83 లక్షల ఓట్లు రాగా ఆ స్థానం పరిధిలోని తొమ్మిది అసెంబ్లీ సెగ్మెంట్లలో కలిపి కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు 5.93 లక్షలు మాత్రమే. అంటే ఆ పార్టీ రోహ్‌తక్ పరిధిలో 1.9 లక్షల ఓట్లను కోల్పోయింది. దీపేందర్ తండ్రి భూపీందర్ సింగ్ హుడా ముఖ్యమంత్రి పదవికి పోటీ పడినప్పటికీ ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేయకపోవడానికి కారణమేమై వుంటుంది?.

ఎందుకిలా?

అంబాలా, సిర్సా, ఫరీదాబాద్ లోక్‌సభ స్థానాలలో కాంగ్రెస్ ఓట్లు లక్షకు పైగా తగ్గాయి. స్థానిక అంశాలు, అభ్యర్థుల ఎంపిక, చిన్న పార్టీలు, స్వతంత్రుల ప్రాధాన్యత పెరగడం వంటి కారణాలతో ఓట్లు కొంతమేర తగ్గడాన్ని అర్థం చేసుకోవచ్చు కానీ ఇంత భారీ స్థాయిలో తగ్గడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఢిల్లీలో ముస్లింలు, గోవా, కేరళ, మేఘాలయలో క్రైస్తవులు లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ వైపు నిలిచినా శాసనసభకు వచ్చే సరికి అలా జరగలేదు. 2022లో పంజాబ్‌లో జరిగిన శాసనసభ ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటేశారు. అయితే తాజా సార్వత్రిక ఎన్నికలలో బలపరిచారు. హర్యానాలో మైనారిటీల సంఖ్య చాలా తక్కువ. కాబట్టి కాంగ్రెస్ ఓట్లు తగ్గడానికి దీనిని కారణంగా చెప్పలేము.

దూరమైన దళితులు

హర్యానా శాసనసభ ఎన్నికలపై కులాలు కూడా ప్రభావం చూపాయి. జాట్లు కాంగ్రెస్‌నే బలపరచినప్పటికీ దళితులు మాత్రం దూరమయ్యారు. దళిత నేత కుమారి సెల్జాను కాంగ్రెస్ అవమానించిందని, పట్టించుకోలేదని వారు భావించారు. అంతర్గత కుమ్ములాటలు, వెన్నుపోట్లు కూడా కాంగ్రెస్ కొంప ముంచాయి. తిరుగుబాటు అభ్యర్థులు గణనీయంగా ఓట్లు పొందడమే దీనికి నిదర్శనం. కర్ణుడి చావుకు కారణాలు అనేకం అన్నట్లు హర్యానాలో కాంగ్రెస్ పరాజయానికి ఇవన్నీ దోహదపడ్డాయి.

వేదవతి నదికి వరద

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి కురిసిన భారీ వర్షానికి వేదవతి నదిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ వరద నీరు పరుగులు తీసింది. తెల్లవారుజామున డి.హీరేహాల్, రాయదుర్గం మండలాలతో పాటు ఏలంజి, సోమలాపురం, కొత్తూరు, ఖానాపురం, తిమ్మలాపురం, కొలగానహల్లి, తదితర పై గ్రామాల్లో కురిసిన భారీ వర్షాలకు బళ్లారి-కణేకల్లు ప్రధాన రహదారిపై వేదవతి నది నీటి ప్రవాహం ఉధృతంగా సాగింది. దీంతో బస్సులు, వాహనాల రాకపోకలు గంటసేపు స్తంభించాయి. వేదవతి నదిలో వరద ప్రవాహం కారణంగా నది పరివాహక ప్రాంతంలో పంట పొలాలు నీట మునిగాయి.

జెసి నుంచి ప్రాణహాని : పెద్దారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆరోపించారు. శుక్రవారం అనంతపురం నగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జెసి.ప్రభాకర్‌రెడ్డి నుంచి తనకు ప్రాణ హాని ఉందని, జిల్లా ఎస్‌పి జగదీశ్ సహకారంతోనే ఆయన కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల పోలింగ్ నుంచి ఇప్పటి వరకు పలుమార్లు తనను చంపేందుకు ప్రయత్నాలు చేసారని పేర్కొన్నారు. తన అన్న కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డిని చంపినట్టే తననూ హతమార్చేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. జెసి అనుచరులకు ఎస్‌పి జగదీశ్ పూర్తి తోడ్పాటును అందిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో సిట్ విచారణ చేసిన ఘటనలపైనా మళ్లీ కేసులు ఎందుకు నమోదు చేశారో ఎస్‌పి చెప్పాలని ప్రశ్నించారు. జెసి ఆదేశాలతోనే తనను తాడిపత్రికి ఎస్‌పి అనుమతించటం లేదని మండిపడ్డారు. గతంలో ఆయన అనుమతితో తాడిపత్రి తన ఇంటికెళ్లినా దాడి చేసారన్నారు.

కిలో కనకాంబరాలు రూ.రెండువేలు

ప్రజాశక్తి-హిందూపురం

దసరా పండుగ వేళ కనకంబరాల పూలు రైతులకు కనక వర్షం కురిపిస్తున్నాయి. శుక్రవారం హిందూపురం పూల మార్కెట్ లో ఏకంగా ఒక కేజీ పూలు రూ. రెండు వేల ధర పలికింది. దీంతో కనకంబరాల రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదే బాటలోనే మల్లెపూల ధర సైతం ఏకంగా రూ.వెయ్యి దాటింది.

దసరా పండగంటే నవరాత్రులతో కలిపి పది రోజులు పండుగ. ఈ పండుగ సందర్భంగా దుర్గామాతను తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో అలంకరిస్తారు. హిందూపురం పూల మార్కెట్‌లో శరన్నవరాత్రి పండుగ సందర్భంగా పూలను కొనేందుకు మార్కెట్‌కు వచ్చిన కొనుగోలుదారులు పూల ధరలను చూసి ఆశ్చర్యపోతున్నారు. గత రెండు నెలలుగా కురిసిన వర్షాలకు కనకాంబరం పూల దిగుబడి తగ్గి, మార్కెట్‌కు తక్కువగా వచ్చాయి. దీంతో వాటి ధర కిలో రూ.1500 నుంచి రూ.రెండు వేలకు పలికింది. మల్లెపూలు రూ.వెయ్యి నుంచి రూ.1,200దాకా పలుకుతున్నాయి. బంతిపూలు కిలో రూ.80 నుంచి రూ.120 ఉండగా.. చామంతి రూ.200 నుంచి రూ.300దాకా ఉన్నాయి. ఈ ప్రాంతంలో చెండుపూలు సాగుచేసిన రైతులు అధికశాతం తెలంగాణ ప్రాంతానికి తరలించారు. బతుకమ్మ, నవరాత్రి సందర్భంగా హైదరాబాద్ ప్రాంతంలో పూలకు గిరాకీ ఉంటుందని రైతులు అక్కడికి ఎగుమతి చేశారు.

సంతకాలు చేసి విధులకు డుమ్మా

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపి

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం

చిత్తూరు జిల్లా ఎస్ఆర్‌పురం మండలంలోని ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల తీరుపై చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రిజిస్టర్‌లో సంతకాలు చేసి విధుల్లో లేకపోవడాన్ని ఆయన గుర్తించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న వైద్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఎస్ఆర్‌పురం మండలం ఆరిమాకులపల్లె ఆసుపత్రిని తనిఖీ చేశారు. అక్కడ వైద్యులెవరూ లేకపోవడాన్ని గమనించారు. రిజిస్టర్ పరిశీలించారు. సంతకాలు చేసిన వైద్యులు, సిబ్బంది విధులకు డుమ్మాకొట్టినట్లు గుర్తించారు. ఆసుపత్రిలో పనితీరు, అక్కడి పరిస్థితిని, పరిసరాలను తనిఖీ చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న వైద్యుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలకు అందుబాటులో లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహించారు. తీరుమార్చుకోకుండా చర్యలు తప్పవని హెచ్చరించారు.

షమీకి మళ్లీ నిరాశే..

- న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌కు
- జట్టును ప్రకటించిన బిసిసిఐ



ముంబయి: భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బిసిసిఐ) న్యూజిలాండ్‌తో జరిగే టెస్ట్ సిరీస్‌కు జట్టును ప్రకటించింది. గాయం నుంచి కోలుకున్న మహ్మద్ షమీకి తిరిగి జట్టులో దక్కలేదు. బిసిసిఐ ప్రకటించిన 15మంది ఆటగాళ్లతో కూడిన బృందానికి కెప్టెన్‌గా రోహిత్ శర్మ, వైస్ కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా వ్యవహరించనున్నారు. వికెట్ కీపర్ల కోటాలో పంత్, జురెల్ చోటు దక్కించుకున్నారు. ఇక మహ్మద్ షమీ గాయం నుంచి కోలుకున్నాడా..? లేక బంగ్లాతో సిరీస్‌లో రాణించిన ఆటగాళ్లను కొనసాగించాలని బోర్డు భావించిందా..? అనే విషయం తెలియాల్సి ఉంది. ఇక మహ్మద్ షమీ గత ఏడాది నవంబర్‌లో ఆస్ట్రేలియా జరిగిన వన్డే ప్రపంచకప్ ఫైనల్ తర్వాత తీవ్రంగా గాయపడి తిరిగి జాతీయ జట్టు చేరలేదు. బంగ్లాతో టెస్ట్ సిరీస్‌కు 16వ ఆటగాడు, ఎడమచేతి వాటం పేసర్ యశ్ దయాల్‌తోపాటు హర్షిత్ రాణా, మయాంక్ యాదవ్, ప్రసిధ్ కృష్ణలతో టీమిండియా బెంచ్ పటిష్టంగా ఉంది. అలాగే బంగ్లాదేశ్‌తో టి20 సిరీస్‌లో రాణిస్తున్న ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి కూడా చోటు దక్కలేదు. ఇక న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టెస్ట్ బెంగళూరు వేదికగా అక్టోబర్ 16నుంచి జరగనుంది.

జట్టు: రోహిత్ శర్మ(కెప్టెన్), బుమ్రా(వైస్ కెప్టెన్), జైస్వాల్, శుభ్‌మన్, కోహ్లి, కెఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషబ్ పంత్, ధృవ్ జురెల్(వికెట్ కీపర్లు), అశ్విన్, జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్, సిరాజ్, ఆకాశ్‌దీప్.

అపాచీ పరిశ్రమలో మహిళ కార్మికురాలు హత్య

ప్రజాశక్తి - తడ

తిరుపతి జిల్లా తడ మండలంలోని మాంబట్టు వద్ద వున్న అపాచీ పరిశ్రమలో శుక్రవారం కార్మికురాలు యరబోతు వనజ (28) హత్య సంచలనం కలిగించింది. స్థానికుల సమాచారం మేరకు అపాచీ 'బి' ప్లాంట్‌లో పనిచేస్తున్న మహిళా కార్మికురాలు యరబోతు వనజ చిట్టమూరు మండలం కుమ్మరిపాళెం వాస్తవ్యురాలు. అదే మండలానికి చెందిన బురదగాలి గ్రామానికి చెందిన మీజూరు సురేష్ (23) ప్లాంట్‌లోనే మహిళపై కత్తితో దాడి చేశాడు. తోటి మహిళా ఉద్యోగులు ఇన్‌ఛార్జిలకు తెలపడంతో అంబులెన్స్‌లో హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు దారితీసిన వాస్తవ వివరాలు తెలియాల్సి ఉంది.



93 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ఐదుగురు స్మగ్లర్లు అరెస్ట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శేషాచలం అటవీ పరిధిలోని నెల్లూరు జిల్లా సోమశిల ప్రాంత సమీపంలో 93 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకుని ఐదుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఉన్నతాధికారులకు అందిన సమాచారం మేరకు సోమశిల-అనంత సాగరం మార్గంలో ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో నలుగురిది తమిళనాడు తిరువన్నామలై జిల్లా, ఒకరు పాండిచ్చేరి ప్రాంతానికి చెందిన వ్యక్తులుగా గుర్తించామన్నారు. విచారించగా ఎర్రచందనం దుంగల విషయాలను వెల్లడించడంతో వారి నుంచి 93 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని అదికారులు తెలిపారు. ఈ ఘటనపై తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

సంపాదకీయం


అభయ దుర్గ

గతకాలపు సంస్కృతీ సంప్రదాయాల రీతిని, నీతిని తెలుసుకోడానికి పండుగలు ఓ ఆధారం. మనం నిత్యం జరుపుకొనే పండుగలు, ఉత్సవాలు, జాతరలు, కొలుపులన్నీ కేవలం మతపరమైనవి కావు. కొన్ని పండుగలు వ్యవసాయం, పశుపోషణ వంటి వాటికి సంబంధించి ఉంటాయి. కొన్ని ప్రకృతిపై మానవుడు సాధించిన విజయానికి గుర్తుగా వుంటాయి. కొన్ని పండుగలు పూర్తిగా మత నమ్మకాలు, కథలపై ఆధారపడి ఉంటాయి. అయితే వీటన్నిటినీ పూర్తిగా విడదీసి చూడ్డం కష్టం. ఇవన్నీ మన సంస్కృతిలో భాగం. మన దేశంలో జరుపుకునే పండుగల్లో ముఖ్యమైనది దసరా. ప్రకృతిని ఆరాధిస్తూ...మాతృమూర్తిని దుర్గామాతగా కొలిచే పండుగ ఇది. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతం విజయదశమి. మహిషాసురుడిని సంహరించిన దుర్గాదేవి విజయానికి గుర్తు అని, పాండవులు అజ్ఞాతం వీడి జమ్మి చెట్టుపై వుంచిన ఆయుధాలను తీసుకొని యుద్ధం చేసి విజయం సాధించారని... అనేక కథలున్నాయి. దుష్టులు ఏనాటికైనా శిక్షింపబడతారనే సందేశాన్నిచ్చే పండుగ ఇది. మనిషిలోని చెడు ప్రవర్తనను అంతం చేసి, మంచిని పెంచే పండుగగా దీనిని భావిస్తారు. 'దసరా వచ్చిందయ్యా...సరదా తెచ్చిందయ్యా/ దశమి వచ్చిందయ్యా... దశనే మార్చిందయ్యా' అంటారో సినీ కవి. మత విశ్వాసాలతో పాటు సామూహిక జీవనం, ఆరోగ్య సూత్రాలు, సంస్కృతీ సంప్రదాయాలు, నైతిక విలువలు వంటి అనేక అంశాలు ఈ పండుగలతో ముడిపడి వుంటాయి.

దసరా అంటేనే గుర్తొచ్చేది కలకత్తా. బెంగాలీలు అత్యంత వైభవంగా దుర్గపూజ జరుపుకుంటారు. 'దసరా సమయంలో బెంగాల్‌లోని సామాన్య సాంస్కృతిక జీవితం ఉత్సాహపూరితం, జాతీయ వాతావరణంతో వికసిస్తుంది' అంటారు బెంగాలీ రచయిత్రి లీలామజుందార్. నేడు అదే కలకత్తాలో అనేకమంది దుర్గలు న్యాయం కోసం విలపిస్తున్నారు. 'పురాణకాలంలో ద్రౌపదికి దారుణమైన పరాభవం జరుగుతున్నప్పుడు ద్రోణాచార్యుడు మౌనంగా వుండిపోయాడు. ప్రస్తుతం దుర్గామాత నెలవై వున్న నగరంలో ఓ దుర్గ (అభయ) న్యాయం కోసం రోదిస్తోంది. న్యాయ దేవతకు ఇంకా కళ్లకు గంతలు కనిపిస్తున్నాయి. న్యాయం కోసం దుర్గ కొలువై వున్న ఈ నగరం విలపిస్తోంది. ఈ వేదనను అనుభవించలేకపోతున్నామని చెబుతోంది. నా దుర్గకు న్యాయం దక్కేది ఎప్పుడు? నేను ఇకపై ఏ వేడుకా చేసుకోలేను' అంటూ ఆర్జీ కర్ ఆసుపత్రి ఘటనలో మృతి చెందిన అభయ స్నేహితుడి ఆవేదన ఇది. శక్తిస్వరూపిణిగా, ఆదిపరాశక్తిగా, దుర్గామాతగా కీర్తించబడే మహిళ... నేడు తనను తాను రక్షించుకోడానికి, తన ఉనికిని చాటుకోడానికి నిరసనలు, ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఎదురౌతోంది. వారి పోరాటాన్ని బలహీనతగా భావించే సామాజిక సంకుచితత్వం అడుగడుగునా పొంచివుంది. భూమిని తల్లిగా, శక్తిగా భావించే ఈ నేలలో... స్త్రీలు అభద్రతా భావానికి గురికావడం, మానవతకే అవమానం.

అన్యాయాన్ని ఎదిరించి పోరాడే శక్తిగా స్త్రీని అభివర్ణించడం దసరా పండుగలో మనకు కనిపిస్తుంది. కథల్లో, పురాణాల్లో రాక్షసులను ఎదిరించి పోరాడిన ఆమె ధీరత్వాన్ని కొనియాడుతుంటాం. వాస్తవిక ప్రపంచంలో అదే స్త్రీని ఒక అబలగా, వంటింటికే పరిమితమైన వ్యక్తిగా, పురుషాధిక్యత ప్రదర్శిస్తుంటాం. అన్యాయాన్ని ఎదిరించినా, తన అస్తిత్వాన్ని కాపాడుకోవాలని యత్నించినా ఓర్వలేనితనం అడుగడుగునా కనిపిస్తుంది. ఈ నవరాత్రుల్లో తొమ్మిది రూపాల్లో దుర్గమాతను కొలుస్తారు. అదే మహిళ విద్యాధికురాలిగా, ఉద్యోగినిగా, వ్యక్తిత్వమున్న వ్యక్తిగా, ఆర్థిక శక్తిగా రాణిస్తే... జీర్ణించుకోలేని భావజాలం నడుమ నేడు జీవిస్తున్నాం. అభయ లాంటి దుర్గలు ఎంతోమంది దేశం నలుచెరగులా అభద్రతా భావంతో బతుకుతున్నారు. న్యాయం కోసం ఎదురు చూస్తున్నారు. పూజించకపోయినా, ఆమె శక్తిసామర్థ్యాలను కీర్తించకపోయినా... తన వ్యక్తిత్వాన్ని గౌరవించే సమభావం సమాజంలో వుండాలి. 'రుద్రాలిక నయన జ్వాలిక/ కలకత్తా కాళిక నాలిక/ కావాలోయ్ నవకవనానికి....' అంటారు మహాకవి శ్రీశ్రీ. ఒకనాడు ఘనంగా వర్ధిల్లిన మాతృస్వామిక వ్యవస్థకు ఈ పండుగ ఒక ప్రతీక. చెడుపై పోరులో దుర్గాదేవి కావాలి ప్రతి మహిళ. సమాజ చైతన్యమే ఈ దమనకాండకు చరమగీతం.


మహనీయుల మాట



ఏదీ దానంతట అది
మన దగ్గరకు రాదు.
శోధించి సాధించాల్సిందే.
- శ్రీశ్రీ

ప్రస్తుతం

హర్యానా హెచ్చరిక, కాశ్మీర దీపకళిక



తెలకపల్లి రవి

రెండు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల ఫలితాలతో దేశంలో రాజకీయ చర్చను కొత్త మలుపు తిప్పినట్టు కనిపిస్తుంది. లోక్‌సభ ఎన్నికల్లో హ్యాట్రిక్ హంగామా చేసి దెబ్బతిన్న బిజెపి హర్యానాలో మాత్రం దాన్ని సాధించగలిగింది. ఎగ్జిట్ పోల్స్, సర్వేల ఫలితాలు, కాంగ్రెస్ అంచనాలు ఆశలు దారుణంగా విఫలమైనాయి. మీరు సక్రమంగా పనిచేసి వుంటే విజయం దక్కేదని, మీ స్వప్రయోజనాలే పరమార్థంగా మన పార్టీని దెబ్బ తీశారని రాహుల్ గాంధీ ఆగ్రహించారంటే వారి పరిస్థితి అర్థమవుతుంది. జమ్ము కాశ్మీర్ 370 అధికరణం రద్దు ద్వారా దేశమంతా విజయం సాధించాలనుకున్న బిజెపి అక్కడే అనుకున్న లక్ష్యం సాధించలేకపోగా నేషనల్ కాన్ఫరెన్స్ చాలా కాలం తర్వాత మళ్లీ అధికారంలోకి వస్తున్నది. ఒమర్ అబ్దుల్లా మరోసారి ముఖ్యమంత్రి పదవి చేపడతారని ఆ పార్టీ సీనియర్ నేత ఫరూక్ అబ్దుల్లా ప్రకటించారు. బిజెపి జమ్మూలో పూర్తి ఫలితాలు సాధించిందనే ప్రచారం కూడా జోరుగానే నడుస్తున్నది. ఇంకోవైపున బిజెపి ఎన్నికల విజయాలు సాధించే యంత్రంగా పని చేస్తుందనీ దాని వ్యూహాలు అమోఘమనీ మోడియాలో భజన కీర్తనలు వినిపిస్తున్నాయి. కేంద్ర ఎన్‌డిఎ కూటమి పాలనలోనే వున్న ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్యానా గెలుపును కీర్తించడంతో పాటు జమిలి ఎన్నికలు కూడా మంచిదని ప్రకటించారు. తిరుపతి లడ్డూ వివాదం హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల కోణంలో ముందుకు తెచ్చారనే విమర్శ తన సంపాదకీయంలో ప్రస్తావించిన హిందూ పత్రిక ఇప్పుడు దాన్ని మతతత్వ రాజకీయాల వైపు మరల్చవద్దని మరోసారి హితవు పలికింది. ఎ.పి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వంటి వారు బిజెపిని మించి సనాతన ధర్మం, హిందూత్వ వాదనలతో చెలరేగిపోవడానికి కారణాలేమిటని జాతీయ మీడియాలో ఎడతెగని చర్చ సాగుతున్నది. విజయదశమి ముంగిట్లో దేశ రాజకీయ ముఖచిత్రం ఇది. దేశానికి వ్యతిరేకంగా జరిగే కుట్రలకు కాంగ్రెస్ సహకరిస్తున్నదని హర్యానా విజయోత్సవ సభలో ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్య బిజెపి తదుపరి ప్రచారాలు ఎలా వుంటాయో చెబుతున్నది. దీంతోపాటుగానే వామపక్షాలు, ఇతర లౌకిక పార్టీలపైన బిజెపి హర్యానా ఫలితాల ప్రభావం వెనువెంటనే జరిగే మహారాష్ట్ర ఎన్నికలపై ఎలా పడుతుందనే రకరకాల అంచనాలు వినిపిస్తున్నాయి. మహారాష్ట్రలో 'ఇండియా' వేదిక కీలక పార్టీ అయిన ఉద్దవ్ థాకరే శివసేన ఎం.పి సంజయ్ రౌత్ కాంగ్రెస్ అహంభావం గురించి అందరికన్నా తీవ్రమైన వ్యాఖ్యలు చేయడం యాదృచ్ఛికం కాదు.

> జమ్ము కాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్, సిపిఎం కూటమి పూర్తి మెజార్టీ సాధించాయి గానీ కాంగ్రెస్ సీట్లు తగ్గిపోయాయి. ఈ రెండు ప్రాంతాల ఆకాంక్షలను, అవసరాలను అందుకోవడం ఇప్పుడు ఒమర్ అబ్దుల్లా నాయకత్వంలో ఏర్పడే ప్రభుత్వం ముందు సవాలుగా వుంటుంది. సంపూర్ణ రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణ తమ మొదటి కర్తవ్యమని ఒమర్ ప్రకటించారు. అదే సమయంలో వ్యక్తిగతంగా ప్రధాని మోడీ పట్ల సానుకూల ధోరణిలో మాట్లాడటం కాశ్మీర్ పరాధీనతకు ఒక నిదర్శనం. ప్రజల తీర్పుకు అనుగుణంగా వేగంగా చర్యలు తీసుకోవడం అబ్బుల్లా కర్తవ్యం కాగా అందుకు పూర్తిగా సహకరించడం, తమ ఏకపక్ష నిరంకుశ పోకడలు మార్చుకోవడం కేంద్రంపై వున్న బాధ్యత.

హర్యానాలో కాంగ్రెస్ ఓటమి ప్రధానంగా స్వయంకృతాపరాధమన్నది రాహుల్ గాంధీ మాటల్లోనే స్పష్టమవుతున్న విషయం. మిగిలిన నేతలను పక్కన పెట్టి కేవలం భూపేందర్ హుడా నే ఏకైక అధిపతిగా పోటీ పడాలనుకోవడం ఆ పార్టీ మొదటి తప్పిదం. తెలంగాణలో రేవంత్ రెడ్డి, కర్ణాటకలో డి.కె.శివకుమార్ వంటి గట్టి నేతలపై ఆధారపడటం వల్లనే గెలిచామని కాంగ్రెస్ అధిష్టానం వ్యూహకర్తలు భావించడం ఇందుకు కారణమని చెబుతున్నారు. అధిష్టానం చుట్టూ తిరుగుతూ అంతర్గత కలహాలలో మునిగి తేలడం అనే జాడ్యం ఆ పార్టీని ఇంకా వదిలిపెట్టలేదు. బిజెపి మతతత్వ వ్యూహాలనూ కులాలవారీ ఎత్తుగడలను గట్టిగా ఢీకొనడంలోనూ కాంగ్రెస్ పెద్దగా ఆసక్తి చూపలేదు. ఇందుకు తగినట్టే ప్రాంతీయ పార్టీలూ చీలిక వర్గాలు తమ మనుగడ కోసం కాంగ్రెస్, బిజెపి ల మధ్య దాగుడు మూతలాడే లక్షణాన్ని కొనసాగిస్తున్నాయి. ఇవన్నీ హర్యానా ఫలితాలపై ప్రభావం చూపించాయి. మతాన్ని రెచ్చగొట్టడంతో పాటు సామదానభేద దండోపాయాలతో అధికారంలోకి రావాలనే బిజెపి వ్యూహాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఇవే అవరోధాలుగా మారుతున్నాయి. జాట్ ఆధిపత్య వర్గాలకు ప్రతిబింబమైన హుడానే నమ్ముకోవడంతో ఇతర తరగతుల వారు దూరమైనారని ఇప్పుడు ప్రతివారూ గుర్తిస్తున్నారు. అంతేగాక ఆయననే ఏక బిందువుగా చేసుకోవడంతో మిగిలిన కీలక నేతలు, వర్గాలు దూరమైనాయి. లోక్‌సభ ఎన్నికల నాటికీ శాసనసభ ఎన్నికలకూ మధ్య కాంగ్రెస్ ఓట్లలో వచ్చిన తేడా ఆశ్చర్యం కలిగించేంత వుందంటే ఇవన్నీ కారణాలే.

> కాంగ్రెస్ అనైక్యత, ఆప్ వంటి పార్టీలను దూరం చేసుకోవడం ఘోరంగా దెబ్బ తినడానికి కారణమైనాయి. ఐఎన్‌ఎల్‌డి జాట్లు, దళితుల ఓట్ల కోసం కాంగ్రెస్‌తో పోటీ పడిందని గుర్తు పెట్టుకోవాలి. ఇంత క్లిష్ట పరిస్థితిలోనూ మైనార్టీ వర్గాలు మాత్రం కాంగ్రెస్‌కే ఓటు వేశారు గానీ బిజెపి మతతత్వ దాడిని ఆ పార్టీ గట్టిగా ఎదుర్కోలేదనే అసంతృప్తి వారిలోనూ వచ్చింది. ఐక్యత కోసం ప్రయత్నించి విఫలమై 89 చోట్ల పోటీ చేసిన ఆప్ 1.8 శాతం ఓట్లు తెచ్చుకుంది. కనీసం ఈ రెండు పార్టీలు కలిసివున్నా పరిస్థితి చాలా మారివుండేదని ఒక అంచనా. సమాజ్‌వాది పార్టీ కూడా ఈ విషయంలో తన అసంతృప్తిని వెలిబుచ్చింది.



హర్యానా ఫలితాల విశేషాలు

హర్యానా ఎన్నికల ఫలితాలపై అనేక వ్యాఖ్యలు వెలువడ్డాయి గానీ లోక్‌సభ ఎన్నికల నాటికీ ఇప్పటికి ఇంతలోనే వచ్చిన తేడా నిజంగా దిగ్భ్రాంతి కలిగిస్తుంది. కనీసం 36 అసెంబ్లీ విభాగాల్లో దాని ఓట్లు అప్పటికంటే ఒకో చోట పదివేలకు పైగా పడిపోయాయి. 18 స్థానాల్లోనైతే ఏకంగా 20 వేల చొప్పున తగ్గాయి. 28 నియోజక వర్గాలలో అయిదో వంతు ఓట్లు తగ్గిపోయాయి. మరీ ముఖ్యంగా హుడా కుటుంబ నియోజకవర్గమైన రోహ్తక్ లోక్‌సభ స్థానంలోని తొమ్మిది అసెంబ్లీ సీట్లలో అప్పుడు 7.83 లక్షల ఓట్లు వస్తే ఇప్పుడు కేవలం 5.93 లక్షలు వచ్చాయి. అంటే దాదాపు రెండు లక్షల ఓట్లు తగ్గిపోయాయి. నిజానికి హర్యానా వరకూ లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే శాసనసభలో కాంగ్రెస్ పుంజుకోవడమే గత రెండుసార్లు జరిగింది. ఇప్పుడు అది తారుమారైంది. పార్టీలో ముఠా తగవుల వల్ల, టికెట్టు రాని వారు పోటీ అభ్యర్థులుగా వుండటం లేదా ఓట్లు మరోవైపు మరలించడం వల్ల ఇలా జరిగిందని భావించక తప్పదు. అసలు అభ్యర్థుల కంటే రెబల్ కే చాలా ఎక్కువ ఓట్లు వచ్చిన సీట్లు కూడా వున్నాయి. బిజెపి ఓటింగు పెద్దగా పెరిగింది లేదు గానీ సీట్లు విపరీతంగా పెరిగాయి. కాంగ్రెస్ ఓటింగు ఊహించలేనంతగా పడిపోయింది. 2014లో అత్యధికంగా వచ్చిన దాన్ని మించి బిజెపికి 48 స్థానాలు రాగా కాంగ్రెస్‌కు 37 వచ్చాయి. ఐఎన్‌ఎల్‌డికి రెండు, ముగ్గురు స్వతంత్రులు కూడా గెలిచారు. బిజెపికి ఓట్లలో 39.9 శాతం, సీట్లలో 53.3 శాతం దక్కాయంటే ఐఎన్‌ఎల్‌డి, బిఎస్‌పి, హెచ్‌ఎల్‌పి కూటమితో లోపాయికారి అవగాహన కీలక పాత్ర వహించింది. సిర్సా స్థానంలో బిజెపి నేరుగా తన అభ్యర్థిని ఉపసంహరించుకుని ఈ కూటమికి మద్దతు ప్రకటించింది. మిగిలిన చోట్ల అవగాహన ప్రకారం ఓట్ల బదలాయింపు జరిగిందని పరిశీలకులు చెబుతున్నారు. సిర్సా లోక్‌సభ స్థానంలోనే తీసుకుంటే మూడు అసెంబ్లీ సీట్లలో బిజెపి ఓట్లు దారుణంగా తగ్గిపోగా మరో మూడు చోట్ల గణనీయంగా పెరిగాయి. అంటే ఇక్కడ ఒక అవగాహన ప్రకారమే పరస్పరం గెలిపించుకున్నారనే సందేహాలు సహజం. 18 వేల ఓట్లు తగ్గిన కాంగ్రెస్ మూడు అసెంబ్లీలు కోల్పోగా వాటిలో రెండు ఐఎన్‌ఎల్‌డికి, ఒకటి బిజెపికి వచ్చాయి. మరికొన్ని చోట్ల ఈ కూటమికి వచ్చిన ఓట్లు బిజెపి ఆధిక్యత కంటే ఎక్కువగా వున్నాయి. కనుక కావాలనే పోటీ పెట్టించారనే ఆరోపణలున్నాయి. ఇవన్నీ ఎన్నికలలో అసాధారణమేమీ కాదు గాని కాంగ్రెస్ అనైక్యత, ఆప్ వంటి పార్టీలను దూరం చేసుకోవడం ఘోరంగా దెబ్బ తినడానికి కారణమైనాయి. ఐఎన్‌ఎల్‌డి జాట్లు, దళితుల ఓట్ల కోసం కాంగ్రెస్‌తో పోటీ పడిందని గుర్తు పెట్టుకోవాలి. ఇంత క్లిష్ట పరిస్థితిలోనూ మైనార్టీ వర్గాలు మాత్రం కాంగ్రెస్‌కే ఓటు వేశారు గానీ బిజెపి మతతత్వ దాడిని ఆ పార్టీ గట్టిగా ఎదుర్కోలేదనే అసంతృప్తి వారిలోనూ వచ్చింది. ఐక్యత కోసం ప్రయత్నించి విఫలమై 89 చోట్ల పోటీ చేసిన ఆప్ 1.8 శాతం ఓట్లు తెచ్చుకుంది. కనీసం ఈ రెండు పార్టీలు కలిసివున్నా పరిస్థితి చాలా మారివుండేదని ఒక అంచనా. సమాజ్‌వాది పార్టీ కూడా ఈ విషయంలో తన అసంతృప్తిని వెలిబుచ్చింది.

ఇవిఎంలు, ఇతర పార్టీలు...

ఇక పది స్థానాల్లో ఇవిఎంల అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. అసలు తాము ఈ ఫలితాలను ఆమోదించడం లేదని మొదట్లో జైరాం రమేష్ వంటి వారు ప్రకటించారు. ఇ.సి కి ఫిర్యాదు కూడా చేశారు. అయితే ప్రజల తీర్పును ఆమోదించ లేదని చెప్పడం అప్రజాస్వామికమని ఇసి ఆ పార్టీ ఆరోపణలపై విరుచుకుపడింది. ఎ.పి లో వైసీపీ కొన్నిచోట్ల ఆరోపించినట్లుగా ఇవిఎంల బ్యాటరీ ఛార్జింగ్ ఎక్కువగా వుండటం బట్టి తప్పు జరిగిందని ఆరోపించడం సరికాదని సమర్థించుకుంది. మరింత లోతుగా అధ్యయనం చేశాకే ఈ అంశంపై ముందుకు పోవాలని ప్రస్తుతానికి కాంగ్రెస్ నిర్ణయించింది. ఏమైనా లౌకిక పార్టీలనూ 'ఇండియా' భాగస్వాములను కలుపుకొని పోవడంలో వైఫల్యం, ఎన్నికల ఎత్తుగడలు, నినాదాల లోపాల గురించి ఇంతవరకూ మాట్లాడింది లేదు. గతంలో మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ లలో జరిగిన తప్పులే ఇక్కడా పునరావృతమైనాయని అన్ని వైపుల నుంచి వచ్చిన విమర్శను పరిశీలించుకున్నదీ లేదు. ఒక విధమైన ఆశాభంగం అసహనంలో, అనైక్యత మరింత పెరుగుతున్న స్థితిలో వుండిపోయింది. ఈ ఫలితం తర్వాత ఢిల్లీలో తాము వంటరిగానే పోటీ చేస్తామని ఆప్ ప్రకటించింది. యు.పి లో రానున్న ఉప ఎన్నికల్లోనూ ఎస్.పి కాంగ్రెస్‌ను దూరం పెడుతుందని మొదట కథనాలొచ్చినా అఖిలేశ్ యాదవ్ కలిసే పోరాడతామని స్పష్టం చేశారు. ఆ పార్టీ నాయకత్వం ఆత్మావలోకనం చేసుకోవాలని సిపిఎం కూడా సూచించింది. మహారాష్ట్రలోనూ ఇలాంటి విమర్శ ఇంతకు ముందే వుంది. హర్యానాలో బిజెపి మంత్రులు ఎనిమిది మంది ఓడిపోయారంటే ప్రజల్లో వ్యతిరేకత తక్కువ లేదని తెలుస్తుంది. అయితే లోక్‌సభ పోటీలోనూ ఇరు పార్టీలకూ సరిసమానంగానే సీట్లు వచ్చాయని కూడా గుర్తు పెట్టుకోవాలి. అందువల్ల ఈ ఫలితాన్ని మరీ ఏకపక్షంగా చూపించి బిజెపికి తిరుగులేదనో గొప్ప వ్యూహాలతో గెలిచిందనో టముకు వేయడం అర్థరహితం. ఎటొచ్చీ లౌకిక పార్టీలు కలసికట్టుగా గట్టిగా పోరాడవలసిన అవసరాన్ని హర్యానా ఫలితాలు హెచ్చరికగా నిలిచాయి.

కాశ్మీర్‌లో జరగాల్సిందేమిటి?

జమ్ము కాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్, దాని మిత్రులు పూర్తి మెజార్టీ సాధించారు గానీ కాంగ్రెస్ సీట్లు తగ్గిపోయాయి. కాన్ఫరెన్స్‌కు 42, బిజెపికి 29, కాంగ్రెస్‌కు 6, పిడిపికి 3, సిపిఎంకు 1, ఆప్‌కు 1, జెపిసికి 1, ఇండిపెండెంట్లకు ఏడు వచ్చాయి. బిజెపితో జట్టు కట్టిన పిడిపిని ఓటర్లు తిరస్కరించి నేషనల్ కాన్ఫరెన్సుకు పాలన అప్పగించారు. జమ్మూలో బిజెపికి సీట్లు, ఓట్లు కూడా బాగా వచ్చాయి. ఈ రెండు ప్రాంతాల ఆకాంక్షలను, అవసరాలను అందుకోవడం ఇప్పుడు ఒమర్ అబ్దుల్లా నాయకత్వంలో ఏర్పడే ప్రభుత్వం ముందు సవాలుగా వుంటుంది. సంపూర్ణ రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణ తమ మొదటి కర్తవ్యమని ఒమర్ ప్రకటించారు. అదే సమయంలో వ్యక్తిగతంగా ప్రధాని మోడీ పట్ల సానుకూల ధోరణిలో మాట్లాడటం కాశ్మీర్ పరాధీనతకు ఒక నిదర్శనం. ఏమైనా బిజెపి కాశ్మీర్‌లో ఓట్లను చీల్చడానికి అనేక వేర్పాటువాద పార్టీలను ఉపయోగించిందనే ఆరోపణలున్నాయి. పైగా లెఫ్టినెంట్ గవర్నర్‌కు ముందే విస్తారమైన అధికారాలు కట్టబెట్టడంతో పాటు అయిదుగురు ఎంఎల్‌ఎలను నామినేట్ చేసే పెత్తనం కూడా ఇచ్చారు. ఆ విధంగా కేంద్ర పెత్తనం, బిజెపి కుయుక్తులు కొనసాగుతూనే వుంటాయి. నలుగురు ఇండిపెండెంట్ల మద్దతు ప్రకటించడంతో కాన్ఫరెన్స్‌కు సర్కారు ఏర్పాటు చేసే ఆధిక్యత వచ్చింది. కాంగ్రెస్, సిపిఎం, ఇండిపెండెంట్ సభ్యులను కలుపుకుంటే 53 సీట్లతో బలమైన మద్దతు వుంటుంది. ప్రజల తీర్పునకు అనుగుణంగా వేగంగా చర్యలు తీసుకోవడం అబ్బుల్లా కర్తవ్యం కాగా అందుకు పూర్తిగా సహకరించడం, తమ ఏకపక్ష నిరంకుశ పోకడలు మార్చుకోవడం కేంద్రంపై వున్న బాధ్యత.

విశ్లేషణ

మాయావాదాన్ని అల్లుతున్నారు



బి.వి. రాఘవులు

ప్రధాని నరేంద్ర మోడీ, 'సనాతన ధర్మానికి' తన మద్దతును బహిరంగంగా ప్రకటించినప్పుడే అసలు గుట్టు బయట పడింది. సామాజిక న్యాయాన్ని, సమానత్వ భావనను 'సనాతన ధర్మం' తిరస్కరిస్తుందని ఉదయనిధి స్టాలిన్ గతేడాది సెప్టెంబరులో చాలా పదునైన, విమర్శనాత్మక వ్యాఖ్యలు చేసినప్పుడు, మోడీ ఆ సనాతన ధర్మాన్ని గట్టిగా సమర్థించారు. 'సనాతన ధర్మ' వినాశనమే లక్ష్యంగా ఓ రహస్య ఎజెండా నడుస్తోందంటూ తమ వ్యతిరేకులను తీవ్రంగా నిందించారు. 'సనాతన ధర్మ' విరోధులపై ఎదురుదాడి చేయడానికి హిందూత్వ ప్రచారదళంలో భాగస్వాములయ్యేలా మంత్రుల్ని, తన పార్టీ సభ్యుల్ని సైతం పురిగొల్పారు. ఒకవైపు సామాజిక న్యాయం కోసం, దళితుల గౌరవ ప్రతిష్ఠల కోసం తాను కట్టుబడి వున్నట్టు పదే పదే మోడీ చేస్తున్న ప్రకటనలు బూటకమని, అంబేద్కర్‌పై ఆయన కురిపిస్తున్న ప్రశంసలు, సంత్ రవిదాస్ విగ్రహం పట్ల ఆయన చూపిస్తున్న భక్తి యావత్తూ ఒట్టి డొల్ల మాత్రమేనని మోడీ తాజా ప్రకటన తేటతెల్లం చేస్తోంది.

"భారత దేశాన్ని వేల సంవత్సరాల పాటు ఐక్యంగా ఉంచిన ఆలోచనలు, విలువలు, సాంప్రదాయాలు అన్నీ కలిసి 'సనాతన ధర్మం'గా ఉన్నట్టు మోడీ ప్రకటించారు. అయితే 'ప్రాచీన', 'శాశ్వత', 'సార్వత్రిక సత్యాలు లేదా ధర్మాలు' లాంటి అస్పష్టమైన పదాలను తప్ప, 'సనాతన ధర్మం' చెప్పే ఆలోచనలు, విలువలు, సాంప్రదాయాలు ఏమిటి అన్న సంగతిని మోడీగానీ, ఎదుటివారిని తిట్టిపోయడమే పనిగా పెట్టుకున్న ఆయన అనుచర గణంగాని వివరించలేదు. 'సనాతన ధర్మం' యొక్క మౌలికమైన, ప్రత్యేకమైన 'వర్ణ లేదా కుల వ్యవస్థ' లక్షణాన్ని మరుగుపరచడం కోసమే ఏ వివరణా ఇవ్వలేదు.

అన్ని హంగులూ కలిగివున్న అతగాడి సేనానులు తమ మాటల గారడీతో సనాతన ధర్మానికి కొమ్ము కాయడానికి తయారయ్యారు. లోకజ్ఞానం, మానవ విలువలు, వ్యక్తిగత విధులు, బాధ్యతలు, ప్రవర్తనా ప్రమాణాలు, నైతిక విలువలు లాంటి మాటల ముసుగులో దాని అసలు సారాంశాన్ని కప్పిపుచ్చుతున్నారు. 'సనాతన ధర్మం' యొక్క నిజ స్వభావాన్ని దాచిపెట్టడానికి దాని చుట్టూ ఆధ్యాత్మిక మాయావాదాన్ని అల్లుతున్నారు. దీనిని సద్గురు వాసుదేవ్ లాంటి ప్రముఖులిచ్చిన వివరణల్లో మనం చూడవచ్చు. "ఈ సనాతన ధర్మం అనే ప్రక్రియ నీలో ప్రశ్నలు రేకెత్తించడం కోసమే ఉంది. ఆ ప్రశ్నల లోతుల్లోకి పోయి దీనంతటికీ మూలం ఏమిటో నువ్వే సహజంగా తెలుసుకుంటావు". ఇలాంటి మరొక గురువు 'సనాతన ధర్మం' "అందర్నీ ప్రేమించి, అందర్నీ కలుపుకొని పోతుందని" వ్యాఖ్యానించాడు. ఒకవేళ మనం ఈ వాదనలను 'సనాతన ధర్మం' యొక్క సారంగా అంగీకరించినా, ఇలాంటి శాశ్వతమైన సత్యాలే మనకు అన్ని మతాల్లోనూ కనిపిస్తాయి. కాని, అమానవీయ కుల, లింగ వివక్షతను ఎదుర్కొంటున్న దళితులు, ఇతర బలహీన కులాల వారి దైనందిన జీవితానుభవాల నుండి తలెత్తే ప్రశ్నలకు ఇట్లాంటి వాదనలు ఏ సమాధానాన్నీ ఇవ్వగల పరిస్థితి లేదు.

ఇంతకూ సనాతన ధర్మం ప్రత్యేకత ఏమిటి? ఏ మాత్రమూ సమర్థించుకోలేని స్థితిలో ఉన్న హిందూత్వ తత్వవేత్తలు తప్పించుకోవడానికి ఇచ్చే వివరణలు, వ్యక్తం చేసే ధర్మాగ్రహం మాట ఎలా వుందన్నదానితో నిమిత్తం లేకుండా వారు సనాతన ధర్మంలో ఉన్న శాశ్వత సత్యాన్ని కప్పిపుచ్చలేరు. కఠినమైన, అమానవీయ, వారసత్వ, పుట్టుక ఆధారిత, నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను దాచిపెట్టలేరు. అత్యంత నిరంకుశమైన, హానికరమైన 'వర్ణాశ్రమ ధర్మం' లేక 'కుల ధర్మం' కొన్ని వేల సంవత్సరాలుగా భారతదేశమంతా విస్తరించివున్న ఏకైక ముఖ్యమైన ఆలోచన, విలువ, సాంప్రదాయం అనే వాస్తవాన్ని వారు విస్మరిస్తున్నట్టు భావించాలి. కాబట్టి మోడీ, సంఘ్ పరివార్ ప్రత్యేకమైన బుద్ధి మాంద్యంతో బాధపడుతున్నట్లు భావించాలి. వేదాలు, ఉపనిషత్తులు, ధర్మ సూత్రాలు, గృహ్య సూత్రాలు (గృహస్థులు ఆచరించాల్సిన ధర్మాలు, సంస్కారాలు), పురాణాలు, భగవద్గీత అన్నీ వర్ణ లేదా కుల వ్యవస్థను సమర్థిస్తాయి. ఈ వాస్తవాన్ని వారు నిరాకరించగలరా? వర్ణ ధర్మం నుండి పక్కకు మళ్ళుతున్నందుకు కఠినమైన శిక్షను విధించడమే కాక, వర్ణ ధర్మ పరిరక్షణ పాలకుల ప్రాథమికమైన బాధ్యత అని చెప్పే మనుస్మృతిని మనం పట్టించుకోకూడదని వారు కోరుకుంటున్నారా?

ఒకవేళ 'కుల వ్యవస్థ వేరు, సనాతన ధర్మం వేరు' అని కుల వ్యవస్థను బలపరిచే వాదనలతో విడగొట్టుకోవాలనుకుంటే, మోడీ ఆ విషయాన్ని ముందు స్పష్టం చేయాలి. ఆ తర్వాతనే తన వ్యతిరేకుల మీద విమర్శలకు పూనుకోవాలి. అది అతనికి కచ్చితంగా తెలియకుంటే శ్రేణీగత, వివక్షాపూరిత 'వర్ణ లేదా కుల ధర్మం' వారి పవిత్రమైన గ్రంథాల్లో భాగంగా ఉన్నాయా లేవా అనే విషయంపై వివరణ ఇమ్మనమని వారు సాధువుల్ని, మత ప్రచారకులని, శంకరాచార్యుల్ని వేడుకోవచ్చు. అయితే, మోడీ ఈ పని చేస్తారని ఎలా ఆశించగలం? అలా అయితే అతని కపటత్వం బైట పడుతుంది కదా!

ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యల నుండి తలెత్తిన వివాదం



> 'సనాతన ధర్మం' యొక్క నిజ స్వభావాన్ని దాచిపెట్టడానికి దాని చుట్టూ ఆధ్యాత్మిక మాయావాదాన్ని అల్లుతున్నారు. దీనిని సద్గురు వాసుదేవ్ లాంటి ప్రముఖులిచ్చిన వివరణల్లో మనం చూడవచ్చు. "ఈ సనాతన ధర్మం అనే ప్రక్రియ నీలో ప్రశ్నలు రేకెత్తించడం కోసమే ఉంది. ఆ ప్రశ్నల లోతుల్లోకి పోయి దీనంతటికీ మూలం ఏమిటో నువ్వే సహజంగా తెలుసుకుంటావు". ఇలాంటి మరొక గురువు 'సనాతన ధర్మం' "అందర్నీ ప్రేమించి, అందర్నీ కలుపుకొని పోతుందని" వ్యాఖ్యానించాడు. ఒకవేళ మనం ఈ వాదనలను 'సనాతన ధర్మం' యొక్క సారంగా అంగీకరించినా, ఇలాంటి శాశ్వతమైన సత్యాలే మనకు అన్ని మతాల్లోనూ కనిపిస్తాయి. కాని, అమానవీయ కుల, లింగ వివక్షతను ఎదుర్కొంటున్న దళితులు, ఇతర బలహీన కులాల వారి దైనందిన జీవితానుభవాల నుండి తలెత్తే ప్రశ్నలకు ఇట్లాంటి వాదనలు ఏ సమాధానాన్నీ ఇవ్వగల పరిస్థితి లేదు.

హిందూత్వ దళం అసలు రంగును ప్రజల ముందు బయటపెట్టింది. మోడీ, ఆయన అనుచర గణం తాము 19వ శతాబ్దానికి చెందిన అభివృద్ధి నిరోధకులైన సనాతనవాదులకు నిజమైన వారసులుగా మన ముందు నిలబడ్డారు. ఆ కాలంలో బ్రహ్మ సమాజం, ఆర్య సమాజ్, ప్రార్థనా సమాజ్, రామకృష్ణ మిషన్ వంటి సంస్థలు హిందూ మతానికి అనేక సంస్కరణలు ప్రతిపాదించాయి. ఆ సంస్కరణలను వ్యతిరేకిస్తూ పలు ఛాందసవాద, సాంప్రదాయ హిందూ సంస్థలు పుట్టుకొచ్చాయి. ఆ సంస్థల నాయకులే, 'సనాతన ధర్మానికి' ప్రాచుర్యం కల్పించారు. 'హిందూ' అనే పదం పర్షియన్ మూలాలు కలిగి ఉన్నందువల్ల ఈ 'సనాతన వాద' సేవా తత్పరులు 'హిందూ' పదాన్ని ఇష్టపడక, దానికి బదులుగా 'సనాతన ధర్మం' అనే పదానికి ప్రాధాన్యత ఇవ్వడం ఆసక్తికరమైన విషయం.

/ వ్యాసకర్త సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు /

(సనాతన ధర్మంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రజాశక్తిలో 2024 ఏప్రిల్ 3న ప్రచురితమైన వ్యాసంలో కొంత భాగం పునర్ముద్రణ)

జనవాక్యం

ప్రభుత్వం అప్రమత్తం అవ్వాలి

రాష్ట్రానికి తుఫాను ముప్పు ప్రమాదం పొంచి ఉన్నదని వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరిక చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా వర్షపు నీరు సవ్యంగా పారేలా డ్రెయిన్లలో పూడికలు తొలగించాలి. చెరువులు, కుంటల కట్లను పటిష్టం చేయాలి. ఎక్కడైనా గతంలో పడిన గండ్లను పూడ్చుకుంటే, యుద్ధ ప్రాతిపదికన గండ్లను పూడ్చాలి. చెక్ డ్యాంలలో పూడికలు తొలగించి నీటి నిల్వ సామర్థ్యం పెంచేలా తక్షణం పనులు ప్రారంభించాలి. ఇందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేయించాలి. వరద నీరు పంట పొలాలను ముంచెత్తకుండా సకల జాగ్రత్తలు తీసుకుంటే పంట నష్టం గణనీయంగా తగ్గించవచ్చు. చాలా ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభమైనందున వ్యవసాయ శాఖ రైతులకు తగు సూచనలు ఇవ్వాలి. ప్రజాప్రతినిధులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ పర్యవేక్షణ బాధ్యత తీసుకోవాలి. ఇటీవలి బుడమేరు వరద అనుభవాలతో ప్రభుత్వం తగు జాగ్రత్తలు ముందుగానే తీసుకోవాలి.

- గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా.

సగం జనరల్ బోగీలు!

మద్రాసు నుండి ఛాప్రా రైలుకు పది ఏసీ పెట్టెలూ, ఏడు త్రీ టైర్ పెట్టెలు, వెనకొకటి, ముందొకటి జనరల్ బోగీలు ఉన్నాయి. ఆ రెండు పెట్టెలు కిటకిటలాడుతూ ఉన్నాయి. ప్లాట్ ఫారం మీద ఉన్నవాళ్లు సగం మంది ఎక్కారు. సగం మంది ఎక్కలేక, రైల్వే వారిని తిట్టుకుంటూ ఉసూరుమంటూ ఫ్లాట్ ఫారం మీద కూర్చున్నారు. అంటే డబ్బున్నవారికేనా ఈ రైళ్లు? ఈ రైళ్లు ప్రభుత్వ రైళ్లు కాదా!! అయితే దీనదయాళ్ పేరు పెట్టినట్లుగా ప్రతి ఎక్స్‌ప్రెస్‌కు సగం జనరల్ బోగీలు వేసి మరేదైనా పేరు పెట్టుకోండి. అభ్యంతరం ఉండదు. అయినా ఎమిటీ రైళ్ళు? ఎవరి కోసం? ఈ మధ్య వందేభారత్ రైళ్ళు, వందేమాతరం రైళ్ల అంటూ అన్నీ ఏసీ రైళ్లు వేస్తున్నారు. ఈ రైళ్లలో డబ్బులున్నవారు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రభుత్వ అధికారులు ఎక్కువగా ప్రయాణం చేస్తుంటారు. సామాన్యుడు అసలు ఈ రైలు ముఖమే చూడడు. రైల్వే అంతా వ్యాపారమయం అయిపోయింది. సామాన్యుడికి ఈ రైళ్ల వలన ఉపయోగం ఏ మాత్రం లేదు. పాసెంజర్ రైళ్ళను తీసేసి వాటి స్థానంలో స్పెషల్ రైళ్ళు పెట్టి దోచుకుంటున్నారు. సీనియర్ సిటిజన్లకు రాయితీ తొలగించారు. నిజంగా ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే ఏసీ రైళ్లు ఎందుకు? అన్నీ ప్యాసెంజర్ రైళ్ళు జనరల్ బోగీలతో వెయ్యాలి కదా? కేంద్ర ప్రభుత్వం నాటకాలు ఆడుతున్నది. ఇకనైనా కేంద్రం ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలుకు సగం జనరల్ బోగీలు వేసి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య

సిఎం, డిప్యూటీ సిఎం దసరా శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజలందరిలోనూ దసరా సంతోషాన్ని నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. దసరా నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచికి విజయానికి ప్రతీకగా చేసుకునే దసరా పండగలో అందరి జీవితాల్లోనూ కొత్త వెలుగు నింపాలని కోరారు. శాంతియుత, అభివృద్ధి కారక సమాజం కోసం అందరూ కృషి చేయాలని ఆయన కోరారు. అలాగే డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ కూడా రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

విజయానికి ప్రతీక : మాజీ సిఎం జగన్

చెడుపై మంచి, దుష్టశక్తులపై దైవశక్తి విజయానికి ప్రతీక దసరా అని, చెడు ఎంత దుర్మార్గమైనా, శక్తిమంతమైనా అంతిమ విజయం మంచినే వరిస్తుందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆయన దసరా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖశాంతులు, సిరి సంపదలతో తులతూగాలని ఆయన కోరారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... ధర్మవరం పట్టణం 39వ వార్డు రాంనగర్‌కు చెందిన ఉడుముల రంగా (43) చేనేత మగ్గం నేస్తూ జీవనం సాగించేవారు. మగ్గం నిర్వహణ, కుటుంబ పోషణకు నిమిత్తం దాదాపు రూ.ఆరు లక్షల వరకు అప్పులు చేశారు. మగ్గం నేసినా పట్టుచీరలకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పులు తీర్చడం భారమైంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంటిలోని మగ్గం పట్టీకి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

వేడుకగా శ్రీవారి రథోత్సవం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజైన శుక్రవారం ఉదయం 7 గంటలకు ఉభయదేవేరులతో కూడిన శ్రీ మలయప్పస్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో యాత్రికులు పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. తిరుమాడ వీథులలో రథాన్ని లాగేటప్పుడు ప్రమాదాలు జరగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. వాహనసేవలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఇఒ జె శ్యామల రావు, అదనపు ఇఒ సి హెచ్ వెంకయ్య చౌదరి, జెఇఒలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్ఒ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

28 కేజీల గంజాయి స్వాధీనం

- ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణా జిల్లా)

ఒడిశా నుంచి కేరళ రాష్ట్రానికి గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 28 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కృష్ణాజిల్లా ఎస్‌పి గంగాధర్‌రావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి కృష్ణా జిల్లా పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్‌పి తెలిపిన వివరాల ప్రకారం.. గంజాయి నియంత్రణ కోసం జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు విస్తృతంగా చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో గత నెల 28వ తేదీన కేరళకు చెందిన సాదిక్, ధనుష్‌లు ఒడిశాలోని కోరాపూట్‌లో సాధుమాజీ, హేమంత్‌ల వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి కేరళకు తరలించబోయారు. సాధిక్, ధనుష్‌లు తేలప్రోలు వద్దకు వచ్చేసరికి, పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న ఆత్కూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ చావా సురేష్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్న విషయం గమనించి యువకులు స్కూటీని అక్కడే వదిలేసి పక్కన పొలాల్లోకి పారిపోయారు. దీంతో అనుమానమొచ్చిన పోలీసులు స్కూటీని తనిఖీ చేయగా అందులో సుమారు 28 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఆత్కూరు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ కేసులో గంజాయి రవాణా చేస్తున్న సాదిక్, ధనుష్‌లు, వారికి అమ్మిన సాధుమాజీ, హేమంత్, మరో ఇద్దరు కేరళ యువకులు నియాజ్, ఆగస్టిన్‌లను కూడా అరెస్టు చేసినట్లు ఎస్‌పి తెలిపారు.

వైసిపి మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు అస్వస్థత

గుంటూరు : జైలులో ఉన్న వైసిపి మాజీ ఎంపీ నందిగం సురేశ్ అస్వస్థతకు గురవ్వడంతో ఆయన్ను వెంటనే గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన ఘటన శుక్రవారం జరిగింది. భుజం, ఛాతీలో నొప్పి వస్తున్నట్లు నందిగం సురేశ్ చెప్పడంతో జైలు అధికారులు ఆయన్ను వెంటనే గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అరెస్టు చేసే సమయంలో కూడా నందిగం సురేశ్ తనకు భుజం నొప్పి ఉన్నట్లు జైలు అధికారులకు తెలిపారు. వైసిపి అధికారంలో ఉండగా చంద్రబాబు ఇంటిపై దాడి, మరియమ్మ అనే మహిళ హత్య కేసులో నందిగం సురేశ్ నిందితుడిగా ఉన్నారు. న్యాయస్థానం రిమాండ్ విధించడంతో గుంటూరు జైలుకు ఆయన్ను తరలించిన సంగతి తెలిసిందే.

అభివృద్ధి వికేంద్రీకరణ లక్ష్యం

- పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు సిద్ధం
- ప్రభుత్వ భూముల్లో నివసించేవారికి పట్టాలు
- కియా కార్ల షోరూం ప్రారంభోత్సవంలో మంత్రి లోకేష్



కియా షోరూమ్ ప్రారంభ సందర్భంగా మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ (గుంటూరు జిల్లా)

పరిపాలన ఒకే దగ్గర ఉండాలని, అభివృద్ధి వికేంద్రీకరణ అన్ని ప్రాంతాలకు జరగాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని కొలనుకొండలో సింహా కియా కార్ల షోరూమ్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మీడియాతో లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి కియా మోటార్స్ రావడానికి చంద్రబాబు కారణమని తెలిపారు. ఇప్పుడేమో పరిశ్రమ ఏర్పాటుకు టిసిఎస్ ముందుకొచ్చిందని అన్నారు. జగన్ పాలనలో ఎన్ని కంపెనీలు తెచ్చారో? ఎన్ని ఉద్యోగాలిచ్చారో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వంపై నమ్మకంతో రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జగన్ తరిమేసిన పరిశ్రమలన్నీ తీసుకొస్తామన్నారు. రాయలసీమకు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లు, ఉత్తరాంధ్రకు సర్వీసింగ్‌లు, కర్నూలుకు విండ్, సోలార్, పంప్ స్టోరేజ్ ప్రాజెక్టులు, సిమెంట్ ఫ్యాక్టరీలు, కడప, చిత్తూరులకు ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలు, అనంతపురానికి ఆటోమొబైల్స్, ఉభయగోదావరి జిల్లాలకు ఆక్వా, పెట్రో కెమికల్ పరిశ్రమలు, కృష్ణా, గుంటూరులో అనేక యూనిట్లు, పెట్టుబడులు తెస్తామని వివరించారు. వరద సాయం విషయంలో లోపాలుంటే సరిచేసుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రెడ్‌బుక్ యాక్షన్ ఇప్పటికే మొదలైందని, వైసిపి వేరే బుక్‌లు పెట్టుకున్నా తమకేమీ భయం లేదన్నారు. గుంటూరులో ఇఎస్ఐ ఆస్పత్రి, మంగళగిరిలో ఎయిమ్స్‌కు నీటి సరఫరాతోపాటు వంద పడకల ఆస్పత్రి నిర్మాణం త్వరలోనే చేపడతామని తెలిపారు. మూడు నెలల్లో మంగళగిరిలో భూగర్భ డ్రెయినేజీ పనులు చేపడతామని, దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారికి పట్టాలిస్తామని తెలిపారు.

తాను మరణించి... ఐదుగురులో జీవించి..

ఒడిశా యువకుడు నరేష్ పట్నాయక్ అవయవదానం

ప్రజాశక్తి - అరిలోవ (విశాఖపట్నం)



నరేష్ పట్నాయక్ (ఫొటో)

తాను చనిపోతూ ఐదుగురి ప్రాణాలు కాపాడారు.. ఒడిశాకు చెందిన యువకుడు. అవయవదానంతో కొందరి జీవితాల్లో వెలుగులు నింపి చిరస్థాయిగా నిలిచారు. ఈ నెల 9న ఒడిశా రాష్ట్రంలోని పర్లాకిమిడి జిల్లాకు చెందిన నరేష్ పట్నాయక్ (32) ఇంట్లో స్పృహ కోల్పోయారు. దీంతో కుటుంబ సభ్యులు దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్‌లో తీవ్ర రక్తస్రావం అవుతోందని అక్కడి వైద్యులు తెలపడంతో అత్యవసర చికిత్స నిమిత్తం ఒడిశా నుంచి విశాఖలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఆయనను బతికించేందుకు రెండు రోజులపాటు వైద్యులు ఎంతో శ్రమించారు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో నరేష్ పట్నాయక్ బ్రెయిన్ డెడ్‌కు గురయ్యారని వైద్యులు శుక్రవారం నిర్ధారించారు. నరేష్ ప్రాణాలు నిలిపే అవకాశం లేనందున అవయవదానం ద్వారా మరో ఐదుగురికి పునర్జన్మ ఇవ్వవచ్చని వైద్యులు సలహా ఇవ్వడంతో నరేష్ పట్నాయక్ కుటుంబ సభ్యులు ఇందుకు అంగీకారం తెలిపారు. ఈ విషయాన్ని జీవన్‌దాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు దృష్టికి తీసుకెళ్లడంతో నరేష్ పట్నాయక్ ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీలు, లివర్, కళ్లను సేకరించి ఐదుగురికి కేటాయించారు. అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా డాక్టర్ కె.రాంబాబు అభినందించారు. విజయవంతంగా అవయవాలను సేకరించి తరలించిన వైద్య బృందానికి, గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాలు వేగంగా చేరేందుకు సహకరించిన విశాఖ నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చికి కృతజ్ఞతలు తెలిపారు. నరేష్ చనిపోతూ మరో ఐదుగురు జీవితాల్లో వెలుగులు నింపినందుకు గర్వంగా ఉందని మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

- ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయులు, ఉద్యోగులు దాచుకుంటున్న, మినహాయింపులు చేసుకున్న (డిడక్షన్స్) నిధి నుంచి బకాయిలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపిటిఎఫ్ కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు దాచుకుంటున్న ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్), ఎపి జీవిత బీమా (ఎపిజిఎల్ఐ) నుంచి ప్రతినెలా రూ.350 కోట్లు మినహాయింపులు చేస్తున్నారని తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక సుమారు రూ.1000 కోట్లు జమ అయి ఉంటుందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పోలీసులు అత్యవసరాల నిమిత్తం పిల్లల ఫీజులు, పెళ్ళిళ్లు, పండగలు ఇతర కొనుగోళ్లకు తాము దాచుకున్న నగదు నుంచి పొందేందుకు సుదీర్ఘకాలంగా వేచిచూడాల్సి రావడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. బడ్జెట్ లేదనే నెపం వేయకుండా తాము పిఎఫ్, ఎపిజిఎల్ఐ రుణాలు, క్లోజర్స్, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు మంజూరు తక్షణమే మొదలు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పోర్టు ఆస్పత్రి ప్రయివేటీకరించొద్దు

ప్రజాశక్తి - సీతమ్మధార (విశాఖపట్నం)



పోర్టు ఆసుపత్రి వద్ద ధర్నా

విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రి ప్రయివేటీకరణను మోడీ ప్రభుత్వం నిలిపివేయాలంటూ సిపిఎం ఆధ్వర్యాన సాలిగ్రాంపురంలోని పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రి ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. తొలుత సమీప ప్రాంతాల్లో ర్యాలీ చేపట్టారు. ధర్నాను ఉద్దేశించి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ప్రయివేటీకరణ ఆపకుంటే మోడీ సర్కారుకు ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. పోర్టు ఆస్పత్రిని పోర్టు నిధులతోనే 300 పడకల మల్టీసూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలన్నారు. పిపిపి పేరుతో ప్రయివేటీకరించడం తగదని, ప్రయివేటీకరణ టెండర్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ పోర్టు సాలీనా సుమారు రూ.300 కోట్లు లాభాలను ఆర్జిస్తోందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపంలో సుమారు రూ.170 కోట్ల ఆదాయం సమకూరుస్తోందని పేర్కొన్నారు. వేలాది ఎకరాల భూములు కలిగి ఉందని, కార్గో హేండ్లింగ్, ఇతర విభాగాల్లో దేశంలో పలు రికార్డులు సాధిస్తూ వస్తోందని గుర్తు చేశారు. ఈ ఘనత సాధనలో సంస్థ ఉద్యోగులు, కార్మికుల పాత్ర విశిష్టమైనదన్నారు. వారి ఆరోగ్యాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది, యాజమాన్యానిదని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలను, ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెడుతున్న మోడీ ప్రభుత్వం పోర్టు ఆస్పత్రిని సైతం ప్రయివేటుకు కట్టబెట్టేందుకు పూనుకుందని, అందుకు టెండర్లు ఆహ్వానించిందని తెలిపారు. ఇది కార్మిక కుటుంబాల వైద్య హక్కును హరించడమే అవుతుందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.ఈశ్వరమ్మ, బి.పద్మ, యుఎస్ఎన్.రాజు పాల్గొన్నారు.



డ్వాక్రా బజారును ప్రారంభిస్తున్న కేంద్రమాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు, రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

నైపుణ్యాన్ని వెలికితీసేందుకే..

- అఖిల భారత డ్వాక్రా బజార్ ప్రారంభించిన : కేంద్ర మాజీ మంత్రి అశోక్
- గ్రామీణ పేదరికాన్ని తగ్గించడానికి దోహదం : మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంకోట

అఖిలభారత డ్వాక్రా ఉత్పత్తుల బజార్ (సరస్) - 2024 ప్రారంభమయ్యింది. విజయనగరంలోని పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరం, ఉత్సవాలను పురస్కరించుకొని, పెద్దచెరువు రోడ్డులోని మాన్సాస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఈ బజార్‌ను కేంద్ర మాజీ మంత్రి, మాన్సాస్ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మహిళల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయని అన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు సైతం గౌరవప్రదంగా తమ జీవనాన్ని సాగించేందుకు, వారి ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మహిళలు తయారు చేసే కళాకృతులు, వివిధ రకాల ఉత్పత్తుల విక్రయాలకు ఇలాంటి ప్రదర్శనలు వేదికగా నిలుస్తున్నాయని, దీనిని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. మైసూరు ఉత్సవాల తరహాలో పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవాన్ని నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనను శాశ్వతంగా నిర్వహించేందుకు అమరావతిలో పదెకరాలను కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళల చేతి నైపుణ్యంతో రూపొందించిన ఎన్నో వస్తువులు, కళాకతుల ను ఈ డ్వాక్రా ప్రదర్శనలో ఉంచారని, వీటిని జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. మొత్తం 254 స్టాల్స్ ఏర్పాటు చేసి, మన రాష్ట్రంతోపాటు 18 రాష్ట్రాలకు చెందిన డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఆహార పదార్థాలు, వస్త్రాలు, వివిధ రకాల కలంకారీ వస్తువులు, ఆయుర్వేద ఉత్పత్తులు, గృహోపకరాణాలు, కళాకృతులను విక్రయానికి ఉంచారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, సెర్ప్ సిఇఒ వీర పాండ్యన్, జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్, నాబార్డ్ సిజిఎం కెవిఎస్ ప్రసాద్, డిఆర్‌డిఎ పిడి ఎ కల్యాణచక్రవర్తి, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, సిపిఒ పి మురళి, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, నాబార్డ్ డిడి నాగార్జున, వివిధ శాఖల అధికారులు, డిఆర్‌డిఎ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



విజయవాడలోని ఒక రైతు బజారులో సరుకుల నాణ్యతను పరిశీలిస్తున్న నాదెండ్ల

రైతు బజార్లలో నాదెండ్ల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - విజయవాడ

ప్రజలకు విక్రయించే సరకుల నాణ్యత, ధరలపై విజయవాడలోని రైతు బజార్లను మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గురునానక్ కాలనీ సహా, పంటకాలువ రోడ్డులో ఉన్న రైతు బజార్లను తనిఖీ చేశారు. వంటనూనెలు, ఉల్లి, టమాటా విక్రయాలపై వినియోగదారులను అడిగి సమాచారం తెలుసుకున్నారు. పామాయిల్ లీటరు రూ.110కి, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124కు విక్రయించాలని, అందరికీ కనబడేలా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ఒకే రకమైన ధరల్ని అమలు చేయాలని ప్రభుత్వ నిర్ణయించిందని పేర్కొన్నారు. ప్రతి రేషన్ కార్డుపై రిఫైండ్ ఆయిల్‌ను గరిష్టంగా రూ.124కు, పామాయిల్‌ను రూ.110కు విక్రయించాలన్నారు. రాష్ట్రంలోని కోటీ 49 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డు సదుపాయం ఉండడంతో వారికి సబ్సిడీ ధరలపై వంట నూనె అందిస్తున్నట్లు తెలిపారు. రైతు బజార్‌లలోని దుకాణాల వద్ద ధరలు సూచించే బోర్డులు ఏర్పాటు చేయించారు. ఉల్లి, టామాటా నాణ్యతనూ పరిశీలించి నాణ్యత లేని ఉత్పత్తులు విక్రయిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు.



సబ్ కలెక్టర్ కు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

వైద్య కళాశాల తక్షణమే నిర్మించండి


- విద్యార్థి యువజన సంఘాల డిమాండ్

ప్రజాశక్తి- ఆదోని

ఆదోనిలో ప్రభుత్వ వైద్య కళాశాలను తక్షణమే నిర్మించి, తరగతులు ప్రారంభించాలని విద్యార్థి యువజన సంఘాల జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి యువజన సంఘాల నాయకులు మాట్లాడుతూ అభివృద్ధిలో వెనుకబడిన ఈ ప్రాంతంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తారని అందరం హర్షించామన్నారు. ప్రభుత్వాలు మారడంతో కళాశాలకు గ్రహణం ఏర్పడడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఆదోనిలో అర్థాంతరంగా నిలిచిపోయిన మెడికల్ కళాశాల పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆదోనిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభిస్తే చుట్టూ పక్కల ప్రజానీకానికి మంచి వైద్యం అందుబాటులోకి వస్తుందని స్థానిక రెవిన్యూ డివిజన్‌లోని బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు వైద్య విద్య అందుతుందన్నారు. కేంద్రంతో సంప్రదించి ఐదు కళాశాలలకు అనుమతులు తీసుకురావాల్సిన రాష్ట్ర ప్రభుత్వం పులివెందులకు వచ్చిన 50 సీట్లు కూడా వసతులు కల్పించలేమని ఎన్ఎంసికి లేఖ రాయడం ఏమిటని ప్రశ్నించారు. ఒక్క పాడేరుకే 50 సీట్లు వచ్చాయని, మిగిలిన నాలుగు కళాశాలలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఒపి ఇచ్చి ఉంటే అనుమతులు లభించి ఉండేవని తెలిపారు. 700 సీట్లు ప్రభుత్వ నిర్లక్ష్యపు చర్య వల్ల కోల్పోయామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది కేవలం వైద్య విద్యను ప్రయివేటీకరణ చేయాలనే దుర్మార్గపు చర్యగా భావిస్తున్నామని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, సంఘాల నాయకులు తాము నిర్వహించే ఉద్యమానికి కలిసి రావాలని కోరారు. ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సాబీర్ బాష, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు అఖండ, జిల్లా కోశాధికారి సోమశేఖర్, డిఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, బిడిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీన రమేష్, ఎస్ఎస్‌యుఐ డివిజన్ అధ్యక్షులు బాలు, డివైఎఫ్ఐ నాయకులు గోవిందరాజులు మాట్లాడారు.

కాంగ్రెస్ వైఫల్యంతోనే హర్యానాలో ఓటమి : సిపిఐ నారాయణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ (తిరుపతి జిల్లా)



హర్యానాలో ఓటమి కాంగ్రెస్ వైఫల్యమే తప్ప.. ఇండియా వేదికది కాదని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. తిరుపతి జిల్లా గూడూరులో ఓ ప్రయివేట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. హర్యానాలో తాము గెలుస్తామన్న ధీమాతో మిత్ర పక్షాలను పట్టించుకోకుండా అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం వల్ల కాంగ్రెస్ పార్టీ ఓటమిపాలైందన్నారు. త్వరలో జరగనున్న రాష్ట్రాల ఎన్నికల్లోనూ ఇండియా వేదిక విజయం సాధించాలంటే అన్ని పార్టీలను కలుపుకొనిపోవాలని సూచించారు.. జమ్మూ కాశ్మీర్‌లో ఇండియా వేదిక విజయం శుభపరిణామన్నారు. జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని తెలిపారు. ఉచిత ఇసుకను పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. మద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదాయ వనరుగా పరిగణించడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. విశాఖ ఉక్కును ప్రయివేటీకరిస్తుంటే సిఎం చంద్రబాబు ఎందుకు కినుకు వహిస్తున్నారని స్పందించడం లేదన్నారు. ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ప్రభాకర్, శశికుమార్, కాలేషా పాల్గొన్నారు.



దేవి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

కవ్వగుంటలో విషాదం

- భర్త, కుమారుల మృతిని జీర్ణించుకోలేక మహిళ ఆత్మహత్య


ప్రజాశక్తి- ఏలూరు స్పోర్ట్స్

భర్త, కుమారుల మృతిని జీర్ణించుకోలేక మహిళ ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన ఏలూరు జిల్లా పెదవేగి మండలం కవ్వగుంటలో చోటుచేసుకుంది. పందెం కోడిని ఈత కోసం పోలవరం కాలువకు రెండు రోజుల క్రితం తీసుకెళ్లిన శెట్టిపల్లి వెంకటేశ్వరరావు కుమారులు మణికంఠ, సాయికుమార్ ప్రమాదశాత్తు ఆ కాల్వలో పడిపోవడం మృతి చెందడం, వారిని రక్షించేందుకు కాల్వలోకి దూకిన వెంకటేశ్వరరావు కూడా మరణించడం తెలిసింది. దీంతో, ఆ కుటుంబంలో మిగిలిన ఏకైక వ్యక్తి వెంకటేశ్వరరావు భార్య శెట్టిపల్లి దేవి (38) అప్పటి నుంచి తీవ్ర మనస్తాపంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఇంటి వద్ద మరుగుదొడ్డిలో ఇనుప రాడ్డుకు చీరతో ఉరేసుకున్నారు. మరుగుదొడ్డి లోపలికి వెళ్లిన దేవి ఎంతసేపటికీ తిరిగి రాకపోయేసరికి బంధువులు వెళ్లి చూశారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. పెదవేగి ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబంలోని నలుగురూ మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఇవిఎంలపై ఎన్ని యూ టర్న్‌లు?

- చంద్రబాబుకు మాజీ మంత్రి నాగార్జున ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఎన్నికల్లో ఇవిఎంల వినియోగంపై లెక్కలేనన్ని సార్లు యూటర్న్ తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్యం కోసం మాట్లాడుతుండటం సిగ్గుచేటని మాజీ మంత్రి మేరుగ నాగార్జున విమర్శించారు. బిజెపితో కలిసి ఉంటే ఓ మాట, లేకుంటే మరో మాట మాట్లాడుతున్నారన్నారు. వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014 ఎన్నికల తర్వాత చాలా పార్టీలు, మేధావులతో పాటు ప్రజల్లో కూడా ఇవిఎంలపై అనేక సందేహాలు వచ్చాయన్నారు. వాటికి హేతుబద్ధతతో సమాధానం చెప్పాల్సిన వ్యవస్థలు మౌనంగా ఉండటం బాధాకరమన్నారు. ఇటీవల 543 ఎంపి స్థానాలకు ఎన్నికలు జరిగితే, 530 చోట్ల వివి ప్యాట్‌లకు, పోలైన ఓట్లకు మధ్య వ్యత్యాసం ఉందని ఎన్‌డిఆర్ అనే సంస్థ అధ్యయనం చేసి తేల్చి చెప్పిందన్నారు. రాష్ట్రంలో పోలైన ఓట్ల ప్రకారం చూస్తే లోక్‌సభ స్థానాలు 14 కూటమికి, 11 వైసిపికి రావాలని ఎన్‌డిఆర్ సంస్థ నివేదికను ఎన్నికల సంఘానికి పంపిందని తెలిపారు. అయినా ఇసి నోరు మెదపకపోవడం అనుమానాలను కలిగిస్తోందన్నారు. తాజాగా హర్యానా ఎన్నికల ఫలితాలు కూడా దేశాన్ని ఆశ్చర్యకితులను చేశాయని చెప్పారు. అందుకే అక్కడ ఎన్నికల ఫలితాలకు, రాష్ట్రంలో ఫలితాలకు తేడా లేదన్నారు.

ఎస్‌సి వర్గీకరణపై అధ్యయనానికి ఏకసభ్య విచారణ కమిషన్ ఏర్పాటు

- చైర్మన్‌గా టి.హైకోర్టు రిటైర్డ్ జడ్జి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌సి వర్గీకరణకు తెలంగాణ ప్రభుత్వం ఏకసభ్య విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. ఈ కమిషన్‌కు చైర్మన్‌గా 2023 వరకు తెలంగాణ హైకోర్టు జడ్జిగా పనిచేసి రిటైర్డ్ అయిన జస్టిస్ షమీమ్ అక్తర్‌ను నియమించింది. ఈ మేరకు శుక్రవారం జిఒ నెంబరు 8ని విడుదల చేసింది. షెడ్యూల్ కులాలకు సంబంధించి వర్గీకరణపై సమగ్ర అధ్యయనం చేయాలని కమిషన్‌కు సర్కారు సూచించింది. అనంతరం సిఫారసులు చేయాలని కమిషన్‌ను కోరింది. ఈ మేరకు ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్ శ్రీధర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కమిషన్‌కు అవసరమైన ఏర్పాట్లు సమకూర్చేందుకు షెడ్యూల్ కులాల శాఖ కమిషనర్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదిలావుండగా ఎస్‌సి వర్గీకరణ విషయమై సుప్రీంకోర్టు తీర్పు అధ్యయనం, అమలు కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ సంఘానికి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో రిటైర్డ్ జడ్జి షమీమ్ అక్తర్ చైర్మన్‌గా సర్కారు ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. ప్రభుత్వం నియమించిన కమిషన్ శాస్త్రీయ పద్ధతుల్లో విచారణ జరపాలని, విస్తృత సంప్రదింపులు చేయాలని సూచించింది. ఎస్సీ ఉపకులాలకు రిజర్వేషన్ల విధానాల ద్వారా ప్రయోజనాలు ఎలా అందించాలో కమిషన్ నివేదికలో తెలియజేయాలని కోరింది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఏకసభ్య కమిషన్, రెండు నెలల్లో విచారణ పూర్తిచేసి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.


జస్టిస్ షమీమ్ అక్తర్

యూనియన్‌ను గుర్తించాల్సిందే


- నెల రోజులుగా శాంసంగ్ కార్మికుల సమ్మె
- ప్రధాన డిమాండ్‌కు అంగీకరించని మేనేజ్‌మెంట్, ప్రభుత్వం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

శాంసంగ్ ఇండియా వర్కర్స్ యూనియన్‌ను గుర్తించాలన్న కార్మికుల ప్రధాన డిమాండ్‌కు శాంసంగ్ మేనేజ్‌మెంట్, ప్రభుత్వం నిరాకరించాయి. ప్రభుత్వం అణచివేత చర్యలు చేపడుతున్నా, అరెస్టు చేస్తున్నా... కార్మికులు కార్మికులు వెనక్కి తగ్గలేదు. మొక్కవోని దీక్షతో కార్మికులు చేస్తున్న సమ్మె నెల రోజులు దాటింది. శాంసంగ్ ఇండియాకు చెందిన చెన్నై ప్లాంట్‌లో సమ్మె చేస్తున్న వందలాది మంది కార్మికులను, వారి కార్మిక సంఘ నేతలను బుధవారం రాష్ట్రప్రభుత్వం అరెస్టు చేసింది. తమిళనాడు పోలీసులు సమ్మె వేదికను కూల్చివేశారు. అరెస్టయిన నాయకులలో సిఐటియు తమిళనాడు రాష్ట్ర అధ్యక్షులు ఎ సౌందరరాజన్, శాంసంగ్ ఇండియా వర్కర్స్ యూనియన్ (ఎస్ఐడబ్ల్యుయు) అధ్యక్షులు ఇ ముత్తు కుమార్ ఉన్నారు. సమ్మె చట్టవిరుద్ధమైనదని ప్రభుత్వం పేర్కొంటూ... కొన్ని గంటల నిర్బంధం తరువాత కార్మిక నాయకులను బెయిల్‌పై విడుదల చేశారు.

ఎస్ఐడబ్ల్యుయు గుర్తింపు, మెరుగైన వేతనాలు, పని పరిస్థితులను డిమాండ్ చేస్తూ చెన్నై సమీపంలోని శ్రీపెరంబుదూర్ ప్లాంట్‌లో 1,300 మందికి పైగా శాంసంగ్ కార్మికులు సెప్టెంబరు 9 నుంచి సమ్మెలో ఉన్నారు. కార్మికుల డిమాండ్లపై యాజమాన్యం నేరుగా మాట్లాడేందుకు నిరాకరించడంతో సమ్మె మంగళవారంతో నెల రోజులు పూర్తి చేసుకుంది. చట్టం ప్రకారం సమ్మె ప్రారంభానికి 14 రోజుల ముందు యాజమాన్యానికి నోటీసు అందించినందున, సమ్మె చట్టబద్ధమైనదని కార్మికులు పేర్కొన్నారు.

తమిళనాడు రాష్ట్ర పరిశ్రమలు, పెట్టుబడుల ప్రోత్సాహకాలు, వాణిజ్యశాఖ మంత్రి టిఆర్‌బి రాజాతో సహా ముగ్గురు మంత్రులు శాంసంగ్ యాజమాన్యం, కార్మికులు ఒక తీర్మానాన్ని చేసుకున్నారని ప్రకటించారు. కంపెనీ వేతనాలను పెంచడానికి, మెరుగైన పని పరిస్థితులను అందించడానికి అంగీకరించిందని రిపోర్టులు వచ్చాయి. మంత్రుల ప్రకటనను కార్మికులు వ్యతిరేకించారు. కార్మికులను విభజించే ప్రయత్నమని పేర్కొంటూ సమ్మె చేస్తున్న కార్మికులు ఒప్పందాన్ని తిరస్కరించారు. యాజమాన్యం కొంతమంది కార్మికులను 'వర్కర్స్ కమిటీ' అని పిలుస్తున్నారని, వారితో ఒప్పందంపై సంతకం చేసినట్లు నటించిందని, సమ్మె చేస్తున్న కార్మికులతో ఎటువంటి చర్చలు చేయలేదని విమర్శించారు.


సమ్మె చేస్తున్న శాంసంగ్ కార్మికులు

యాజమాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు

సిఐటియు తమిళనాడు రాష్ట్ర అధ్యక్షులు ఎ సౌందరరాజన్ మాట్లాడుతూ.. 'మా ప్రధాన డిమాండ్ యూనియన్ గుర్తింపు. దానికి అంగీకరిస్తే వెంటనే సమ్మె విరమిస్తాం. ఇతర విషయాలు తరువాత చర్చించుకోవచ్చు' అని అన్నారు. కంపెనీకి ప్రతినిధిగా రాష్ట్రప్రభుత్వం వ్యవహరిస్తోందని, కంపెనీకి మద్దతు ఇస్తోందని విమర్శించారు. శాంసంగ్ చెన్నై సమ్మె కేవలం వేతనాల గురించి మాత్రమే కాదని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) ప్రకారం సంఘం ఏర్పాటు చేసుకునే రాజ్యాంగ హక్కు కోసమని స్పష్టం చేశారు. 'ముగ్గురు మంత్రులు శాంసంగ్ ప్రతినిధుల్లా ప్రవర్తించారు' అని సౌందరరాజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

దేశంలో శాంసంగ్ ప్లాంట్లు చెన్నై, ఢిల్లీలో రెండు ఉన్నాయి. చెన్నై ప్లాంట్ టివిలు, ఫ్రిజ్‌లు వంటి గృహోపకరణాలను ఉత్పత్తి చేస్తోంది. ఢిల్లీ (నోయిడా)లో ఉన్న ప్లాంట్ ఎక్కువగా మొబైల్ ఫోన్‌లను ఉత్పత్తి చేస్తోంది. చెన్నై ప్లాంట్‌లో 1,700 మంది కార్మికులు ఉన్నారు. అందులో 1,550 మంది ఎస్ఐడబ్ల్యుయు (సిఐటియు అనుబంధం)లో ఉన్నారు. సమ్మె చేస్తోన్న కార్మికులకు వద్దకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు జి రామకృష్ణన్ సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సిఐటియు ఇచ్చిన ఆందోళన పిలుపుల్లో వామపక్షాలు పాల్గొన్నాయి. సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతుగా, యూనియన్‌ను గుర్తించడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి వ్యతిరేకంగా ఈనెల 5న సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) సంయుక్తంగా రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మందితో ఆందోళన చేపట్టాయి.

జపాన్ సంస్థకు నోబెల్ శాంతి బహుమతి



స్టాక్‌హోం : నోబెల్ శాంతి బహుమతి జపనీస్ సంస్థ 'నిహాన్ హిడాంకియో'కు లభించింది. ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధాలను నివారించడంలో ఆ సంస్థ చేస్తున్న కృషికి గాను ఈ బహుమతిని ప్రకటించినట్లు స్వీడిష్ నోబెల్ కమిటీ శుక్రవారం తెలియజేసింది.

హిరోషిమా, నాగసాకిల్లో అణుబాంబు దాడి నుండి ప్రాణాలతో బయటపడిన బాధితుల ఉద్యమం నుంచి ఈ సంస్థ రూపుదిద్దుకుంది. ఈ సంస్థను హిబాకుషా అని కూడా పిలుస్తారు. అణ్వాయుధాలు లేదని ప్రపంచాన్ని సాధించడానికి, అణ్వాయుధాలను మళ్లీ ప్రయోగించకుండా ఉండేలా దేశాలను అప్రమత్తం చేసేందుకు ఈ సంస్థ తీవ్రంగా కృషి చేస్తోంది. వెలకట్టలేని తమ అనుభవాల ద్వారా శాంతి కోసం యత్నిస్తున్న బాధితులను ఈ శాంతి బహుమతితో సత్కరిస్తున్నట్లు నోబెల్ కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది.

వర్ణించలేని బాధను వివరించేందుకు, అనూహ్యమైన ఘటనల గురించి ఆలోచించడానికి, అణ్వాయుధాల వలన కలిగే అపారమైన నష్టాన్ని, బాధను గ్రహించడానికి వారి అనుభవాలు సహాయపడతాయని తెలిపింది. సుమారు 80 ఏళ్లుగా యుద్ధంలో ఎలాంటి అణ్వాయుధాలను వినియోగించలేదని కమిటీ ఉద్ఘాటించింది. అణ్వాయుధాల ప్రయోగం నిషిద్ధం కోసం నిహాన్ హిడాంకియో చేసిన కృషిని గుర్తిస్తూ.. నోబెల్ కమిటీ కూడా అణ్వాయుధాలను ప్రయోగించకూడదన్న అంశాన్ని పునరుద్ఘాటించింది. రెండో ప్రపంచ యుద్ధం ముగుస్తున్న సమయంలో హిరోషిమా, నాగసాకిలపై అమెరికా అణుబాంబును ప్రయోగించిన సంగతి తెలిసిందే.

అధికారంలోకి వస్తే ఏడాదిలోగా విద్యుత్ ధరలు సగానికి : ట్రంప్ హామీ

వాషింగ్టన్ : తాను గనక అధికారంలోకి తిరిగి వస్తే మొదటి ఏడాదిలోనే ఇంధన, విద్యుత్ ధరలు సగానికి సగం తగ్గిస్తానని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ప్రజలకు హామీ ఇచ్చారు. మిచిగాన్‌లో ఒక సభలో ప్రసంగిస్తూ ఆయన, తమ ప్రభుత్వం పర్యావరణ అనుమతులను వేగిరపరుస్తుందని, విద్యుత్ సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తుందని, ఇంధన వ్యయాలు తగ్గేలా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. దీనివల్ల ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతుందన్నారు. అమెరికాను తయారీ రంగానికి ప్రధాన కేంద్రంగా తయారుచేస్తామన్నారు. ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్యాక్టరీల పెట్టడానికి అత్యంత ఉత్తమమైన ప్రదేశంగా అమెరికాను తయారుచేస్తామన్నారు.

ట్రంప్ పోస్ట్ రీట్వీట్ చేసిన కేజ్రీవాల్

ఎక్స్‌ల ట్రంప్ పోస్ట్‌ను ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ రీట్వీట్ చేశారు. దీనిపై స్పందిస్తూ 'విద్యుత్ బిల్లులు సగానికి తగ్గిస్తానని ట్రంప్ ప్రకటించారు. ఉచిత తాయిలాలు అమెరికా దాకా వెళ్లాయి' అని పేర్కొన్నారు.


ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం

- గవర్నర్‌ను కలిసి సంసిద్ధత తెలిపిన ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్ : నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా శుక్రవారం లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ శశాంక్‌ను కలిసి, తమను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. తనకు 54మంది సభ్యుల మద్దతు వుందని చెప్పారు. కాంగ్రెస్, సిపిఎం, ఆప్, ఇండిపెండెంట్లు తనకు మద్దతు తెలియజేస్తూ ఇచ్చిన లేఖలను కూడా గవర్నర్‌కు అందజేశారు. 2019లో జమ్ముకాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని కేంద్రం రద్దు చేసిన తర్వాత మొదటగా జరిగిన ఈ ఎన్నికల్లో గెలుపొందిన నేషనల్ కాన్ఫరెన్స్,. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి తమ మద్దతు వుంటుందని కాంగ్రెస్ అంతకుముందు ప్రకటించింది. శుక్రవారం ఉదయం జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశానికి ఆరుగురు ఎంఎల్ఎలూ హాజరయ్యారు. ఎన్‌సికి మద్దతు తెలుపుతూ సమావేశం ఏకగ్రీవంగా ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అనంతరం మద్దతు లేఖలపై సంతకాలు కూడా చేశారు. శాఖలపై ఎలాంటి అభిప్రాయ భేదాలు లేవని, భాగస్వామ్య పక్షాలన్నీ కలిసి కూర్చుని చర్చించి, నిర్ణయం తీసుకుంటాయని పిసిపి అధ్యక్షుడు తారిఖ్ హమీద్ కర్రా చెప్పారు. ఇండియా బ్లాక్ స్ఫూర్తితో జమ్ము కాశ్మీర్ ప్రజల కోసం ఎన్‌సికి మద్దతిస్తున్నామన్నారు. గవర్నర్ వద్దకు వెళ్లడానికి ముందుగానే ఆప్ కూడా మద్దతు లేఖను అందజేసింది.

రాజ్యసభకు ఫరూక్ అబ్దుల్లా

జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) అధ్యక్షులు ఫరూక్ అబ్దుల్లా రాజ్యసభలో పార్టీకి ప్రాతినిధ్యం వహించనున్నారు. కాశ్మీర్ సిఎంగా త్వరలో బాధ్యతలు చేపట్టనున్న ఒమర్ అబ్దుల్లా ది వీక్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని ధ్రువీకరించారు.


ఎల్‌జి మనోజ్ శశాంక్‌ను కలిసి మద్దతుదార్ల లేఖలను అందజేస్తున్న ఒమర్ అబ్దుల్లా

రాజ్యసభకు ఎన్నికలు నిర్వహిస్తే ఫరూక్‌ను ఎన్నుకుంటామని, ఆయన జమ్ము కాశ్మీర్ ప్రయోజనాల కోసం పోరాడతారని చెప్పారు. జమ్ముకాశ్మీర్‌లో రాజ్యసభ ఎన్నికలు 2015లో జరిగాయి. అప్పట్లో బిజెపి-పిడిపి కూటమి మూడు స్థానాలను, ఎన్‌సి - కాంగ్రెస్ కూటమి ఒక స్థానాన్ని గెలుచుకున్నాయి. వారి పదవీ కాలం 2021లో ముగిసింది. ఆ తరువాత ఎన్నికలు జరగకపోవడంతో ఇక్కడి నుంచి కొత్తగా రాజ్యసభకు ఎవరూ ఎంపిక కాలేదు.

ఇద్దరు అగ్నివీర్‌లు మృతి

- ఫైరింగ్ సాధన చేస్తుండగా పేలుడు

నాసిక్ : మహారాష్ట్రలోని నాసిక్‌లోని ఆర్టిలరీ కేంద్రంలో ఫైరింగ్ సాధన చేస్తుండగా ఇండియన్ ఫీల్డ్ గన్‌లోని షెల్ పేలడంతో ఇద్దరు అగ్నివీర్‌లు ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం మధ్యాహ్నం ఫైరింగ్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. షెల్ పేలడంతో గాయపడిన అగ్నివీర్‌లు గోహిల్ విశ్వరాజ్ సింగ్ (20), సైఫత్ షిత్ (21)లను దేవ్‌లాలీలోని ఎంహెచ్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు. హవాల్దార్ అజిత్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. 2022లో మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్‌లో భాగంగా వీరు చేరారు.

లావోస్ పర్యటన ఫలప్రదం !

- కెనడా ప్రధానితో భేటీ • స్వదేశానికి మోడీ

వియాంటియానె, ఒట్టావా : ఆసియాన్ సదస్సు కోసం లావోస్‌లో రెండు రోజుల పర్యటనకు వచ్చిన భారత ప్రధాని మోడీ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడేతో భేటీ అయ్యారు. సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు కాసేపు సమావేశమయ్యారని కెనడా బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (సిబిసి) తెలిపింది. కెనడియన్ ఖలిస్తానీ వేర్పాటువాది హర్‌దీప్ సింగ్ నిజ్జార్ హత్య విషయంలో భారత్ పాత్ర వుందని ట్రూడే ఆరోపిస్తున్నారు. ఆ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. 2020లోనే నిజ్జార్‌ను తీవ్రవాదిగా భారత్ ప్రకటించింది. ట్రూడే ఆరోపణలు అసంబద్ధమైనవని వ్యాఖ్యానించింది. ఆ సంఘటన జరిగిన దాదాపు ఏడాది తర్వాత వీరి భేటీ చోటు చేసుకుంది. 'మనం చేయాల్సిన పని ఇంకా చాలా వుంది.' అని ట్రూడేను ఉటంకిస్తూ సిబిసి న్యూస్ పేర్కొంది. "మేం ఏం మాట్లాడుకున్నామనే వివరాల్లోకి వెళ్ళాలనుకోవడం లేదు. అయితే కెనడా ప్రజల భద్రత, చట్టబద్ధ పాలనను పరిరక్షించడమనేది కెనడా ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతల్లో ఒకటిగా వుంది. ఆ అంశాలపైనే మేం కూడా దృష్టి కేంద్రీకరించనున్నాం." అని ట్రూడే ఇక్కడ ఒక పత్రికా సమావేశంలో పేర్కొన్నారు.


లావో పిడిఆర్ అధ్యక్షుడు తంగ్లాన్ సిసౌలిత్‌తో ప్రధాని నరేంద్రమోడీ

పలువురు నేతలతో కీలక భేటీలు

లావోస్‌లో రెండు రోజుల పర్యటన విజయవంతంగా ముగించుకుని ప్రధాని మోడీ స్వదేశానికి బయలుదేరారు. లావోస్‌లో పర్యటన ఫలప్రదమైందని మోడీ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఆసియాన్‌తో సంబంధాలు బలోపేతం చేసుకోవడానికి భారత్ కట్టుబడి వుందన్నారు. ఈ ప్రాంతంలో శాంతి, సంక్షేమం, సుస్థిర అభివృద్ధి దిశగా మనందరం కలిసి కృషి చేయాల్సిన అవసరం వుందని ఆయన ఆ పోస్టులో పేర్కొన్నారు.

భారత్, ఆసియాన్ దేశాల మధ్య సమగ్ర భాగస్వామ్యాన్ని మరింత పటిష్టపరిచేందుకు 10పాయింట్ల ప్రణాళికను మోడీ ప్రకటించారు. ఆసియా భవితవ్యానికి మార్గనిర్దేశనం చేయడానికి ప్రాంతీయ గ్రూపుతో సంబంధాలు చాలా కీలకమని వ్యాఖ్యానించారు.

ఈ పర్యటనలో జపాన్, న్యూజీలాండ్, ఆస్ట్రేలియా, మలేసియా ప్రధానులతో కూడా మోడీ భేటీ అయ్యారు. యురోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు చార్లెస్ మైఖేల్, ప్రపంచ ఆర్థిక వేదిక ఎగ్జిక్యూటివ్ చైర్మన్ క్లాస్ షావబ్‌లతో కూడా మోడీ చర్చలు జరిపారు.

5,600 కోట్ల డ్రగ్స్ స్వాధీనం కేసులో ఇడి సోదాలు

న్యూఢిల్లీ : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఢిల్లీ, ముంబై పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సోదాలు నిర్వహించింది. ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ దాదాపు రూ.5,600 కోట్ల విలువైన 560 కిలోల కొకైన్‌తో సహా మాదకద్రవ్యాలను ఇటీవల స్వాధీనం చేసుకుంది. ప్రధాన నిందితుడు తుషార్ గోయెల్‌తో పాటు హిమాన్షు కుమార్, ఔరంగజేబ్ సిద్ధిఖీ, భరత్ కుమార్‌లను అరెస్టు చేసి, మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఇడి విచారణ జరుపుతోంది. ఇడి తెలిపిన వివరాల ప్రకారం, తుషార్ గోయెల్ అలియాస్ డిక్కీ ఢిల్లీలోని మహిపాల్‌పూర్‌లోని తన కుటుంబానికి చెందిన గోడౌన్‌లో సరుకును నిల్వ చేశాడు. వసంత్ ఎన్‌క్లేవ్, రాజౌరీ గార్డెన్‌లోని తుషార్ గోయెల్ నివాస ప్రాంగణంలో, అతని సహచరులు హిమాన్షు కుమార్, భరత్ కుమార్ ప్రేమ్ నగర్, ముంబైలోని నలసోప్పరాలో ఇడి సోదాలు చేసింది. ఢిల్లీలోని ఝండేవాలన్ ప్రాంతంలోని తుషార్ బుక్స్ పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్, తులిప్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, బిల్డ్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్, గురుగ్రామ్‌లోని వ్యాపార ప్రాంగణాల్లో కూడా సోదాలు నిర్వహించింది. ఈ కంపెనీలు తుషార్, అతని కుటుంబ సభ్యుల నియంత్రణలో ఉన్నాయని, వాటిలో సోదాలు చేసి, కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నామని ఇడి పేర్కొంది.



ఆరవ రోజుకు చేరిన వాంగ్‌చుక్ ఆమరణ నిరశన

న్యూఢిల్లీ : లడఖ్‌ను రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష శుక్రవారం ఆరవ రోజుకు చేరింది. లడఖ్ నుండి 150మందితో కలిసి శాంతియుతంగా పాదయాత్ర చేపట్టి ఢిల్లీకి వచ్చిన వాంగ్‌చుక్ ఇక్కడ లడఖ్ భవనలో దీక్ష చేపట్టారు. జమ్మూ కాశ్మీర్ ప్రాంత సంస్కృతీ సాంప్రదాయాలను, పర్యావరణ వారసత్వాన్ని పరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సెప్టెంబరు 1న మొదలుపెట్టిన పాదయాత్ర ఈ నెల 1న ఢిల్లీ చేరుకుంది. ఆ వెంటనే శాంతియుతంగా నిరసన తెలియచేయాలన్న ఆయన ప్రయత్నాలకు అనుమతినివ్వకుండా పోలీసులు కస్టడీలోకి తీసుకుని లడఖ్ భవన్‌కే పరిమితం చేశారు. దాంతో వారు అక్కడే నిరశన చేపట్టారు.

వరుస దాడులతో విరుచుకుపడిన ఇజ్రాయిల్

- లెబనాన్‌పై దాడుల్లో హిజ్బుల్లా నేత హత్య
- వెస్ట్ బ్యాంక్ దాడుల్లో ఇస్లామిక్ జిహాద్ కమాండర్ మృతి
- గాజా దాడుల్లో 61మంది, బీరుట్ దాడుల్లో 22మంది మృతి, 117మందికి గాయాలు

గాజా/ బీరుట్ : గాజా, వెస్ట్ బ్యాంక్‌లతో పాటు లెబనాన్‌పై ఇజ్రాయిల్ ఆర్మీ విరుచుకుపడుతోంది. అది సాగిస్తున్న వరుస బాంబు దాడుల్లో గత 24గంటల్లో 61మంది మరణించారు.మరో 231మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. జాబాలియా, డేర్ అల్ బాలాహ్, నుస్రత్, మఘాజి, శిబిరాల్లో దాడులు కొనసాగుతూనే వున్నాయి. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో నబ్లస్‌కు దక్షిణంగా బీటా ప్రాంతంపై దాడి జరిగింది. పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ బలగాలు బాష్ప వాయు గోళాలను ప్రయోగించాయి. దీంతో అనేకమంది ఆ గాలిని పీల్చలేక చాలా ఇబ్బందులు పడ్డారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పాలస్తీనా మెడికల్ రిలీఫ్ సొసైటీకి చెందిన అంబులెన్స్‌ను లక్ష్యంగా చేసుకుని బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. ఈ దాడుల్లో ఇస్లామిక్ జిహాద్ కమాండర్‌ను హతమార్చినట్లు ఇజ్రాయిల్ ఆర్మీ తెలిపింది. తుల్కరెమ్‌లో శిబిరంపై గురువారం జరిగిన వైమానిక దాడుల్లో మహ్మద్ అబ్దుల్లా హతుడయ్యాడని మిలటరీ తెలిపింది. అయితే ఆ భవనాల్లో హిజ్బుల్లా నేత వఫీక్ సఫా మృతదేహం జాడ ఎక్కడా కనిపించలేదని మీడియా పేర్కొంది.

మరోవైపు సెంట్రల్ బీరుట్‌లోని సిటీ సెంటర్‌పై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో రెండు నివాస భవంతులు పూర్తిగా ధ్వంసమయ్యాయి.


రక్తమోడుతున్న చిన్నారి

శాంతి పరిరక్షకులపై కాల్పులను ఖండించిన ఐరాస

ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షకులు ఉపయోగించే వాట్ టవర్‌పై ఇజ్రాయిల్ బలగాలు కాల్పులు జరపడంతో ఇద్దరు గాయపడ్డారు. ఐరాస శాంతి పరిరక్షక బలగాల చీఫ్ గురువారం భద్రతా మండలి సమావేశంలో మాట్లాడుతూ, లెబనాన్‌లో శాంతి పరిరక్షకుల భద్రత, రక్షణ అనేది రాన్రాను ప్రమాదకరంగా తయారైందన్నారు. ఇరాన్ ప్రతినిధి మాట్లాడుతూ తమ దేశంపై ఇజ్రాయిల్ దాడి చేసిన పక్షంలో దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి తాము సిద్ధంగా వున్నామని చెప్పారు. లెబనాన్‌పై తక్షణమే కాల్పుల విరమణ చేపట్టాలని యుఎన్ రాయబారి పిలుపునిచ్చారు. అయితే హిజ్బుల్లా కార్యకలాపాలను పూర్తిగా అరికట్టే వరకు ఈ దాడులు కొనసాగుతాయని ఇజ్రాయిల్ రాయబారి హూంకరించారు.

దక్షిణ లెబనాన్‌లోని యుఎన్ఐఎఫ్ఐఎల్ స్థావరాలను నేరుగా లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ మళ్ళీ కాల్పులు జరిపింది. శాంతి పరిరక్షకులపై జరిగిన దాడులు అంతర్జాతీయ చట్టాలను తీవ్రంగా ఉల్లంఘిస్తున్నాయని, తక్షణమే వాటిని ఆపాలని ఫ్రాన్స్ కోరింది. ఇజ్రాయిల్ రాయబారిని పిలిపించి మరీ ఈ విషయం తెలియచేసింది. ఇజ్రాయిల్ దాడులకు యుఎన్ఆర్‌డబ్ల్యుఎ ప్రధాన లక్ష్యంగా మారిందని ఆ సంస్థ చీఫ్ ఫిలిప్ లాజారిని వ్యాఖ్యానించారు. పాలస్తీనియన్లకు సహాయ సహకారాలు అందించే ఈ ప్రధాన సంస్థను ఎలాగైనా పూర్తిగా నిర్వీర్యం చేయాలని ఇజ్రాయిల్ భావిస్తోందన్నారు.

వరుస తుపానులతో ఉక్కిరిబిక్కిరి

- ప్రభుత్వ తీరుపై అమెరికన్ల అసంతృప్తి
- క్యూబా ఆదర్శం



తల్హసీ : కేవలం వారం రోజుల వ్యవధిలో రెండు భీకర తుపానులను అమెరికా ఎదుర్కోనాల్సి వచ్చింది. హెలెన్ తుపాను కలిగించిన విధ్వంసాన్ని, నష్టాన్ని పూర్తిగా సమీక్షించి, తగు చర్యలు తీసుకునేలోపునే మిల్టన్ హరికేన్ ఫ్లోరిడాను కకావికలం చేసింది. జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు తమకు మరిన్ని నిధులు కావాలని ఫెడరల్ ఎమర్జన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఫెమా) కాంగ్రెస్‌కు విజ్ఞప్తి చేసింది. గురువారం ఉదయానికి 30లక్షల మందికి పైగా ఫ్లోరిడా వాసులు అంధకారంలో వున్నారు. కొన్ని కౌంటీల్లో అయితే ఏకంగా 80శాతం మంది జనాభా చీకట్లోనే మగ్గుతున్నారు. తుపాను ధాటికి 9మంది మరణించారు. తుపాను తీరం దాటే ప్రాంతాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేసినా చాలామంది వాటిని లెక్కచేయలేదు. ఫ్లోరిడా గవర్నర్ రాన్ డి శాంటిస్ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. వైకల్యంతో వున్నవారిని, వృద్ధులను విడిచి వెళ్లలేక చాలామంది ఇళ్ళకే పరిమితమయ్యారు. సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లడమనేది నిముషాల వ్యవధిలో జరిగేది కాదని, పలు గంటల పాటు కొనసాగే ప్రక్రియ అని అటువంటపుడు ప్రభుత్వం చాలా ముందుగానే అప్రమత్తం చేయాలని ప్రజలు అభిప్రాయపడ్డారు. ప్రజల ప్రాణాలకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రభుత్వం వ్యవహరించలేదని విమర్శిస్తున్నారు.

క్యూబా ఆదర్శం

ప్రతి ఒక్కరూ తనకు తానుగా తరలివెళ్లే వ్యవస్థను కలిగి వుండాలనేది అమెరికా సిద్ధాంతం. అంటే, దీనర్థం ప్రభుత్వ పాత్ర పరిమితంగా ఉంటుందని చెప్పడమే. దీనికి పూర్తి భిన్నంగా విపత్తులు వచ్చినప్పుడు ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయడం, వారిని సహాయక శిబిరాలకు తరలించడంలో క్యూబా చిన్న దేశమే అయినా పెద్ద ఆదర్శంగా ఉంది. జన సాంద్రత అధికంగా వుండే ఈ దేశంలో మరణాల సంఖ్య తక్కువగా వుంటుంది. 2004లో హైతి తుపాను భీకర నష్టం కలిగించినా క్యూబాలో ప్రాణ నష్టం ఏమీ లేకుండా జాగ్రత్త పడ్డారు. తుపాను హెచ్చరికలు వెలువడిన వెంటనే క్యూబా ప్రభుత్వం తీసుకునే అప్రమత్తత, సంసిద్ధత చర్యలు ఇందుకు ప్రధాన కారణం. ముందుగానే ఏర్పాటు చేసిన శిబిరాలకు బస్సులను ఏర్పాటు చేయడం, ఆహారం, నీరు, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయడం వంటివి తీసుకుంటుంది. అంతేకానీ రవాణా, వసతి తదితర ఏర్పాట్లు ఎవరికి వారే చేసుకోవాలని వదిలేయదు.

మిలే సంస్కరణలపై అర్జెంటీనా కార్మికవర్గం కన్నెర్ర

బ్యూనస్ ఎయిర్స్ : అర్జెంటీనాలో జేవియర్ మిలే నేతృత్వంలోని మితవాద ప్రభుత్వం చేపట్టిన కార్మిక సంస్కరణలపై కార్మిక వర్గం కన్నెర్ర చేసింది. ఆటోమోటివ్, ఏరోస్పేస్, ఇంధన, జౌళి వంటి పలు పారిశ్రామిక రంగాలకు ప్రాతినిధ్యం వహించే అంతర్జాతీయ ఇండస్ట్రియల్ యూనియన్ ఈ సంస్కరణలు యాజమాన్యాలకు అనుకూలంగా వున్నాయని విమర్శించింది. కార్మికులు ఎంతగానో కష్టపడి సాధించిన హక్కులను కాలరాస్తున్నాయని పేర్కొంది. సమాజంలోని అన్ని తరగతులు, రంగాలకు చెందిన కార్మికులపైన ఇవి తీవ్ర ప్రభావం చూపిస్తాయని విమర్శించాయి. చర్చలు , సమిష్టి బేరసారాల ద్వారా కుదుర్చుకున్న ఒప్పందాలతో కూడిన వ్యవస్థను నీరుగార్చేలా ప్రభుత్వం కొత్త నిబంధనలు ప్రవేశపెట్టింది. వీటివల్ల అనిశ్చితిని పరిష్కరించగలుగుతామని, కార్మికులను తొలగించిన సమయంలో తలెత్తే సమస్యలు పరిష్కరించుకోవడానికి ఈ సంస్కరణలు అనువుగా ఉంటాయని ప్రభుత్వం చెబుతోంది. నష్టపరిహారానికి సంబంధించిన నిబంధనల స్థానే కొత్త వ్యవస్థను అమలు చేయడం వల్ల కార్మికవర్గ ప్రయోజనాలు దెబ్బతింటాయని అర్జెంటీనా కార్మిక సంఘం సిటిఎ పేర్కొంది.

ఎయిర్ ఇండియా విమానం సేఫ్ ల్యాండింగ్

తిరుచ్చి : ఎయిర్ ఇండియా విమానం గాలిలో ఉండగా పైలట్లు ఎమర్జెన్సీ ప్రకటించి, సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. ఎయిరిండియా విమానం ఎఎక్స్‌బి 613 తిరుచ్చి నుంచి షార్జాకు శుక్రవారం సాయంత్రం 144 మంది ప్రయాణికులతో బయల్దేరింది. టేకాఫ్ అయిన కొద్ది సేపటికే హైడ్రాలిక్ వ్యవస్థ విఫలమైనట్లు గుర్తించిన పైలటర్లు ఎటిసికి తెలియజేశారు. దీంతో అధికారులు అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతించారు. అత్యవసర పరిస్థితుల్లో విమానం సురక్షితంగా ల్యాండింగ్ అవ్వాలంటే అందులో ఉన్న ఇంధనం నిర్దేశిత స్థాయి వరకూ తగ్గాల్సి ఉంటుంది. అందుకోసం దాదాపు రెండు గంటలపాటు విమానాన్ని గాల్లో చక్కర్లు కొట్టించి, సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. ఈ సమాచారం తెలియడంతో 20 అంబులెన్స్‌లు, 20 అగ్నిమాపక యంత్రాలతోపాటు పారా మెడికల్ సిబ్బందిని సిద్ధంగా ఉంచి, అత్యవసర ఏర్పాట్లు సైతం చేశారు. విమానం సేఫ్‌గా లాండ్ అవడం పట్ల తమిళనాడు సిఎం స్టాలిన్ హర్షం వ్యక్తం చేశారు. పైలటర్లు ఎమర్జెన్సీ ప్రకటించినట్లు వార్తలు విన్న వెంటనే ఫోన్ ద్వారా అధికారులతో మాట్లాడి సమన్వయపరిచినట్లు ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేసిన పైలట్‌లకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

మహిళా హక్కులపై చైనా తీర్మానానికి మానవ హక్కుల మండలిలో ఆమోద ముద్ర

జెనీవా : మహిళా హక్కులపై చైనా మరికొన్ని దేశాలు కలిసి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి (యుఎన్‌హెచ్‌ఆర్‌సి) సమావేశం ఏకాభిప్రాయంతో ఆమోదించింది. బీజింగ్ డిక్లరేషన్ అండ్ ప్లాట్‌ఫారమ్ ఫర్ యాక్షన్ 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చైనా, స్విట్జర్లాండ్‌లోని ఇతర అంతర్జాతీయ సంస్థలు కలిసి ఈ తీర్మానాన్ని రూపొందించాయి. ఐరాసలో చైనా శాశ్వత ప్రతినిధి చెన్ జూ ఈ ముసాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. చైనాతో పాటు డెన్మార్క్, ఫ్రాన్స్, కెన్యా, మెక్సికోలు కలిసి ఈ తీర్మానాన్ని మండలి సమావేశాల్లో ప్రవేశపెట్టాయి. ఈ చొరవకు 112 దేశాలు మద్దతిచ్చాయి. అంతర్జాతీయంగా మహిళా హక్కుల అభివృద్ధిలో చారిత్రిక మైలురాయిగా నిలిచిపోయిన బీజింగ్ డిక్లరేషన్, ప్లాట్‌ఫారమ్ ఫర్ యాక్షన్‌ను 1990వ దశకంలో జరిగిన నాల్గవ ప్రపంచ మహిళా సదస్సు ఆమోదించింది. గత మూడు దశాబ్దాల్లో మహిళల సామాజిక స్థితిగతులు గణనీయంగా మెరుగుపడ్డాయని చెన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. డిక్లరేషన్‌లో పేర్కొన్న లక్ష్యాలను పూర్తిగా సాధించడంలో ఇంకా సవాళ్లు మిగిలివున్నాయన్నారు. ఆ డిక్లరేషన్ స్ఫూర్తిని పునరుజ్జీవింప చేయడం ఈ తీర్మానం ప్రధాన లక్ష్యంగా వుంది. లింగ సమానతను శీఘ్రగతిన సాధించాలన్న ఆకాంక్ష ప్రతిబింబిస్తోంది. ఈ సవాళ్లను ఎదుర్కొనడంలో అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయాలని ఈ తీర్మానం కోరుతోంది. వచ్చే ఏడాదిలో లింగ సమానత్వంపై, మహిళా సాధికారతపై అంతర్జాతీయ నేతలతో సమావేశాలను ఏర్పాటు చేయాలని కూడా చైనా ప్రతిపాదించింది.

తమిళనాడులో రైలు ప్రమాదం

- గూడ్స్ ట్రైన్‌ను ఢీకొట్టిన దర్భంగా ఎక్స్‌ప్రెస్
- 19 మందికి గాయాలు



చెన్నై : తమిళనాడులోని చెన్నై శివారులో శుక్రవారం రాత్రి రైలు ప్రమాదం జరిగింది. తిరువళ్లూరు సమీపంలోని కవరైపెట్టై వద్ద ఆగివున్న గూడ్స్ రైలును మైసూర్ – దర్భంగా బాగమతి ఎక్స్‌ప్రెస్ వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు బోగీల నుంచి మంటలు చెలరేగాయి. 13 బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. 19 మందికిపైగా ప్రయాణికులు గాయపడ్డారు. తమిళనాడు మంత్రి ఎస్ఎం నాసర్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. 19 మందిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని, 16 మందికి స్వల్పగాయాలయ్యాయని మంత్రి చెప్పారు. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే అధికారులు, సహాయక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, సహాయక కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. అధికారులు అంబులెన్సులు, రెస్క్యూ వాహనాలను అందుబాటులో ఉంచారు. ప్రయాణికులను సురక్షితంగా తరలించేందుకు వీలుగా బస్సులు, తాగునీరు వంటి మౌలిక వసతులను సిద్ధం చేసినట్లు తిరువళ్లూరు జిల్లా ఉన్నతాధికారులు తెలిపారు. ఈ ప్రమాదంతో నెల్లూరు – చెన్నై మధ్య రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. పలు రైళ్లను దారిమళ్లించారు.

ప్రమాదం ఎలా జరిగింది?

శుక్రవారం రాత్రి 8.27 గంటల సమయంలో పొన్నేరి స్టేషన్ దాటిన రైలును కవరైపెట్టై స్టేషన్‌లో మెయిన్ లైన్‌లో వెళ్లేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆ స్టేషన్‌లోకి ప్రవేశిస్తున్న సమయంలో భారీ కుదుపు ఏర్పడినట్లు రైలు సిబ్బంది గుర్తించారు. అనంతరం మెయిన్ లైన్‌లో వెళ్లాల్సిన రైలు లూప్ లైన్‌లో వెళ్లి ఆగివున్న గూడ్స్ రైలును ఢీకొట్టినట్లు అధికారులు తెలిపారు.

చెన్నై రైల్వే డివిజన్ అధికారులు ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్లు 04425354151, 04424354995 ఏర్పాటు చేశారు. ప్రమాదానికి గురైన రైలులోని ప్రయాణికులను ఇఎంయు రైలులో చెన్నై సెంట్రల్‌కు తరలిస్తామని రైల్వే అధికారులు తెలిపారు. అక్కడి నుంచి దర్భంగా వరకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేసి, ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరుస్తామని చెప్పారు. ప్రయాణికులకు ఉచితంగా ఆహారం, నీళ్లు అందిస్తామన్నారు.

2024లో రైల్వే ప్రమాదాలు

17 ఫిబ్రవరి 2024: ఢిల్లీలోని సరాయ్ రోహిల్లా సమీపంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది, ఇందులో ఒకరు మరణించారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో రైలు సర్వీసులకు అంతరాయం ఏర్పడి గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

10 మార్చి 2024: విశాఖపట్నం–భవానీపట్న ప్యాసింజర్ ప్రత్యేక రైలు (08504) కొత్తవలస రైల్వే స్టేషన్ సమీపంలో డౌన్‌లైన్ లూప్ నుంచి బయలుదేరుతున్నప్పుడు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ రైల్వే సర్వీసుల్లో జాప్యం జరిగింది.

మార్చి 18, 2024: సబర్మతి ఎక్స్‌ప్రెస్ గూడ్స్ రైలును ఢీకొట్టింది, ఇందులో చాలా మంది ప్రయాణికులు గాయపడ్డారు. సిగ్నల్ లోపం, ట్రాఫిక్ సమన్వయ లోపం కారణంగా ఈ ఘటన జరిగింది.

జూన్ 2, 2024: పంజాబ్‌లోని సిర్హింద్ సమీపంలో లూధియానా–అంబాలా ప్రధాన లైన్‌లో రెండు గూడ్స్ రైళ్లు ఢీకొన్నాయి, ఇందులో ఇద్దరు లోకో పైలట్‌లు గాయపడ్డారు. ఈ ఘటనతో సరుకు రవాణాకు అంతరాయం ఏర్పడింది.

17 జూన్ 2024: కాంచనజంగా ఎక్స్‌ప్రెస్‌ను గూడ్స్ రైలు ఢీకొట్టింది, 15 మంది మరణించగా.. 60 మందికి పైగా గాయపడ్డారు.

జూలై 18, 2024: ఉత్తరప్రదేశ్‌లోని గోండా–మాన్కాపూర్ ప్రాంతంలో చండీగఢ్–దిబ్రూగఢ్ రైలు కనీసం నాలుగు కోచ్‌లు పట్టాలు తప్పడంతో నలుగురు వ్యక్తులు మరణించారు.

30 జూలై 2024: జార్ఖండ్‌లోని ముంబై–హౌరా మెయిల్ పట్టాలు తప్పిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు మరణించగా.. 20 మంది గాయపడ్డారు.

31 జూలై 2024: పశ్చిమ బెంగాల్‌లోని రంగపాణి రైల్వే స్టేషన్ సమీపంలో రెండు గూడ్స్ రైలు కోచ్‌లు పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు కానీ, సరకుల రవాణాలో మాత్రం తీవ్ర సమస్య ఏర్పడింది.

సామాజిక భద్రతా కోడ్ నివేదిక జాప్యం

- కేంద్రాన్ని నిలదీసిన ఎన్‌హెచ్‌ఆర్‌సి

న్యూఢిల్లీ : సామాజిక భద్రతా కోడ్ అమలుపై అవసరమైన నివేదికను సమర్పించాల్సిందిగా కేంద్రాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) హెచ్చరించింది. ఈ మేరకు భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శికి రిమైండర్ జారీ చేసింది. నివేదికను సమర్పించకపోతే.. కమిషన్ ముందు వ్యక్తిగత హాజరు కోసం సంబంధిత అధికారిని పిలిపిస్తు, మానవ హక్కుల పరిరక్షణ (పిహెచ్‌ఆర్) చట్టం, 1993లోని సెక్షన్ 13 ప్రకారం బలవంతపు చర్యలను ప్రారంభించాల్సి ఉంటుందని ఎన్‌హెచ్‌ఆర్‌సి హెచ్చరించింది. సామాజిక భద్రత లేని సమాజంలోని బలహీన వర్గాల కోసం ఉద్దేశించిన సామాజిక భద్రతా కోడ్ అమలులో లేకపోవటంపై సుప్రీంకోర్టు న్యాయవాది, ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త రాధాకాంత త్రిపాఠి దాఖలు చేసిన కేసును అనుసరించి ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రతిస్పందనను సమర్పించనందుకు ఎన్‌హెచ్‌ఆర్‌సి సంబంధిత మంత్రిత్వ శాఖకు నాలుగు వారాల గడువునిచ్చింది. కేంద్రం నోటిఫై చేసిన కోడ్ ఆన్ సోషల్ సెక్యూరిటీ, 2020ని అమలు చేయకపోవటం తక్కువ ఆదాయ వర్గాల ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేసిందని త్రిపాఠి పేర్కొన్నారు. జాతీయ సామాజిక భద్రతా బోర్డు, రాష్ట్ర అసంఘటిత కార్మికుల బోర్డులు, వారి పాత్రలు, అధికారాలను నిర్వచించటం కోసం కోడ్ వివరణాత్మక నిబంధనలను కలిగి ఉన్నదని నొక్కి చెప్పారు. కేంద్రం నోటిఫై చేయాల్సిన తేదీ నుంచి కోడ్ అమలులోకి రావాల్సి ఉండగా నేటికీ సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యతలను నెరవేర్చటంలో విఫలమైనందున.. త్రిపాఠి ఎన్‌హెచ్‌ఆర్‌సి జోక్యాన్ని కోరారు. ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న కమిషన్.. ఆరు వారాల్లోగా చర్య తీసుకున్న నివేదికను సమర్పించాలని కేంద్రాన్ని ఆదేశించింది. జులై 2 నుంచి ఆగస్టు 22 నాటి విచారణలో ఎన్‌హెచ్‌ఆర్‌సి కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శికి రిమైండర్లు జారీ చేసింది. అయినప్పటికీ.. కమిషన్‌కు సంబంధిత మంత్రిత్వ శాఖ నుంచి ఎటువంటి నివేదిక అందకపోవటం గమనార్హం.

జెపి విగ్రహానికి నివాళులర్పించకుండా నిలిపివేత

- యోగి ప్రభుత్వంపై అఖిలేష్ ఆగ్రహం
- ఎన్‌డిఎకు మద్దతు ఉపసంహరించుకోండి : నితీష్‌కు సూచన



జయప్రకాష్ నారాయణ్ విగ్రహం వద్దకు వెళ్ళకుండా ఏర్పాటు చేసిన ఇనుప రేకులు వద్ద అఖిలేష్ యాదవ్

లక్నో : సోషలిస్ట్ నేత లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసేందుకు వెళ్లాలనుకున్న మాజీ సిఎం, ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్‌కు ఉత్తర ప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. లక్నోలోని గోమతినగర్ ప్రాంతంలో ఉన్న జయప్రకాష్ నారాయణ్ ఇంటర్నేషనల్ సెంటర్ (జెపిఎన్ఐసి) గేటు వద్ద ఉన్న జెపి విగ్రహం ఉన్న ప్రాంతాన్ని ఏటా సమాజ్‌వాదీ పార్టీ నేతలు సందర్శించి, నివాళులర్పిస్తారు. అక్కడ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, జెడ్ ప్లస్ భద్రత కల్పించడం సాధ్యం కాదని పేర్కొంటూ రాష్ట్రప్రభుత్వం అఖిలేష్ యాదవ్ సందర్శనకు అనుమతిని నిరాకరించింది. దీంతో, ఆయన తన నివాసం వద్దకు చేరుకున్న వేలాదిమంది కార్యకర్తలతో కలిసి జెపి విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా అఖిలేష్ మాట్లాడుతూ "లోక్‌నాయక్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేయకుండా అడ్డుకుంది. అయినప్పటికీ రహదారిపై ఆయనకు నివాళులర్పించాం. జయప్రకాష్ నారాయణ్ గౌరవార్థం నిర్మించిన విగ్రహాన్ని విక్రయించాలని బిజెపి ప్రభుత్వం యత్నిస్తోంది. ఇటువంటి ప్రభుత్వం రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుందని ఎలా ఆశించగలమని' ప్రశ్నించారు. జెడియు కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవాలని అఖిలేష్ యాదవ్ నితీష్‌కుమార్‌కి సూచించారు. "నితీష్‌కుమార్ జయప్రకాష్ నారాయణ్ ఉద్యమం నుండి వచ్చారు. సోషలిస్టు భావాలను అనుసరించని ప్రభుత్వం నుండి నితీష్ కుమార్ వైదొలగాలి" అని అన్నారు.

పిఎస్‌యు కార్మికులకు బోనస్, ఎక్స్‌గ్రేషియా తమిళనాడు ప్రభుత్వం ఆదేశం

- 2,75,000 మంది కార్మికులకు లబ్ధి

న్యూఢిల్లీ : రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు (పిఎస్‌యు), చట్టబద్ధమైన బోర్డుల్లోని కార్మికులకు తమిళనాడు సిఎం స్టాలిన్ తియ్యని కబురు అందించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను 2.75 లక్షల మంది ఉద్యోగులకు బోనస్, ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం.. గ్రూప్ సి, డి కింద లాభాలర్జించే పిఎస్‌యూలకు చెందిన అర్హులైన కార్మికులందరికీ కనిష్ట బోనస్ రూ.8,400, గరిష్టంగా రూ.16,800 చెల్లించబడు తుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అనుమతించదగిన మిగులు లేని పిఎస్‌యూల ఉద్యోగులకు 8.33 శాతం బోనస్, 1.67 శాతం ఎక్స్‌గ్రేషియా చెల్లించబడుతుందని వివరించాయి. "పండుగ (దీపావళి) సీజన్‌కు ముందు మొత్తం 2,75,670 మంది రాష్ట్ర పిఎస్‌యూ కార్మికులకు బోనస్, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తమిళనాడు ముఖ్యమంత్రి అక్టోబర్ 10న ఆదేశించారు" అని ప్రభుత్వ ప్రకటన పేర్కొన్నది. ఈ నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వంపై రూ.369.65 కోట్ల భారం పడనున్నదని సమాచారం. టాన్‌జెడ్కో, రాష్ట్ర రవాణా సంస్థలు, తమిళనాడు పౌర సరఫరాల కార్పొరేషన్, సహకార పాల ఉత్పత్తిదారుల సమాఖ్య కార్మికులు, ఉద్యోగులకు 20 శాతం బోనస్, ఎక్స్‌గ్రేషియా అందనున్నది. తమిళనాడు హౌసింగ్ బోర్డ్ అండ్ చెన్నై మెట్రోపాలిటన్‌లోని గ్రూప్ సి, డి ఉద్యోగులు, నీటి సరఫరా, డ్రైనేజీ బోర్డు 10 శాతం బోనస్, ఎక్స్‌గ్రేషియా పొందుతుందని ప్రభుత్వ ప్రకటన పేర్కొన్నది. తమిళనాడు వాటర్ సప్లై అండ్ డ్రయినేజీ బోర్డు ఉద్యోగులకు 8.33 శాతం బోనస్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ కార్మికులకు రూ.3,000 ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తారు.

నారీ శక్తిని ప్రోత్సహించాలి

- నారా భువనేశ్వరి
- 9 మందికి పసుపు-కుంకుమ అందజేత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నారీమణుల్లో ఎంతో శక్తి దాగి ఉందని, ఆ శక్తిని బయటకు తీస్తే వచ్చే ఫలితాలు ఎంతో గొప్పగా ఉంటాయని సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. మహిళలు విజయాలు సాధించిన వారిని గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల ఆధ్వర్యాన విజయవాడ పున్నమి ఘాట్ బబ్బూరి గ్రౌండ్స్‌లో శుక్రవారం 'నారీ శక్తి' విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ.. దసరా అంటే తొలుత ప్రతి ఒక్కరికీ గుర్తుకొచ్చేది ఇంద్రకీలాద్రి అని అన్నారు. కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులు మనపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మహిళల శక్తే ఈ నారీ శక్తి విజయమి అన్నారు. పంచాయతీ సర్పంచ్ నుంచి రాష్ట్రపతి వరకు అన్ని పదవులనూ మహిళలు సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయ నాయకులతోపాటు ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల వెనుక వారి సతీమణుల కృషి ఎంతో ఉందన్నారు. ఆస్తిలో సమాన హక్కులు ఇవ్వాలని చట్టాన్ని తేవడంతో పాటు అమలు చేసి చూపించిన ఘనత నందమూరి తారక రామారావుకే దక్కుతుందన్నారు. తిరుపతిలో తొలి మహిళా యూనివర్సిటీని ప్రారంభించారన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తేవడంతోపాటు మహిళల ఆర్థికాభివృద్ధికోసం డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. కుటుంబం కోసం పిల్లల కోసం శ్రమించే ప్రతి మహిళా తనకు ఆదర్శమన్నారు. చేనేత వస్త్రాలను ప్రతిఒక్కరూ వారంలో ఒక్క రోజైనా ధరించాలన్నారు. బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత మాట్లాడుతూ.. మహిళల సాధికారతకు ఎన్‌టిఆర్ కృషి చేస్తే.. ఆయన స్ఫూర్తిగా సిఎం చంద్రబాబు ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. వరదలు, విపత్తుల సమయంలో కలెక్టరేట్‌లోనే పది రోజులుండి పరిస్థితులు చక్కదిద్దేలా చేసేందుకు భువనేశ్వరి తోడ్పాటునందించారన్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. స్త్రీని ఎలా గౌరవించాలని భావితరాలకు చెప్పే వేదికగా ఈ శక్తి విజయోత్సవం ఉండాలని ఆకాంక్షించారు. కృష్ణమ్మ, దుర్గమ్మ సాక్షిగా దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. మాతృత్వం, వీరత్వం, ధీరత్వం వంటి నవరసాలను పోషించగలిగే ఏకైక ప్రాణి ఈ ప్రపంచంలో కేవలం స్త్రీ మాత్రమేనన్నారు. గతంలో హరించబడిన మహిళా హక్కులను తమ కూటమి ప్రభుత్వంలో పునరుద్ధరించామన్నారు.

నారీ శక్తి విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా విజయవాడలో ఇటీవల వచ్చిన వరదల విపత్తులను ఎదుర్కొని ధైర్యంగా నిలదొక్కుకున్న 9 మంది మహిళామణులను భువనేశ్వరి కుంకుమ బొట్టుపెట్టి పసుపు, కుంకుమలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎపి టిడిసి ఛైర్మన్ నూకసాని బాలాజి, టూరిజం ఎమ్‌డి అభిషిక్త్ కిషోర్, ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు, న్యాయమూర్తుల సతీమణులు, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ సృజన పాల్గొన్నారు. నారీ శక్తి విజయోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. సభ ప్రారంభానికి ముందు నవదుర్గలు, కృష్ణానదికి అర్చకులు హారతిచ్చారు.



పర్యాటకశాఖ 'నారీశక్తి' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నారా భువనేశ్వరికి జ్ఞాపికను అందజేస్తున్న హోంమంత్రి అనిత, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్



దరఖాస్తుల ఆదాయం రూ.1,742 కోట్లు

- మద్యం షాపులకు 87,116 అప్లికేషన్లు స్వీకరణ
- 16 నుంచి కొత్త షాపుల్లో విక్రయాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మద్యం నూతన పాలసీలో భాగంగా నోటిఫై చేసిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. ఈ దరఖాస్తుల ద్వారా నాన్ రిఫండబుల్ డిపాజిట్‌లతోనే ప్రభుత్వ ఖజానాకు రూ.1,742 కోట్ల ఆదాయం సమకూరింది. 3,396 షాపులకు 87,116 దరఖాస్తులు అందాయి. శుక్రవారం సాయంత్రం 7 గంటల వరకూ దరఖాస్తులకు అధికారులు అవకాశం కల్పించిన విషయం విధితమే. ఆఫ్‌లైన్ విధానంలో సంబంధిత ఎక్సైజ్‌శాఖ కార్యాలయాల వద్ద దరఖాస్తులు సమర్పించే వారికి రాత్రి 7 గంటలకు క్యూ లైన్‌లో ఉన్నవారికి మాత్రమే టోకెన్లు ఇచ్చి వారి నుంచే దరఖాస్తులు స్వీకరించాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందించడానికి రాత్రి 7 గంటల వరకే డెడ్ లైన్‌గా నిర్ణయించగా, దరఖాస్తు చేసిన వారు రూ.2 లక్షల డిపాజిట్ చెల్లించేందుకు మాత్రం శుక్రవారం రాత్రి 12 గంటల వరకూ అవకాశం కల్పించారు. జిల్లాల వారీ వివరాలు పరిశీలిస్తే.. ఎన్‌టిఆర్ జిల్లాలో అత్యధికంగా 113 షాపులకు 5,764 దరఖాస్తులు అందగా, 175 షాపులకు 5,362 దరఖాస్తులతో పశ్చిమ గోదావరి జిల్లా ద్వితీయ స్థానంలో ఉంది. ఎఎస్ఆర్ జిల్లాలో 40 షాపులకు 1,179 దరఖాస్తులతో చివరి స్థానంలో నిలిచింది. తిరుపతి జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా 227 షాపులు ఉన్నా.. అధికారుల అంచనాలకు భిన్నంగా 3,659 దరఖాస్తులు మాత్రమే అందాయి. ఈ ప్రక్రియలో భాగంగా 12, 13వ తేదీల్లో దరఖాస్తుల పరిశీలన, లాటరీకి అవసరమైన ఏర్పాట్లు చేస్తారు, 14వ తేదీన డ్రా నిర్వహించి, ఎంపికైన వారి వివరాలు వెల్లడిస్తారు. 16 నుంచి ప్రైవేటు మద్యం షాపుల నుంచి విక్రయాలు చేపడతారు. రెండేళ్లపాటు ఈ పాలసీ అమలులో ఉండనుంది.

చివరి 4 రోజుల్లో అత్యధికం

సెప్టెంబరు 30వ తేదీన ఎక్సైజ్‌శాఖ నూతన పాలసీలో భాగంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. అప్పటి నుంచి అధికారులు దరఖాస్తుల స్వీకరణకు చర్యలు చేపట్టారు. ఈ నెల 7వ తేదీ వరకూ 20,310 దరఖాస్తులు మాత్రమే లభించగా, ఈ నెల 8వ తేదీన గడువును ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ పొడిగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. చివరి నాలుగు రోజులైన 8 నుంచి 11వ తేదీ వరకూ అత్యధికంగా 67 వేలకుపైగా దరఖాస్తులు అందాయి. మద్యం షాపులను పొందేందుకు అధికార పక్ష ప్రజా ప్రతినిధుల బినామీలు, అనుచరగణం పెద్దయెత్తున దరఖాస్తులు చేసింది.

చాలా జిల్లాల్లో వ్యాపారులు దరఖాస్తులు చేసేందుకు వీరు అడ్డంకులు సృష్టించడం, ప్రత్యక్షంగా అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడ్డారు. ఈ చర్యల కారణంగా ప్రభుత్వం మద్యం విషయంలో అపఖ్యాతిని మూటగట్టుకుందనే వాదనలు వినిపించాయి. ఈ సమాచారం అందుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరికల నేపథ్యంలో వారు కొంత పట్టు సడలించారు. ఫలితంగా దరఖాస్తులు సంఖ్య క్రమంగా పెరిగింది.

రతన్ టాటా వారసుడిగా నోయెల్ టాటా



ముంబయి : ఇటీవల కనుమూసిన రతన్ టాటా వారసుడొచ్చాడు. టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ బాధ్యతలను రతన్ సోదరుడు నోయెల్ టాటాకు అప్పగించారు. ముంబయిలో శుక్రవారం జరిగిన బోర్డు సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. ఆయన రతన్ టాటాకు సవతి సోదరుడు. బ్రిటన్‌లోని సస్సెక్స్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ట్రెంట్, వోల్టాస్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్, టాటా ఇంటర్నేషనల్ కంపెనీలకు ఇప్పటికే నోయెల్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. టాటా స్టీల్, టైటాన్‌లకు వైస్ ఛైర్మన్‌గా ఉన్నారు. రతన్ టాటా ట్రస్ట్, సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ బోర్డులో ట్రస్టీగా పనిచేస్తున్నారు. టాటాగ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్‌లో 66 శాతం వాటాను టాటా ట్రస్ట్ కలిగి ఉంది.

ఇంధన రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు

- భారీ లక్ష్యాలతో క్లీన్ ఎనర్జీ పాలసీ
- ఇంధనశాఖ అధికారులకు ముఖ్యమంత్రి సూచనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ రంగంలో పెట్టుబడులను ఆహ్వానించే రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ (ఐసిఇ) పాలసీ-2024ను సిద్ధం చేసింది. సౌర, పవన, బ్యాటరీ స్టోరేజ్, ఎలక్ట్రోలైజర్స్, బయో ఫ్యూయల్, పిఎస్‌పి, హైబ్రిడ్ ప్రాజెక్టులు, సోలార్ పార్కులు చేపట్టే పెట్టుబడిదారులకు భారీ ప్రోత్సాహకాలు, రాయితీలు అందించేలా ఈ పాలసీ రూపొందించింది. ఈ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను ఆహ్వానించి..7.5 లక్షల మందికి ఉపాధి కల్పించాలని భారీ లక్ష్యాలను నిర్దేశించారు. ఇంధనశాఖ రూపొందించిన ఈ పాలసీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం పలు సూచనలు చేసినట్లు తెలిసింది. పాలసీ అంశంపై ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్‌తో తన నివాసంలో సమావేశమయ్యారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 16న జరగనుంది. ఈ సమావేశంలో క్లీన్ ఎనర్జీ పాలసీని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. పెట్టుబడిదారులకు అందించే భూములు, రాయితీ, పర్యావరణ అనుమతులు వంటి అంశాలపై ఆయా శాఖల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాలను ఇంధనశాఖ స్వీకరిస్తోంది.

పాలసీలోని కీలకాంశాలు

రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు, 7.75 లక్షల మందికి ఉపాధి అందించాలనే లక్ష్యంగా పాలసీ రూపొందించింది. 2030 నాటికి రాష్ట్రంలో 72.60 గిగా వాట్ల పునరుత్పాదక విద్యుదుత్పత్తే లక్ష్యంగా నిర్దేశించుకుంది. రాష్ట్రంలో 500 విద్యుత్ వాహనాల స్టేషన్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి ఏర్పాటుకు అయ్యే మొత్తంలో 25 శాతం పెట్టుబడి రాయితీ ఇవ్వనుంది. సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సేకరించిన భూములకు ఎకరాకు ఏడాదికి రూ.31 వేలు చెల్లించడంతో పాటు ప్రతి రెండేళ్లకు 5 శాతం పెంచే విధంగా నిర్ణయించారు.

బీరుట్‌పై ఇజ్రాయిల్ దాడుల పట్ల భారత్ తీవ్ర ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

భారత విదేశాంగశాఖ అభిప్రాయపడింది. "లెబనాన్ సరిహద్దు (బ్లూ లైన్)లో భద్రతా పరిస్థితులు క్షీణించడం ఆందోళనకరం. పరిస్థితులను ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తున్నాం. ఐక్యరాజ్య సమితి ప్రాంగణాలను అందరూ గౌరవించాలి. ఐరాస శాంతి పరిరక్షకులు, ఆ సంస్థ నిర్ణయాలను గౌరవించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి" అని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. "పశ్చిమాసియాలో నెలకొంటున్న పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఇటీవల ఓ ప్రకటన విడుదల చేశాం. అక్కడ చోటుచేసుకుంటున్న హింస, పరిస్థితులు ఎంతగానో ఆందోళన కలిగిస్తున్నాయి. సంబంధిత భాగస్వామ్య పక్షాలు సంయమనం పాటించాలని, పౌరులకు రక్షణ కల్పించాలని పునరుద్ఘాటించాం. ఈ ఘర్షణ మరిన్ని ప్రాంతాలకు విస్తరించకూడదు. చర్చలు, దౌత్య మార్గాల్లో సమస్యను పరిష్కరించుకోవాలి" అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. యునైటెడ్ నేషన్స్ ఇంటరిమ్ ఫోర్స్ ఇన్ సౌత్ లెబనాన్ (యుఎన్ఐఎఫ్ఐఎల్) శాంతిపరిరక్షణ దళాల్లో భాగంగా భారత సైన్యం కూడా దక్షిణ లెబనాన్‌లో విధులు నిర్వర్తిస్తోంది. 50దేశాల నుంచి దాదాపు 10,500 మందితో కూడిన దళాలు యుఎన్ఐఎఫ్ఐఎల్‌లో ఉన్నాయి. ఇందులో భారత్‌కు చెందిన 900 మందితో కూడిన బెటాలియన్ అక్కడ విధుల్లో ఉంది.

సెమీస్‌కు చేరాలంటే గెలవాల్సిందే..

- రేపు ఆస్ట్రేలియా మహిళలతో కీలక పోరు
- రాత్రి 7.30గం॥ల నుంచి



షార్జా: ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్‌లో టీమిండియా కీలక పోరుకు సిద్ధమైంది. ఆరుసార్లు టైటిల్ నెగ్గిన ఆస్ట్రేలియా మహిళలతో ఆదివారం(13న) జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే టీమిండియా గ్రూప్-ఎ నుంచి సెమీస్‌కు చేరే ఛాన్స్ ఉంది. ఈ టోర్నీలో టీమిండియా ప్రారంభ మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓటమి సెమీస్ అవకాశాలను క్లిష్టం చేసింది. న్యూజిలాండ్ చేతిలో 58పరుగుల తేడాతో ఓడిన హర్మన్‌ప్రీత్ సేన.. ఆ తర్వాత పాకిస్తాన్‌పై చచ్చీ చెడి గెలిచింది. దీంతో ఈ ప్రదర్శనతో టీమిండియా ముందుకెళ్లడం కష్టమనే దశలో శ్రీలంకపై ఘన విజయం ఊరటనిచ్చే అంశం. దీంతో ఈ గ్రూప్‌లో జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా పటిష్ట ఆస్ట్రేలియాను ఓడించాల్సిన పరిస్థితి ఎదురైంది. మరోవైపు ఆస్ట్రేలియా ఈ గ్రూప్‌లో ఆడిన మూడు మ్యాచుల్లోనూ గెలిచి సెమీస్‌కు మరింత చేరువైంది.

సెమీస్ బెర్త్‌కు తీవ్ర పోటీ..

గ్రూప్-ఎలో సెమీస్ బెర్త్‌కు తీవ్ర పోటీ నెలకొననుంది. ఈ గ్రూప్ నుంచి ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్లకు సెమీస్‌కు అవకాశాలు మెరుగ్గా ఉండగా.. టీమిండియాకూ ఆ ఛాన్స్ లేకపోలేదు. హర్మన్‌ప్రీత్ సేన చివరి లీగ్‌లో ఆస్ట్రేలియాను చిత్తుచేస్తే.. ఈ మూడుజట్లకు ఆరు పాయింట్లు చొప్పున జమ కానున్నాయి. దీంతో రన్‌రేట్ మెరుగ్గా ఉన్న జట్టు సెమీస్‌కు చేరనుంది. శ్రీలంకపై గెలుపుతో టీమిండియా రన్‌రేట్‌ను పెంచుకొని సెమీస్ రేసులో నిలవడం ఊరటనిచ్చే అంశం.

పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరల భారాన్ని అరికట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

చేయాల్సి వస్తోందని, పర్యవసానంగా భారం పేద ప్రజల విద్య, వైద్యంపై కూడా పడుతోందని వివరించారు. ఎన్నికల ముందు బిజెపి ప్రభుత్వం ధరలు అదుపు చేస్తామని, ఉచితంగా ఆహార ధాన్యాలు అందిస్తామని ఇచ్చిన హామీకి విరుద్ధంగా గత బడ్జెట్‌లో ఆహార భద్రతకు భారీగా నిధులు తగ్గించిందని పేర్కొన్నారు. ఎఫ్‌సిఐ (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పాత్రను తగ్గించిందని, ఒకపక్క గోదాముల్లో ధాన్యం ముక్కిపోతున్నా పేదలకివ్వడానికి బిజెపి ప్రభుత్వం అంగీకరించడం లేదని పేర్కొన్నారు. పేదలెవ్వరూ ఆకలితో నిద్రపోకూడదన్న సుప్రీంకోర్టు తీర్పును కూడా ఎన్‌డిఎ ప్రభుత్వం అమలు చేయడం లేదని, బహిరంగ మార్కెట్‌ను ప్రైవేటు వ్యక్తులకు స్వేచ్ఛ నివ్వడం వల్ల కృత్రిమ కొరతను సృష్టించి భారీగా ధరల పెంపునకు పరోక్షంగానే కేంద్ర ప్రభుత్వం కారణం అవుతోందని పేర్కొన్నారు. ఒకపక్క బహిరంగ మార్కెట్‌ను కార్పొరేట్లకు కట్టబెడుతూ ప్రజలను నమ్మించడానికి ఈ ఏడాది చివరి వరకూ ఉచితంగా బియ్యం అందిస్తామని కపట నాటకం ఆడుతోందని తెలిపారు. దీన్ని ఆధారం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ బియ్యం ఆపేసి, కేవలం రేషన్ కార్డుకు 20 కిలోలు ఇస్తున్నారని వివరించారు. ఇందులోనూ బియ్యం మినహా పప్పు, నూనె, పంచదార మొదలైనవి ఇవ్వడం లేదని, అదే కేరళ రాష్ట్రం ప్రజా పంపిణీ ద్వారా ఆహార ధాన్యాలు అందించడంలో దేశంలో నేటికీ ఆదర్శంగా ఉందని పేర్కొన్నారు. గతంలో ధరలను అదుపు చేయడానికి బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసేదని, నేడు టిడిపి ప్రభుత్వం అటువంటి కృషి చేయడం లేదని, ప్రజాపంపిణీ ద్వారా కందిపప్పు, నూనె, పంచదార, తృణధాన్యాలు ఇవ్వడం ఆపేసిందని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దారిద్ర్యం, నిరుద్యోగం, పేదరికం నేటికీ 70 శాతం ఉన్న మనలాంటి దేశంలో ఆహార ధాన్యాలు ఉచితంగా అందించడం ప్రభుత్వాల బాధ్యతని, అడ్డూ అదుపు లేకుండా పెరుగుతున్న నిత్యావసరాల ధరలు అదుపు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని, ప్రజాపంపిణీ ద్వారా అన్ని రకాల నిత్యావసర సరుకులు

'దేవర-2'లో మరికొందరు బాలీవుడ్ హీరోలు



'దేవర-2' సినిమాకు రంగం సిద్ధం చేస్తున్నామని దర్శకుడు కొరటాల శివ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. 'దేవర-1'లో బాలీవుడ్ నటుడు సైఫ్ ఆలీఖాన్ కీలకపాత్రలో నటించారు. ఇటీవలే ఈ సినిమా విడుదలైన విషయం తెలిసిందే. మంచి పాజిటివ్ టాక్ రావటంతో పార్ట్2పై ఊహాగానాలు వస్తున్నాయి. ఈ సినిమా ప్రచారంలో భాగంగా దర్శకుడు కొరటాల శివ ఆసక్తికరమైన కామెంట్లు చేశారు. ఈ సీక్వెల్‌లో మరికొందరు బాలీవుడ్ స్టార్స్ ఉండే అవకాశం ఉందని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సీక్వెల్‌లో మరికొందరు బాలీవుడ్ స్టార్స్ ఉండే అవకాశం ఉందన్నారు. పార్ట్ 2లో రణ్‌వీర్‌సింగ్, రణ్‌బీర్ కపూర్ ఉంటే బాగుటుందన్నారు. తెలుగు, తమిళ ఇండస్ట్రీలకు చెందిన నటీనటుల పేర్లు చెబితే ఇప్పటినుంచే ఊహాగానాలు మొదలవుతాయన్నారు. అతిథి పాత్రలు కూడా ఉంటాయని వివరించారు. అవి సినిమాలో చాలాకీలకమైనవనీ, వాటి వివరాలను త్వరలోనే ప్రకటిస్తానన్నారు. పార్ట్ 1లో చూసింది 10 శాతమేననీ, రెండోభాగంలో 100 శాతం చూస్తారన్నారు. ప్రతిపాత్రలోనూ ట్విస్ట్ ఉంటుందన్నారు.

ఆలియాకు మహేష్ శుభాకాంక్షలు



హీరో మహేష్‌బాబు సోషల్‌మీడియాలో కొత్త సినిమాలు వస్తే వాటిని చూసి కామెంట్లు పెడుతుంటారు. బాలీవుడ్ నటి ఆలియాభట్ నటించిన 'జిగ్రా' మూవీ శుక్రవారం విడుదలయ్యింది. ఆలియా ప్రధాన పాత్రలో నటించారు. బ్రదర్-సిస్టర్ సెంటిమెంట్ స్టోరీతో దీన్ని తెరకెక్కించారు. హిందీతోపాటు తెలుగులోనూ విడుదల చేశారు. ఈ సినిమా విజయవంతం కావాలంటూ ట్వీట్ చేశారు. దసరాకు ఈసారి తెలుగులో విశ్వం, మా నాన్న సూపర్, జనక అయితే గనక చిత్రాలు విడుదలయ్యాయి. వేట్టైయాన్, మార్టిన్, జిగ్రా చిత్రాలు కూడా విడులయ్యాయి.

'హ్యాపీ బర్త్‌డే' అమితాబ్



బాలీవుడ్ సీనియర్ హీరో అమితాబ్‌బచ్చన్ పుట్టినరోజు వేడుకలను శుక్రవారం జరుపుకున్నారు. రజనీకాంత్ నటించిన కొత్త సినిమా 'వేట్టైయాన్'లో ఆయన నటించారు. ప్రభాస్ నటించిన 'కల్కి' చిత్రంలో కూడా ఆయన అలరించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన హిందీలో మాత్రమే ప్రసారమవుతున్న 'కౌన్ బనేగా కరోడ్‌పతి' షోకు హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. అమితాబ్ పుట్టిన రోజును పురస్కరించుకుని 'కల్కి' సినిమా టీమ్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపింది. ఈ చిత్రంలో అమితాబ్ అశ్వద్ధామ పాత్రలో మెప్పించిన విషయం తెలిసిందే. హ్యాపీ బర్త్‌డే అశ్వత్థామ. త్వరలోనే సెట్స్‌లో కలుసుకుందాం అంటూ అమితాబ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. 'కల్కి-2'లో కూడా అమితాబ్ నటిస్తున్న విషయం తెలిసిందే. నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో ఈ సినిమా వచ్చే ఏడాది సెట్స్‌పైకి వెళ్లనుంది.

ఆస్ట్రేలియా మహిళలు హ్యాట్రిక్

పాకిస్తాన్ మహిళలపై తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం



దుబాయ్: ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్ సెమీఫైనల్‌కు ఆస్ట్రేలియా మరింత చేరువైంది. శుక్రవారం పాకిస్తాన్ మహిళలతో జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో ఏకంగా 9వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఆసీస్ జట్టు +2.78రన్‌రేట్‌తో దాదాపు సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. గ్రూప్-ఎలో భాగంగా పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ మహిళలు తొలిగా బ్యాటింగ్‌కు దిగి 19.1 ఓవర్లలో 82పరుగులకే ఆలౌటైంది. ఆలీయా రైజ్(26) టాప్ స్కోరర్. ఆస్ట్రేలియా బౌలర్లు గార్డినర్‌కు నాలుగు, సథర్లాండ్స్, వారేహామ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 11 ఓవర్లలో మూనీ(15) వికెట్ చేజార్చుకొని ఛేదించింది. హీలీ(37), ఫెర్రీ(22) బ్యాటింగ్‌లో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గార్డినర్‌కు లభించింది.

పాయింట్ల పట్టిక

దేశం	ఆ	గె	ఓ	టై	పా	నె.ర
గ్రూప్-ఎ						
1. ఆస్ట్రేలియా	3	3	0	0	6	+2.78
2. ఇండియా	3	2	1	0	4	+0.57
3. న్యూజిలాండ్	2	1	1	0	2	-0.05
4. పాకిస్తాన్	3	1	3	0	2	-0.48
5. శ్రీలంక	3	0	3	0	0	-2.56
గ్రూప్-బి						
1. వెస్టిండీస్	3	2	1	0	4	+1.70
2. దక్షిణాఫ్రికా	3	2	1	0	4	+1.52
3. ఇంగ్లండ్	2	2	0	0	4	+0.65
4. బంగ్లాదేశ్	3	1	2	0	2	-0.83
5. స్కాట్లాండ్	3	0	3	0	0	-2.67

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్ రన్‌రేట్

తొలిటెస్ట్‌లో ఇంగ్లండ్ గెలుపు

పాకిస్తాన్‌పై ఇన్నింగ్స్ 68పరుగుల తేడాతో ఘన విజయం



ముల్తాన్: పాకిస్తాన్‌తో జరిగిన తొలి టెస్ట్‌లో ఇంగ్లండ్ జట్టు ఇన్నింగ్స్ 47పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 7వికెట్ల నష్టానికి 823పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో పాకిస్తాన్ జట్టు 220పరుగులకే కుప్పకూలింది. ఓవర్‌నైట్ స్కోర్ 6వికెట్ల నష్టానికి 152పరుగులతో శుక్రవారం ఐదోరోజు ఆటను కొనసాగించిన పాకిస్తాన్ జట్టు ఇంగ్లండ్ బౌలర్లు కట్టడి చేశారు. మరో 68పరుగులకు చివరి నాలుగు వికెట్లను సాధించారు. ఈ టెస్ట్‌లో బ్రూక్(317) ట్రిపుల్ సెంచరీకి తోడు రూట్(262) డబుల్ సెంచరీలతో రాణించిన సంగతి తెలిసిందే. దీంతో ఇంగ్లండ్ జట్టుకు 288పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హారీ బ్రూక్‌కు లభించగా.. రెండోటెస్ట్ 15నుంచి ప్రారంభం కానుంది.

ఆంధ్ర 114/1

- విదర్భతో రంజీట్రోఫీ మ్యాచ్

నాగ్‌పూర్: ఎలైట్ గ్రూప్-బిలో విదర్భతో జరుగుతున్న రంజీట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ బౌలర్లు సమిష్టిగా రాణించారు. దీంతో తొలిరోజు విదర్భ జట్టును తొలి ఇన్నింగ్స్‌లో 118పరుగులకే ఆలౌట్ చేశారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన విదర్భను ఆంధ్ర బౌలర్లు కట్టడి చేశారు. శశికాంత్ మూడు వికెట్లకి తోడు స్టీఫెన్, సత్యనారాయణరాజు, లలిత్ మోహన్ మూడేసి వికెట్లతో కదం తొక్కారు. విదర్భ జట్టులో కెప్టెన్, వికెట్ కీపర్ అక్షయ్ వాడ్కర్(46)కి తోడు ఉమేశ్ యాదవ్(20) బ్యాటింగ్‌లో రాణించారు. కరణ్ నాయర్(12), మార్కండే(0) నిరాశపరిచారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ జట్టు తొలిరోజు ట ముగిసే సమయానికి వికెట్ నష్టపోయి 114పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ రెడ్డి(62), రషీద్(49) క్రీజ్‌లో నిలువగా.. హనుమ విహారి(1) నిరాశపరిచాడు.

ఇదే గ్రూప్‌లో హైదరాబాద్-గుజరాత్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో గుజరాత్ బ్యాటర్లు రాణించారు. మన్నన్ హింగ్రాజియా (174) అజేయ సెంచరీతో రాణించగా.. ఉర్విల్ పటేల్(60) అర్ధసెంచరీతో మెరిసాడు. రోహిత్ రాయుడు, ఛామా మిలింద్‌లకు మూడేసి, రిషాన్, నిషాంత్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.

దాండియా ఆడిన విశ్వక్‌సేన్



హీరో విశ్వక్‌సేన్ త్వరలో 'మెకానిక్ రాకీ'గా ప్రేక్షకుల ముందుకు రానున్నారు. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి తర్వాత ఆయన ఈ సినిమాలోనే నటించారు. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. మీనాక్షిచౌదరి హీరోయిన్. దీపావళి పండుగ సందర్భంగా ఈ సినిమా థియేటర్లలో సందడి చేయనుంది. దసరా పండుగలో భాగంగా ఆయన గుజరాతీ స్టైయిల్‌లో తన సోదరితో కలిసి దాండియా ఆడారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

1: 43 ఎఎం షూటింగ్ పూర్తి



హీరో కె.చంద్రహాస్, హీరోయిన్‌గా సరాహ్ ఆర్చర్ నటించిన చిత్రం '1: 43 ఎఎం'. చిన్నం శ్రీహరి నిర్మాతగా, దర్శకత్వం, కథ, స్క్రీన్‌ప్లే, లిరిక్స్ అమ్మ రమేష్ పుప్పాల వ్యవహరిస్తున్నారు. సన్‌షైన్ క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ సినిమా తెరకెక్కింది. ఎడిటర్‌గా నందమూరి హరి, ప్రవీణ్ టంటం, సంగీతం తోటపల్లి నరసింహ అందించారు. బ్యాక్‌గ్రౌండ్ ప్లే పురుషోత్తం రాజ్, విఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్‌గా మాదాసు శ్రావణ్‌కుమార్, ఆడియోగ్రఫీ జె.రాఘవచరణ్ వ్యవహరించారు. సెన్సార్ పనులు పూర్తయిన తర్వాత ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని దర్శకులు అమ్మరమేష్ పుప్పాల తెలిపారు.



JEEVANA జీవన the family

దసరా.. అదో సరదా



బాల్యమంటేనే అదో సరదా
దసరా వస్తే ఇంకాస్త ఉండదా?
వారం ముందుగానుండే బడిలో
దసరా పద్యాలు బట్టీ పెట్టించడాలు

అల్లంత దూరాన అద్దాల మేడ..
ఏదయా మీదయా మా మీద లేదు..
సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు...
ఒకటా, రెండా.. ఎన్నో.. ఇంకెన్నో..

పది రోజుల ముందుగానుండే
ఊర్లో బుట్టా ధనుస్సుల అమ్మకాలు
రెండు రోజులు ముందు నుండే పిల్లలు
పూలు, పత్రి సేకరణలో తలమునకలు

దసరా రోజు ఉబికే ఉత్సాహంతో
కొత్త నిక్కరు, కమీజుతో మగ పిల్లలు
లంగా జాకెట్‌తో ఆడ పిల్లలు
ఊరంతా దసరా ఘుమ ఘుమలే!

బడి దగ్గరే గుమికూడి వీధిలోకి ర్యాలీ
చేతిలో ధనుస్సు, పత్రి నింపిన సంచి
పిల్లల వెన్నంటే ఉపాధ్యాయులు
ఊరూ వాడా అందరూ అదే చెంత

ఇంటింటికీ పద్యాలతో పలకరింపులు
ఎవరి ఇంటికి వెళ్తే, ఆ ఇంటి పిల్లలే
అరుగుపై దసరా పద్యాలు ఆలాపన
మిగతా పిల్లలందరూ వంత పాటలు

పద్యం ఏదైనా చివరలో
'జయ జయ' 'జయ జయ'
'జయ మహా విజయా'...
అంటూ ముగించాల్సిందే

ప్రతీ పాట ముగింపులో
పిల్లలు ధనుస్సులు ఎక్కుపెట్టి
బుట్టల్లో నింపిన పూలు, పత్రి
ఇల్లు, గడపల్లోకి గుమ్మరించేవారు

చివరకు ఇంటి పెద్దలు ఇచ్చిన
కాయో పండో, తృణమో, పణమో!
గైపుచ్చుకొని, పెద్దల దీవెనలతో
మనస్ఫూర్తిగా ముగించేవారు

బాల్యమంటేనే ఒక జ్ఞాపకం
బాదర బంధీలేని ఒక భాగ్యం
తనివి తీరని సరదాల మయం
తిరిగి ఎన్నటికీ రాని మధురానందం!

- వినోద్ కుత్తుం
పలాస, శ్రీకాకుళం జిల్లా,
96343 14502.

నేను గీసిన బొమ్మ



గుంజి. వెంకట చంద్ర కిరణ్,
6వ తరగతి,
రెయిన్‌బో స్కూల్, నెల్లూరు.



జత చేయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన పక్షులు, జంతువుల పక్కనే వాటి నివాసాలు కూడా ఉన్నాయి. గజిబిజిగా ఉన్న వాటిలో ఏది, దేనికి నివాసమో కాస్త జత చేయరూ!



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



దసరా... చెడుపై మంచి సాధించిన విజయానికి షార్ట్ నేమ్. పోరాటతత్వాన్ని నింపుకోడానికీ, కష్టకాలంలో నెమరేసుకోడానికీ, కొత్త శక్తిని ఇంకించుకోవడానికీ సెలబ్రేట్ చేసుకునే పండుగ. మహిళల్లో సహజంగా ఉండే శక్తినీ, నేర్పునీ, పరాక్రమాన్నీ, పోరాటతత్వాన్నీ క్లిస్టర్ క్లియర్‌గా చూపించే ఉదాహరణ. ఈ మేల్ సుపీరియారిటీ సొసైటీ దూకుడుకు ట్రాఫిక్‌లో ఎదురయ్యే రెడ్ సిగ్నల్. కాదని బండిని లాగిస్తే... ప్రమాదం తప్పదు. ఢిల్లీ నుంచి హైదరాబద్‌కు, హైదరాబాద్ నుంచి కలకత్తాకు, ఆ తర్వాత నేరుగా ఆ ప్రమాదం మన ఇంటికి కూడా వస్తుంది. అప్పుడు క్యాండిల్ ర్యాలీలు చేసే ఓపిక కూడా ఉండదు. ఇది చివరి అవకాశాల సమయం. దిద్దుకోమని చెప్పే బ్రేకింగ్ న్యూస్.

నవచేతనమై .. జన కేతనమై ...

కాలం మారుతున్న కొద్దీ ముందుకు నడవాల్సిన సమాజం తడబడుతోంది. ప్రభుత్వాలు ఎత్తుకున్న పాట కూడా శృతి తప్పుతోంది. సాక్షాత్తూ పార్లమెంటుకు నడిచే నాయకులే, ముళ్లదారికి తోవ చూపుతున్నారు. కాషాయమో, సనాతనమో మరేదైనా కానీ మతం రాజకీయంలో రహదారిలో వస్తోంది. ముందుకు నడవాల్సిన దేశానికి రివర్స్ గేర్ పడుతోంది. ఇది ఒక దేశానికి ఒక సిటీ స్కాన్ తీయాల్సిన సమయం. దేశం గుండెల మీద స్టెతస్కోప్ పెట్టి చెక్ చేయాల్సిన సందర్భం. కొంత వైద్యం కావాలి. ఇంకొంత బ్రెయిన్ వాష్ కావాలి. ఒక గొప్ప కథ చెప్పి, దాని తాలూకా ఛార్జింగ్ నింపే పవర్ బ్యాంక్‌ను ఒక్కొక్కరి చేతిలో ఉంచాలి. సరిగ్గా మనసు పెడితే దీనికి అవసరమయ్యే శక్తి దసరా రూపంలో ఎంతో కొంత లభించేస్తుంది.

ఊరు పేరు మారుతుందంతే..!

ఢిల్లీ, కలకత్తా, హైదరాబద్, బెజవాడ.. నిర్భయ, ఆయేషా, దిశ పేర్లు మారుతున్నాయంతే. ఏ మెట్రోపాలిటన్ సిటీ మెట్రో రైల్లో విన్నా, ఏ నగరపు చౌరస్తాలో నిలబడ్డా, మరే పట్టణపు మార్కెట్ దగ్గర కాపుకాచినా స్త్రీ మానసానికవుతోన్న గాయాలే వినిపిస్తాయి. ఊర్లూ, పేర్లూ మారుతుంటాయంతే! అయితే కథలో ట్విస్ట్ ఇక్కడే ఉంది. ఇది చెప్పుకోవాల్సిన సందర్భం కూడా.

అమ్మలందరకీ ప్రతీకగా ఉండే అమ్మవారిని ఈ నవరాత్రుల సందర్భంగా పూజిస్తారు. దసరా ఉత్సవాల్లో ఊరూరా విగ్రహాలను పెట్టుకుంటారు. ఆమె వీర గాథలను తలుచుకుంటారు. ఉత్సవాలు చేసుకుంటారు. సంబరాలు జరుపుకుంటారు. ఇంటి పిల్లలను అమ్మవారిగా తయారుచేసుకుని మురిసిపోతారు. తీరా చూస్తే అదో చోట ఒక సగటు మహిళ ఊరికే అలా నడిచి వెళ్లడానికి కూడా భయపడే వాతావరణం అలముకొని ఉంటుంది.

పండుగ సెలబ్రేషన్‌లో భాగమైందే కానీ జీవితాల్లోకి రాలేదు. 'అమ్మవారి కథ' సెలవు రోజుల్లో కాలక్షేపమైంది. దైనందిక జీవితపు ఆచరణలోకి రాలేకపోయింది. పండుగ కేవలం అక్షరాల వరుసగా మిగిలిపోయింది.



విక్టిమ్ బ్లేమింగ్

అది ఏ దుర్ఘటన అయినా సరే, గాయపడింది మహిళ అయితే చాలు. విక్టిమ్‌నే బ్లేమ్ చేసే సంస్కృతి పెరిగిపోయింది. హత్యాచారాలపై జరిగే డిబేట్లన్నీ మహిళల వస్త్రాల చుట్టూ, వాళ్లు బయట తిరిగే సమయాల చుట్టూ తిరుగుతున్నాయి. అన్యాయం జరిగిందని మాట్లాడితే నోరెత్తిన గొంతు మీదే కత్తి పెడుతున్నాయి. సహానుభూతి సరే, సానుభూతి కూడా లేని తనం స్పష్టంగానే కనిపిస్తోంది. కొన్ని సందర్భాల్లో కేసుల్లో లీలామాత్రంగా కనిపించినా అదంతా వన్డే ర్యాలీ మచ్చట, వాట్సాప్ స్టేటస్‌లో 30 సెకండ్ల అప్డేట్ ... అంతే! ఆ తర్వాత షరా మూమూలే. మళ్లీ ఎత్తుకునేది పాత పాటనే. మహా అయితే ట్యూన్ కొత్తది అంతే. సలహాలూ, సూచనలూ, జాగ్రత్తలూ, చేసుకోవాల్సిన మరమత్తులూ అన్నీ గాయపడుతున్న వాళ్లకే. మహిళలకే.. ఇది ఇలానే కొనసాగితే... అమ్మవారే కాదు, మన అమ్మలు కూడా క్షమించరు.

చివరి సమయం

సందర్భాలు చాలానే వస్తున్నాయి. సమయమే దాటిపోతోంది. ఇంకెన్ని దసరాలు గడిస్తే ఆ స్ఫూర్తి లోలోపలకి ఇంకుతుంది. ఈ తీవ్రత తగ్గుతుంది. ఈ వాతావరణం నించి విముక్తి కోసం, ఏ రేషనల్ గీతాన్ని పాడుకోవాలి?. ఇంకే కొత్త విద్యను అభ్యసించాలి? నిజానికి స్త్రీపురుష సమానత్వం గురించి చెప్తే అది అప్పటికప్పుడు పూర్తిగా అబ్బేదేమీ కాదు. అది స్కూల్ నుంచే మొదలవ్వాలి. అంతకంతకూ పెరుగుతూ రావాలి. 'అందరూ సమానం, అందరకీ అన్నీ సమానం' అనే వేర్లు లోలోతుల నుంచీ పెరగాలి. అక్కడి నుంచీ అది ఆచరణ వరకూ రావాలి.

ఇటీవల జరిగిన కలకత్తా ఇష్యూని కూడా ఇప్పటి వరకూ ప్రభుత్వం ఒక కొలిక్కి తీసుకుని రాలేదు. మరోపక్క ఆ బాధితురాలినే కలకత్తాలో అమ్మవారిగా ప్రతిష్టించుకున్నారు. నిజానికి ఇది కనువిప్పును కలిగిస్తుందా? కనీసం పాలకుల్లోనైనా కదిలికను తీసుకొస్తుందా? అని చూస్తే మనకి మిగిలేది నిరాశే. రెండూ అగర్‌బత్తీలు, నాలుగు కొబ్బరి కాయలు, కాస్త ప్రసాదం. అంతే పూర్తయిపోతుంది. ఒక సశేషం కార్డు పడుతుంది. తరువాయి భాగంలో మరో దుర్ఘటన. పదే పదే ఇదే కథ పునరావృతం అవుతున్నందుకు సమాజం సిగ్గు పడాలి కదా! స్త్రీని చిన్నచూపు చూసే అన్ని రకాల పురాతన భావాలూ, హీన కాలపు వికృతాలు నశించేపోయేలా వాటి మూలాలను పెకళించి పారేయాలి కదా!

గేర్ మారాలి ...

బాధితుల చిట్టా మళ్లీ మళ్లీ మరింతగా పెరగకుండా ఉండాలంటే... ఇది గేర్ మార్చాల్సిన సమయం. తప్పదు ఇక ముందుకెళ్లాలి. ప్రక్షాళన జరిగే తీరాలి. అమ్మవారిని గౌరవించుకున్నట్టే ఆడవాళ్లని గౌరవించుకోవాలని ఇంపోజిషన్ రాసుకోవాలి. నేరస్తులని శిక్షించుకుండా, బాధితులనే విమర్శించే ప్రభుత్వాలని పక్కన కూర్చోబెట్టాలి.

మహిళలను వంటింటికి పరిమితం చేసే పురాతన భావజాలాన్ని ఇంజెక్ట్ చేస్తోన్న నాయకులకు బుద్ధి చెప్పాలి. ఈ దేశాన్ని ముందుకు నడిపించే వారినే నిలబెట్టుకుని మనం నిలబడాలి. పెద్ద పెద్ద కబుర్లతో హడావిడి చేసే నాయకుల ఆడంబరాల వల్ల మహిళా రక్షణ సాధ్యమైపోదు. ఓట్లను దండుకునే దండగమారి మనుషులు ఆడపిల్లల విషాదాన్ని ఒక మెట్టుగా వాడుకోవడం అత్యంత విచారకరం. వాళ్ల మెట్లన్నీ ఎక్కి పీఠాన్ని చేరేపోయాక కార్చిన కన్నీళ్లూ, చేసిన ప్రసంగాలూ వొట్టిపోవడం వొట్టి మోసకారితనం. అమ్మలూ అమ్మాయిలూ అమ్మవార్లూ ... ఎవరైనా సరే .. ఈ స్థితి నుంచి నిర్భయమైన దిశగా దూసుకువెళ్లాలంటే– అందరూ గొంతెత్తాలి. ప్రశ్నించాలి. పురాతన పన్నాగాల నుంచి, మార్కెట్టు వికృతాల నుంచి సామూహిక విముక్త గీతాలు పాడకుంటూ ముమ్మందుకు సాగిపోవాలి. అప్పుడే లోకమంతా పండగ. దశదిశలా ఉప్పొంగే ఉత్సాహాల ఉత్సవ శోభ. – సిద్ధార్థ

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68